www.andhrajyothy.com


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 15-6-2025 | పేజీలు: 18 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 60 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, బహుళ పక్షం తిథి: చవితి మ.3.52 తదుపరి పంచమి, నక్షత్రం: శ్రవణం రా.1.00 తదుపరి ధనిష్ఠ, వర్జ్యం: తె.5.02-6.39, దుర్ముహూర్తం: సా.5.02-5.54, అమృతఘడియలు: మ.2.19-3.58, రాహుకాలం: సా.4.30-6.00, సూర్యోదయం: 5.44, సూర్యాస్తమయం: 6.46 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
ఆదివారం | 15-6-2025
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru
విజయవాడ సిటీ**



www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 15-6-2025

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విజయవాడ సిటీ**

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 15-6-2025 | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**


బాలకృష్ణ, అల్లు అర్జున్‌లకు పురస్కారాలు అందజేస్తున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, దిల్‌రాజు


కన్నుల పండుగగా గద్దర్ అవార్డుల వేడుక

14 ఏళ్ల తర్వాత సినీ పురస్కారాలు అందించిన తెలంగాణ ప్రభుత్వం

'ఒకప్పుడు సినిమా అంటే బాలీవుడ్. ఇప్పుడు భారతీయ సినీ పరిశ్రమ అంటే తెలుగు సినీ పరిశ్రమే అని అంటున్నారు' అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా ప్రకటించిన 'గద్దర్' అవార్డులను శనివారం ఆయన అందించారు. "బెంగళూరు, అమరావతి, ముంబై.. ఇవేవీ మాకు పోటీ కాదు. వాళ్లంతా మాకు సోదరులు. తెలంగాణకు ఎవరైనా వచ్చి వ్యాపారం చేసుకోవచ్చు. హాలీవుడ్, బాలీవుడ్ కూడా తెలంగాణ గడ్డపై ఉండాలి. మీకు ఏం కావాలో చెప్పండి. అండగా ఉంటాం" అని రేవంత్ హామీ ఇచ్చారు. 6


2024 ఉత్తమ నటి పురస్కారం అందుకుంటున్న నివేదా థామస్

అసైన్డ్ భూములకు రెక్కలు



రూ. 75 కోట్ల భూమిని సెటిల్‌చేసిన రెవెన్యూ మనిషి

విశాఖలో మళ్లీ మొదలైన ఎన్‌వోసీ దందా


- 3 ఎకరాలు ఆయనకు.. 2 ఎకరాలు బ్రోకర్‌కు
- మాజీ సైనికుడి సతీమణికి కుచ్చుటోపీ
- ఈ డీల్‌తో రంగం మీదకు మరో మాజీ మంత్రి
- మనోరమ హిల్స్‌పక్కనే ఐదు ఎకరాలపై కన్ను
- బెజవాడ కేంద్రంగా విశాఖ అధికారుల భేటీలు
- ఎండాడ,పెందుర్తిలో 60 ఎకరాల డీ పట్టాపై డీల్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఏడాది క్రితం ఆయన కరుడు గట్టిన వైసీపీ నేత. పేదల చేతుల్లో ఉన్న అసైన్డ్ భూములతో ఉమ్మడి విశాఖ జిల్లా కేంద్రంగా పెద్ద వ్యాపారమే చేశారు. ఆ నాటి ప్రభుత్వంలో ముఖ్యపాత్రలో ఉన్న ఓ ఐఏఎస్ కుమారుడు, అల్లుడితో కలిసి అసైన్డ్ భూచక్రం తిప్పారు. భీమిలీ, పెందుర్తి, ఎండాడ, భోగాపురం ప్రాంతాల్లోని అతి ఖరీదైన భూములను హస్తగతం చేసుకొని ఒప్పందాలు చేసుకున్నారు. 2024 ఎన్నికల్లో వైసీపీ ఓడిపోతుందని బోధపడి ఎన్నికలకు కొద్దిరోజుల ముందే టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ మారినా భూదోపిడీ స్వభావం మారలేదు. రెవెన్యూ శాఖలో

మిగతా 12వ పేజీలో...

అవినీతి ఉండొద్దు



- జీరో కరెప్షన్ లక్ష్యంగా ఏపీ.. ఎవరు అవినీతికి పాల్పడినా సహించం
- ఆరోపణలు వస్తే తక్షణ విచారణ.. రుజువైతే ఆ వెంటనే చర్యలు తప్పవు
- ఐవీఆర్‌ఎస్ ప్రజాభిప్రాయ సేకరణపై సమీక్షలో చంద్రబాబు స్పష్టీకరణ
- 175 నియోజకవర్గాల్లో జాబ్ మేళాలు.. ఆగస్టు 15 నాటికి అన్ని సేవలూ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందుబాటులోకి 2
- 10 ముఖ్య సమస్యలపై దృష్టిపెట్టి పరిష్కరించాలని సీఎం దిశానిర్దేశం
- కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై అత్యధిక శాతం ప్రజలు సంతృప్తి

అత్యధిక మార్కులు 686

ఈసారి నీట్ కఠినం.. తగ్గిన మార్కులు, ఉత్తీర్ణుల సంఖ్య

- తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు నిరాశే
- టాప్-20లో ఇద్దరే.. టాప్-100లో 11 మంది
- రాజస్థాన్ విద్యార్థి మహేశ్‌కు టాప్ ర్యాంకు
- హైదరాబాద్ విద్యార్థి జీవన్ సాయికుమార్ 18వ ర్యాంకుతో దక్షిణాది రాష్ట్రాల్లోనే టాపర్
- రాష్ట్ర విద్యార్థి కార్తీక్‌రామ్‌కు19వ ర్యాంక్
- ర్యాంకుల్లో బాలురు.. ఉత్తీర్ణతలో బాలికల హవా
- జనరల్ కటాఫ్ 144 మార్కులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన నీట్ పరీక్ష ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు నిరాశే ఎదురైంది. ప్రతిసారీ టాపర్లలో నిలిచే తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఈసారి టాప్-10లో ఒక్కరు కూడా చోటు దక్కించుకోలేకపోయారు. టాప్-20లో ఇద్దరే

మిగతా 10వ పేజీలో...


జీవన్ (18వ ర్యాంకు)


కార్తీక్ (19వ ర్యాంకు)

ఇరాన్‌లో భారీ విధ్వంసం

ఇరాన్ ఆర్థిక మూలాలపై ఇజ్రాయెల్ గురి

- బుషెహర్, సౌత్‌పార్స్ చమురు క్షేత్రాలపై దాడి
- ఇరాన్ చుట్టూ 78 ఇజ్రాయెల్ ఫైటర్ జెట్లు
- 150 టార్గెట్లపై దాడులు.. 78 మంది మృతి
- ఆర్మీ, ఎమర్జెన్సీ, ఇంటెలిజెన్స్ చీఫ్‌ల దుర్మరణం
- ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రతిదాడిలో ముగ్గురి మృతి

టెల్‌అవీవ్/న్యూఢిల్లీ, జూన్ 14: ఇజ్రాయెల్ దాడులతో ఇరాన్‌లో భారీ విధ్వంసం జరుగుతోంది. శనివారం తెల్లవారుజాము వరకు ఇరాన్ క్షిపణి కేంద్రాలనే లక్ష్యంగా చేసుకున్న ఇజ్రాయెల్.. సాయంత్రం తొలిసారి ఆర్థిక మూలాలపై విరుచుకుపడింది. బుషెహర్ చమురు క్షేత్రాలు (ఇక్కడే అణు విద్యుత్తు కేంద్రం ఉంది), సౌత్ పార్స్ న్యాచురల్ గ్యాస్ క్షేత్రాలపై దాడులు చేసింది. ఆ ప్రాంతాల్లో పెద్దఎత్తున మంటలు

మిగతా 11వ పేజీలో...



విమాన ప్రమాదంపై ఉన్నతస్థాయి కమిటీ

- కూలడానికి కారణాలపై పరిశీలన
- భవిష్యత్తు భద్రతపై రోడ్‌మ్యాప్ 10
- 3 నెలల్లో కమిటీ నివేదిక వస్తుంది
- యాక్సిడెంట్‌లో తండ్రిని కోల్పోయా బాధిత కుటుంబాల ఆవేదనను అర్థం చేసుకోగలను: రామ్మోహన్‌నాయుడు
- 274కు చేరిన మృతుల సంఖ్య

కల్తీ ఇంధనమే కూల్చిందా?

- 2 ఇంజన్లు విఫలమయ్యే చాన్స్ తక్కువే
- ఎన్‌ఏఎల్ మాజీ అధికారి మురళీధర్

వైసీపీ ఆరోపణలు నిరూపిస్తే రాజీనామా చేస్తా!

» జగన్ రాజీనామా చేస్తారా? మంత్రి సవిత సవాల్



అమరావతి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆరోపిస్తున్న విధంగా తల్లికి వందనం నిధులు మంత్రి లోకేశ్ జేబులోకి వెళ్లినట్లు నిరూపిస్తే నేను ఎమ్మెల్యే, మంత్రి పదవులకు రాజీనామా చేస్తా. నిరూపించలేకపోతే పులివెందుల ఎమ్మెల్యే పదవికి వైఎస్ జగన్ రాజీనామా చేయగలరా?' అంటూ మంత్రి ఎస్ సవిత సవాల్ విసిరారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. 'గత ప్రభుత్వంలో చిన్నారులకు మేనమామనని చెప్పుకున్న జగన్... ఆ ఐదేళ్లలో బకాయిలు పెట్టి కంసమామగా మారితే... ఆ బకాయిలన్నీ చంద్రబాబు చెల్లిస్తూ, తల్లికి వందనం అమలు చేస్తున్నారు. ప్రజల్ని డైవర్ట్ చేయాలని చూస్తే ప్రజలే జగన్‌ను అధికారం నుంచి డైవర్ట్ చేశారు. కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదు' అంటూ మంత్రి సవిత ఎద్దేవా చేశారు.

రౌడీ రాజకీయాలకు తావు లేదు: నక్కా

అమరావతి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రైతుల పరామర్శ పేరుతో జగన్ రాజకీయాలు చేస్తున్నారని మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు ధ్వజమెత్తారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పొదిలిలో పొగాకు రైతుల పేరుతో జగన్ నానా యాగీ చేశారు. రౌడీలు, సంఘ విద్రోహ శక్తులను పోగేసి, రైతుల పరామర్శకు వెళ్లారు. 'ఎవడైనా రానీ, తొక్కి పడేస్తాం' అంటూ ఫ్లెక్సీలు పెట్టుకుని ఎవరైనా రైతుల పరామర్శకు వెళ్తారా? పొదిలి యాత్రకు 40 వేల మంది వచ్చారని జగనే స్వయంగా ప్రకటించారు. రైతుల పరామర్శకు అంత మందిని కూడగట్టాల్సిన అవసరం ఏంటి? పొదిలిలో అరెస్టు అయిన వారిలో 9 మందిపై ఉన్న కేసుల జాబితా పొదిలి ఓటర్ల జాబితా కన్నా పెద్దది. రాజకీయాల ముసుగులో రౌడీయిజం చేస్తుంటే ఎవరూ చూస్తూ ఊరుకోరు. మాజీ సీఎంగా రౌడీ రాజకీయాలు చేస్తారా? తప్పు చేసిన వారిపై కూటమి ప్రభుత్వం చట్టపరంగా చర్యలు తీసుకుంటుంది' అని నక్కా స్పష్టం చేశారు.

జగన్‌ను నమ్ముకుంటే జైలుకే: మాణిక్యాలరావు

అమరావతి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ అధ్యక్షుడు జగన్‌రెడ్డికి రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, వ్యవస్థలపై నమ్మకం లేదు' అని లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు ఆరోపించారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఈవీఎంలు ధ్వంసం చేసే వారిని, కోర్టు ఫైళ్లు తగులబెట్టే వారిని, హత్య చేసి డోర్‌డెలివరీ చేసే వారిని జగన్ హీరోలను చేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన జగన్‌ను నమ్ముకుని తప్పులు చేసిన నందిగం సురేశ్, కాకాణి గోవర్ధన్ రెడ్డి, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వంశీ లాంటి వారంతా జైలుకు వెళ్లి శిక్ష అనుభవిస్తున్నారు. జగన్ కూడా జైలుకు వెళ్లడం ఖాయం' అన్నారు.

ఏపీకి గాడ్‌ఫాదర్ చంద్రబాబు: అఖిలప్రియ

హైదరాబాద్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కన్నతల్లికి, సొంత చెల్లికి, అమరావతి రైతులకు వెన్నుపోటు పొడిచిన చరిత్ర జగన్‌ది అని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ విమర్శించారు. శనివారం, స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. 'సొంత బాబాయి హత్యను గుండెపోటుగా చిత్రీకరించి సునీతకు వెన్నుపోటు పొడిచింది ఎవరు? మీకు అండగా నిలిచి, ప్రజల్లో తిరిగిన షర్మిలకు వెన్నుపోటు పొడిచింది ఎవరు? విజయమ్మతో ప్రచారం చేయించుకొని, రాజకీయంగా ఆమె సేవలు వాడుకుని రాజీనామా చేయించి వెన్నుపోటు పొడిచింది ఎవరు?' అంటూ జగన్‌పై అఖిలప్రియ మండిపడ్డారు. తమ ప్రభుత్వం, ఇచ్చిన మాటకు కట్టుబడి ఎంత మంది చదువుకుంటే అంతమందికీ తల్లికి వందనం అమలు చేస్తోందన్నారు. ఈ పథకానికి ప్రాణం పోసిన నేత లోకేశ్ అని అన్నారు. ఏపీకి గాడ్‌ఫాదర్ సీఎం చంద్రబాబు అయితే... ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గేమ్ ఛేంజర్, మంత్రి లోకేశ్ రింగ్ మాస్టర్ అని అఖిలప్రియ అన్నారు.

అవినీతి ఉండొద్దు

జీరో కరెప్షన్ లక్ష్యంగా ఏపీ.. ఎవరు అవినీతికి పాల్పడినా సహించం

» ఆరోపణలు వస్తే తక్షణ విచారణ

» 10 ముఖ్యమైన సమస్యలపై అధికారులకు సీఎం దిశానిర్దేశం

» కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై అత్యధిక శాతం ప్రజలు సంతృప్తి



ఉండవల్లిలో అధికారులతో సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు

అమరావతి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): 'జీరో కరెప్షన్ లక్ష్యంగా రాష్ట్రంలో పాలనా వ్యవస్థను నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఏ శాఖలో ఎవరు అవినీతికి పాల్పడినా సహించేది లేదని హెచ్చరించారు. ఎక్కడ అవినీతి జరుగుతుందో అక్కడ ప్రధానంగా దృష్టి పెట్టి విచారణ జరపాలని, అవినీతి రుజువైతే తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏడాది పాలనపై ప్రజల నుంచి.. వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై వ్యక్తమైన అభిప్రాయాలపై శనివారం ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వంపై అత్యధిక స్థాయిలో సంతృప్తి వ్యక్తమైనట్లు ఐవీఆర్ఎస్, సీఎస్‌డీఎస్ అభిప్రాయ సేకరణలో వెల్లడైందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రజాభిప్రాయ సేకరణపై టెక్నికల్ ఆడిటింగ్ జరపాలని, సమస్యలు ఉన్న చోట సంతృప్తి పెంచేలా చూడాలని చంద్రబాబు ఆదేశించారు. సంక్షేమం, ఉద్యోగాల కల్పన, రహదారులు వంటి 10 ముఖ్యమైన ప్రజా సమస్యలకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చి.. వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వర్క్ ఫ్రమ్ హోమ్ వివరాలతో పాటు పెట్టుబడుల రాక, నైపుణ్య శిక్షణతో ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయో తెలియజేయాలని ఆదేశించారు. 175 నియోజకవర్గాల్లో జాబ్ మేళాలు నిర్వహించడంతో పాటు ఆగస్టు 15 కల్లా అన్ని సేవలను వాట్సాప్ గవర్నెన్స్ (మన మిత్ర) ద్వారా అందించాలని తెలిపారు. మరోవైపు దివ్యాంగులు, వృద్ధులకు రేషన్ సరుకులు ఇంటికి తీసుకువెళ్లి అందించే ప్రక్రియ మరింత మెరుగ్గా జరిగేలా ఆలోచన చేయాలని అధికారులను ఆదేశించారు. చౌకధరల దుకాణాలను పెంచడం, నగదు లేదంటే కూపన్లు ఇవ్వడం వంటి ప్రత్యామ్నాయాలపై లబ్ధిదారుల అభిప్రాయాలు తీసుకోవాలంటూ సీఎం దిశానిర్దేశం చేశారు. ఉచిత ఇసుక విధానం అమలులో ఇసుక లేని చోట్ల సంతృప్తి, ఇసుక ఉన్న చోట అసంతృప్తి ఉండటంపై ప్రాంతాల వారీగా అధ్యయనం చేయాలని చెప్పారు.

ప్రజాభిప్రాయం ఇలా..

- పింఛన్ల పంపిణీలో అవినీతి లేదని 85 శాతం మంది, ఇంటి దగ్గరే ఇస్తున్నారని 87.80 శాతం, ఉద్యోగుల ప్రవర్తన బాగుందని 83.90 శాతం మంది ఐవీఆర్ఎస్ ద్వారా తెలిపారు. సీఎస్‌డీఎస్ ఫీల్డ్ సర్వేలో లబ్ధిదారులను నేరుగా కలిసి ప్రశ్నించగా.. పింఛన్ల పంపిణీలో అవినీతి లేదని 93.90 శాతం, ఇంటి దగ్గరే ఇస్తున్నారని 93.30 శాతం, ఉద్యోగుల ప్రవర్తన బాగుందని 73.30 శాతం మంది చెప్పారు.
- అన్న క్యాంటీన్లు పరిశుభ్రంగా ఉన్నాయని 89.50 శాతం, ఆహారం నాణ్యత బాగుందని 79.30 శాతం, సమయపాలన పాటిస్తున్నారని 80.80 శాతం మంది ఐవీఆర్ఎస్ ద్వారా చెప్పారు.
- ఆసుపత్రులలో క్వాలిటీ చెకప్‌పై 68.40 శాతం, రక్త పరీక్షలపై 55 శాతం, ఉచిత మందుల పంపిణీపై 65.5 శాతం, సిబ్బంది ప్రవర్తనపై 71.3 శాతం సంతృప్తి వ్యక్తం చేశారు.
- మున్సిపాలిటీలలో రోజూ చెత్త సేకరణపై 68.10 శాతం, 24 గంటల్లో చెత్త డంప్ తరలింపుపై 57 శాతం మంది సంతృప్తి చెందారు.
- ఆలయాల్లో సౌకర్యాలు బాగున్నాయని 63.60 శాతం, దర్శనం బాగుందని 68 శాతం, ప్రసాదం నాణ్యత బాగుందని 77.70% భక్తులు చెప్పారు.
- ఆర్టీసీ బస్సుల్లో సీటింగ్, శుభ్రతపై 53.40 శాతం, నీటి సౌకర్యంపై 45.20 శాతం, టాయిలెట్స్ నిర్వహణపై 56 శాతం, బస్సుల సమయం-రూటు వివరాలపై 61.50 శాతం, బస్సులు సమయానికి బయల్దేరుతున్నాయని 69 శాతం, సమయానికి గమ్యస్థానాలకు చేరుకుంటున్నాయని 69.70%, సిబ్బంది ప్రవర్తన బాగుందని 72.40 శాతం, భద్రత బాగుందని 69.70% మంది చెప్పారు.
- నెలనెలా రేషన్ సరుకులు తీసుకుంటున్నామని 75.10 శాతం, సరుకుల నాణ్యత బాగుందని 73.80 శాతం మంది చెప్పారు. దీపం-2 డెలివరీ చార్జీలు వసూలు చేయడం లేదని 62.8 శాతం మంది చెప్పారు.
- ఎరువుల లభ్యత బాగుందని 60.90 శాతం మంది రైతులు చెప్పారు. సమయానికి విత్తనాల సరఫరా జరిగిందని 63 శాతం మంది తెలిపారు.
- తమ ప్రాంతాల్లో గంజాయి, డ్రగ్స్ సంబంధిత సమస్య ఉందని 27.40 శాతం మంది చెప్పగా.. పోలీసులు స్పందిస్తున్నారని 54.50 శాతం మంది చెప్పారు. పబ్లిక్ ప్రాంతాల్లో మహిళలపై హింస, వేధింపులు ఉన్నాయని 27.8 శాతం మంది చెబితే.. పోలీసుల స్పందన బాగుందని 59.50 శాతం, పోలీసులు చర్యలు తీసుకుంటున్నారని 56.30 శాతం మంది చెప్పారు.
- రిజిస్ట్రేషన్ సేవల్లో స్లాట్ బుకింగ్ ప్రాసెస్‌పై 63.40 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేయగా.. అవినీతి లేదని 62.30 శాతం మంది చెప్పారు.
- ఇసుక రిజిస్ట్రేషన్ ప్రాసెస్‌పై 70.60 శాతం, లభ్యతపై 67.50 శాతం, ధరపై 61.10 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. రెవెన్యూ సేవల్లో ఎఫ్ లైన్‌పై డబ్బులు వసూలు చేయడం లేదని 75.10 శాతం మంది చెప్పారు. విద్యుత్తు నిరంతరాయంగా సరఫరా అవుతోందని 61.60 శాతం మంది చెప్పారు. పంచాయతీల్లో ఇంటింటికీ చెత్త సేకరణ జరుగుతోందని 56.70 శాతం మంది చెప్పారు. ఎన్టీఆర్ వైద్య సేవల పథకం కింద అడ్మిషన్లపై 86.20 శాతం, సేవలపై 81.30 శాతం మంది బాగుందని తెలిపారు.

సవాల్ చేస్తే... సౌండ్ ఆఫ్!

» జగన్ ఆరోపణలపై లోకేశ్



'బురద చల్లడం... పారిపోయి ప్యాలెస్‌లో దాక్కోవడం... జగన్‌కు అలవాటు' అని మంత్రి లోకేశ్ ఎద్దేవా చేశారు. 'తల్లికి వందనం డబ్బులు నా జేబులోకి వెళ్లాయి అంటూ చేసిన ఆరోపణలు 24 గంటల్లో నిరూపించాలని చాలెంజ్ చేశాను. సమయం ముగిసినా రుజువు చేయలేదు. క్షమాపణ కోరలేదు. అందుకే మిమ్మల్ని ఫేక్ అనేది. లీగల్ యాక్షన్‌కు సిద్ధంగా ఉండండి. సమయం లేదు మిత్రమా! శరణమా... న్యాయ సమరమా? తేల్చుకోండి' అంటూ లోకేశ్ సవాల్ చేశారు. టీడీపీ రాష్ట్రస్థాయి నేత నాదెండ్ల బ్రహ్మం స్పందిస్తూ... 'రాష్ట్రం అభివృద్ధి చెందటం జగన్‌కి, అతని కాలకేయ ముఠాకు నచ్చదు.' అని విమర్శించారు.



డయా ఫ్రం వాల్ ప్రాంతంలో కేంద్ర జల సంఘం ప్రతినిధులు

పోలవరం పనులు ఎలా జరుగుతున్నాయ్!

» పోలవరాన్ని పరిశీలించిన కేంద్ర జల సంఘం

అమరావతి, పోలవరం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రంవాల్, బట్రస్ డ్యాంల నిర్మాణాలను కేంద్ర జల సంఘం బృందం శనివారం పరిశీలించింది. కేంద్ర జల సంఘం సభ్యుడు యోగేశ్ పైథాంకర్, చీఫ్ ఇంజనీర్ హెచ్.ఎస్.సెనెగర్, ప్రాజెక్టు అథారిటీ చీఫ్ ఇంజనీర్ రమేశ్ కుమార్‌ల బృందం ఉదయం ఏలూరు జిల్లా పోలవరం ప్రాజెక్టు కార్యాలయానికి చేరుకుంది. మోడల్ రూంలో ఉన్న ప్రాజెక్టు నమూనా పరిశీలించింది. అనంతరం ప్రాజెక్టు నిర్మాణంలో సీపేజీ నివారణ కోసం నిర్మిస్తున్న బట్రస్ డ్యాం, డయాఫ్రం వాల్, గ్యాప్ 1 నిర్మాణ పనులను, ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలు, స్పిల్ వే ప్రాంతాలను, కాంక్రీట్ మిక్సింగ్ ల్యాబ్‌లను పరిశీలించింది. కేంద్ర జల సంఘం బృందానికి సీఈ కె.నరసింహమూర్తి, ఎస్ఈ రామచంద్రారెడ్డి, ఈఈలు బాలకృష్ణ, శ్రీనివాస్ సంబంధిత వివరాలను తెలిపారు.

పనుల తీరుపై బృందం పరిశీలన

'డయాఫ్రమ్ వాల్ నిర్మాణ పనులు ఎలా సాగుతున్నాయి? నాణ్యతా ప్రమాణాలను ఎంత వరకూ పాటిస్తున్నారు? అంతర్జాతీయ నిపుణుల ప్యానెల్ ఆమోదించిన డిజైన్లు, ప్లాస్టిక్ కాంక్రీట్ మిశ్రమం సరిగ్గా వాడుతున్నారా?' అంటూ పలు విషయాలను సూక్ష్మ స్థాయిలో బృందం పరిశీలన చేసింది. ఈ క్రమంలోనే 'డిసెంబరులోగా డయాఫ్రమ్ వాల్ పూర్తి చేయగలరా?' అంటూ ఇంజనీరింగ్ అధికారులను సీడబ్ల్యూసీ ప్రతినిధులు ప్రశ్నించారని తెలిసింది. 'ఈ నెలలో పనులు వేగంగా జరుగుతున్నాయి. ఎలాంటి ప్రతిబంధకాలూ ఎదురు కాలేదు. నెలాఖరుకు సాధించిన లక్ష్యాన్ని బట్టి పనులు పూర్తి చేయడంపై స్పష్టమైన అంచనా వస్తుంది' అంటూ ఇంజనీర్లు బదులిచ్చారు. 'ప్రస్తుతానికి నిర్మాణానికి ఆటంకం లేదు. కాని భవిష్యత్‌లో వరద వస్తే ఎలా?' అంటూ సీడబ్ల్యూసీ బృందం సందేహాన్ని వ్యక్తం చేశారు. 'వరద వచ్చినా డయాఫ్రమ్ వాల్ నిర్మాణ పనులకు ఎలాంటి ప్రతిబంధకమూ ఎదురుకాకుండా ఉండేలా, 19 మీటర్ల ఎత్తులో వరదను తట్టుకునేలా చర్యలు తీసుకున్నాం. ఇది 20 నుంచి 22 మీటర్లకు చేరుకున్నా పనులు సాఫీగా సాగేలా చర్యలు తీసుకున్నాం. మరికొద్ది రోజుల్లో కీలక ప్రాంతాల్లో డయాఫ్రమ్ వాల్ నిర్మాణ పనులు పూర్తయిపోతాయి. చివర్లలో కొద్దిపాటి పనులు మిగిలినా పెద్ద ఆటంకం కాబోదు. జూలై నుంచి గోదావరి వరద ప్రవాహం పెరిగినా అక్టోబరు చివరి నాటికి తగ్గిపోతుంది.' అని ఇంజనీర్లువివరించారు.

సీఎంతో సినీ ప్రతినిధుల భేటీ వాయిదా

» ప్రముఖులు అందుబాటులో లేకపోవడంతోనే..

అమరావతి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరగాల్సిన తెలుగు సినిమా ప్రతినిధుల సమావేశం వాయిదా పడింది. షెడ్యూల్ ప్రకారం ఆదివారం సాయంత్రం పలువురు నిర్మాతలు, దర్శకులు, నటులు, 'మా' ప్రతినిధులు సీఎంతో భేటీ కావాల్సి ఉంది. అయితే సమావేశానికి రావాల్సిన వారిలో ఎక్కువ మంది షూటింగ్‌లలో ఉండడం, మరికొంత మంది విదేశాల్లో ఉండడంతో తాత్కాలికంగా వాయిదా పడింది. సినిమా రంగంలోని పలు విభాగాల్లోని ముఖ్యమైన వారు అందుబాటులో లేకపోవడంతో మీటింగ్‌ను రద్దు చేసినట్లు సీఎంవో అధికారులు తెలిపారు.

తల్లికి వందనం..
వైసీపీకి మరణ శాసనం: పెమ్మసాని

గుంటూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): 'సొంత పార్టీ ఎంపీలనే ఏకవచనంతో సంబోధిస్తూ అవమానించే కుసంస్కృతి జగన్‌ది' అని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆరోపించారు. గుంటూరులో శనివారం జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ వడ్రాణం హరిబాబు నాయుడు సన్మాన సభకు హాజరైన ఆయన జగన్ వైఖరిని తప్పుపట్టారు. 'ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కోసం సీఎం చంద్రబాబు ఎంత వరకైనా వెళతారు. తల్లికి వందనం పథకం అమలు వైసీపీకి మరణశాసనం లాంటిది. దేశంలోనే అత్యధికంగా నెలకు రూ.4 వేలు పెన్షన్ ఇస్తోన్న రాష్ట్రం మనది మాత్రమే' అని అన్నారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు మాట్లాడుతూ, 'గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో సహకార కేంద్ర బ్యాంకుల్లో వైసీపీ నాయకులు పందికొక్కుల్లా దోచుకుతిన్నారు. డీసీసీబీల్లో అవినీతిని వెలికి తీస్తాం. అక్రమార్కులను వదిలిపెట్టేదిలేదు' అని స్పష్టం చేశారు.

ఆ ఫీజులు ఎవరి ఖాతాల్లోకి?

» 2023-24 ఉన్నత విద్య ఫీజుల జమపై సందిగ్ధత

» వైసీపీ హయాంలో మూడు క్వార్టర్లు బకాయి

» దీంతో విద్యార్థుల నుంచే కట్టించుకున్న కాలేజీలు

» కొన్ని కాలేజీలకు మాత్రం వసూలు కాని వైనం

» ఆ ఫీజులు ఇప్పుడు ఎవరి ఖాతాల్లో వేయాలి?

» చెల్లింపుల వివరాలు సేకరిస్తున్న ప్రభుత్వం



అమరావతి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్య ఫీజుల విడుదల విషయంలో కొత్త సమస్య ఉత్పన్నమైంది. కాలేజీలకు బదులుగా తల్లిదండ్రులకు ఫీజులు జమచేసే విధానాన్ని గత వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టడం దీనికి కారణం. 2023-24 విద్యా సంవత్సరంలో అప్పటి వైసీపీ ప్రభుత్వం 3 క్వార్టర్ల ఫీజులు రూ.1800 కోట్లు మేర బకాయి పెట్టింది. దీంతో యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఆపేశాయి. చాలా కాలేజీలు మీరే ఫీజులు కట్టాలని డిమాండ్ చేశాయి. దీంతో చాలా వరకు విద్యార్థులు సొంతంగా ఫీజులు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకున్న పరిస్థితి. అయితే కాలేజీలకే ఫీజులు చెల్లిస్తామని, సర్టిఫికెట్ల విషయంలో విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దని కూటమి ప్రభుత్వం కాలేజీలకు హామీ ఇచ్చింది. అప్పటికే ఎక్కువ కాలేజీలు ఫీజులను వసూలు చేసుకున్నాయి. దీంతో ఇప్పుడు ఫీజులను కాలేజీల ఖాతాల్లో వేయాలా? విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో వేయాలా? అనేది ప్రభుత్వానికి అంతుపట్టడం లేదు. కాగా, ఇంకా విద్యార్థులు కట్టాల్సి ఉందని, అందువల్ల తమకే ఫీజులు చెల్లించాలని కాలేజీలు కోరుతున్నాయి. అయితే మొత్తం కాలేజీల ఖాతాల్లో వేస్తే.. ఇప్పటికే ఫీజులు చెల్లించిన వారి పరిస్థితి ఏంటనే ప్రశ్న తలెత్తింది. ఈ క్రమంలో అసలు ఎంత మంది విద్యార్థులు ఫీజులు కట్టారనే వివరాలను ప్రభుత్వం విద్యార్థుల నుంచే సేకరిస్తోంది. సచివాలయాల ద్వారా ఈ ప్రక్రియ ప్రారంభించింది. సచివాలయాల వారీగా 2023-24లో ఉన్నత విద్య చదివిన విద్యార్థుల వివరాలను పంపింది. సచివాలయాల ఉద్యోగులు విద్యార్థులను సంప్రదించి ఫీజులు చెల్లించారా? చెల్లిస్తే ఎంత మేర కట్టారు? అనే వివరాలు సేకరిస్తున్నారు. ఫీజులు చెల్లించినప్పుడు కాలేజీలు ఇచ్చిన రశీదులను అప్‌లోడ్ చేస్తున్నారు. అయితే ప్రభుత్వం కాలేజీల నుంచి కూడా వివరాలు తీసుకోవాలని భావిస్తోంది. ఒక్కో కాలేజీకి ఎంత ఫీజు కట్టాలి? అందులో విద్యార్థులు ఎంత చెల్లించారు? అనేది ధ్రువీకరణ చేసుకోనుంది. ఒకవేళ విద్యార్థులు, కాలేజీల వివరాల మధ్య వ్యత్యాసం కనిపిస్తే ఏం చేయాలనేది ప్రభుత్వం నిర్ణయించాలి. అలాగే కొంత ఫీజు కట్టి, కొంత పెండింగ్‌లో పెడితే ఏం చేయాలనేది కూడా ప్రభుత్వానికి అంతుపట్టడం లేదు.

విధానం మార్చడంతోనే చిక్కులు

వైసీపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నగదు జమ విధానం మార్చడమే విద్యార్థులు, తల్లిదండ్రులకు శాపంగా మారింది. ఈ పథకంలో మొదటి నుంచీ ప్రభుత్వం ఫీజులను నేరుగా కాలేజీల ఖాతాలకే వేసేది. మిగిలిన ఫీజును విద్యార్థులు కట్టుకునేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక.. మొత్తం ఫీజును రీయింబర్స్ చేస్తామని చెప్పినా, దాన్ని కాలేజీలకు జమ చేయకుండా తల్లిదండ్రుల ఖాతాల్లో వేసేలా మార్చారు. కానీ వైసీపీ హయాంలో ఒక్కసారి కూడా ఫీజులను సకాలంలో విడుదల చేయలేదు. దీంతో క్వార్టర్ ముగిసిన వెంటనే కాలేజీలు విద్యార్థులపై ఒత్తిడి చేసి ఫీజులు కట్టించుకున్నాయి.

మేం ఏం చేయాలి?

ప్రభుత్వం ఫీజులు విడుదల చేసినప్పుడు తీసుకుందామని వేచిచూసిన అతి కొద్ది కాలేజీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. 2023-24 విద్యార్థులు ఇప్పటికే బయటకు వెళ్లిపోయారు. ఇప్పుడు ప్రభుత్వం ఫీజులను తల్లిదండ్రులకు వేస్తే.. అవి వసూలు చేసుకోవడం తమవల్ల కాదని ఆ యాజమాన్యాలు ఆందోళన చెందుతున్నాయి. విద్యార్థులపై ఒత్తిడి చేయని తమకు న్యాయం చేయాలని కోరుతున్నాయి.



కేక్ కట్ చేసి పిల్లలకు తినిపిస్తున్న మంత్రి పార్థసారథి

ప్రతి కుటుంబానికీ 1.04 లక్షలు లబ్ధి

» వైసీపీ హయాంలో 30 వేలు మాత్రమే: మంత్రి కొలుసు

విజయవాడ (వన్‌టౌన్), జూన్ 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సగటున రూ.1.04 లక్షల లబ్ధి చేకూరుస్తున్నామని మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. విజయవాడ బందరు రోడ్డులోని ఆయన తన క్యాంప్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఏడాది కాలంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు, తల్లికి వందనం కార్యక్రమ విశేషాలను వెల్లడించారు. 'గత ప్రభుత్వం సగటున ప్రతి కుటుంబానికి కేవలం రూ.30 వేలు మాత్రమే లబ్ధి చేకూర్చగా, సూపర్ సిక్స్ ద్వారా కూటమి ప్రభుత్వం రూ.1.04 లక్షలు అందిస్తోంది. తల్లికి వందనం కార్యక్రమంలో ఇంటిలో ఎంత మంది చదువుకుంటే అంతమందికి డబ్బులు జమ చేస్తున్నాం. గత ప్రభుత్వం కేవలం ఒకరికి మాత్రమే లబ్ధి చేకూర్చింది. గత ప్రభుత్వంలో పిల్లల భవిష్యత్తు గురించి ఏమాత్రం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించి రాష్ట్రంలో పెట్టుబడులు తేవటానికి ఎంతో కృషి చేస్తోంది.' అని మంత్రి పార్థసారథి అన్నారు.

'తల్లికి వందనం'తో ఆర్థిక ఆసరా

» మార్కాపురంలో ఓ కుటుంబానికి 65 వేలు

» చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన తల్లిదండ్రులు



మార్కాపురంలో తల్లికి వందనం నగదు పొందిన ఐదుగురు పిల్లలతో లబ్ధిదారులు

ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణానికి చెందిన ఆవుల అల్లూరమ్మ, శ్రీనివాసులుకు ఆరుగురు సంతానం. చిన్నపాటి అద్దె రేకుల ఇంట్లో నివాసం ఉంటున్నారు. పాత ఇనుముకు ఉల్లిగడ్డలు అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు. పిల్లలు అంకాలు 10వ తరగతి, వీరాంజనేయులు 8వ తరగతి, శివకేశవ 7వ తరగతి, వెంకటస్వామి 5వ తరగతి, సాయిపల్లవి 2వ తరగతి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. ఆరో సంతానం బాబు(3) అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తున్నాడు. పిల్లలను పోషించేందుకే ఆ కుటుంబం తీవ్ర ఇబ్బందులు పడుతోంది. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద ఐదుగురు పిల్లలకు కలిపి రూ.65 వేలు తల్లి బ్యాంకు ఖాతాలో జమ చేసింది. దీంతో ఇక తమ కష్టాలు తీరుతాయని, పిల్లలను ఉన్నతంగా చదివించి తీర్చిదిద్దుతామని అల్లూరమ్మ తెలిపారు. తమ కుటుంబానికి ఆర్థిక ఆసరా ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

- మార్కాపురం, ఆంధ్రజ్యోతి

ఆరుగురు పిల్లలున్న జాబితా పునఃపరిశీలన

» ఆ తర్వాత వారికీ తల్లికి వందనం పథకం అమలు

అమరావతి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఆరుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలున్న తల్లుల జాబితా పునఃపరిశీలన అనంతరం వారికి కూడా తల్లికి వందనం పథకం నగదు జమ అవుతుందని పాఠశాల విద్యా శాఖ శనివారం తెలిపింది. ఒక తల్లికి ఎంతమంది పిల్లలున్నా అందరికీ పథకం అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేసింది. అర్హులు, అనర్హుల జాబితాలన్నీ గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లాయని, నగదు రానివారు సచివాలయాల వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. అర్హత ఉన్నట్లు రుజువైతే నగదు విడుదల అవుతుందని వివరించింది.

అమ్మమ్మ కల.. నాన్న ప్రోత్సాహం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

» రోజుకు 14 గంటల పాటు చదువు

» మాక్ టెస్టుల్లో దొర్లిన తప్పులు పునరావృతం కాకుండా సాధన

» దక్షిణాది టాపర్‌గా నిలవడం సంతోషం

'ఆంధ్రజ్యోతి'తో నీట్ ఆలిండియా 18వ ర్యాంకర్ కాకర్ల జీవన్ సాయికుమార్

వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన నీట్-2025 యూజీ పరీక్షలో రాష్ట్రానికి చెందిన కాకర్ల జీవన్ సాయికుమార్ జాతీయ స్థాయిలో 18వ ర్యాంకు సాధించాడు. తెలుగు రాష్ట్రాలతోపాటు దక్షిణాదిలోనే టాప్ ర్యాంకర్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా జీవన్ సాయికుమార్‌తో 'ఆంధ్రజ్యోతి' ముఖాముఖి మాట్లాడగా.. తాను పరీక్షలకు ఎలా సిద్ధమయ్యాడు ? కుటుంబసభ్యుల నుంచి లభించిన ప్రోత్సాహం, భవిష్యత్తు ప్రణాళిక తదితర అంశాలను పంచుకున్నాడు.

వైద్య వృత్తిని ఎందుకు ఎంచుకున్నారు ?

నేను డాక్టర్ అవ్వాలన్నది మా అమ్మమ్మ కల. ఆమె నన్ను చాలా గారాబంగా పెంచారు. అప్పట్లో ఓసారి ఆమె అనారోగ్యానికి గురవ్వగా.. "నువ్వు డాక్టరయితే నాకు వైద్యం చేసేవాడివిరా" అనేది. నా మూడున్నరేళ్ల వయసులోనే ఆమె చనిపోయింది. కానీ, నాతో అన్న మాటలు నా మనసులో బలంగా నాటుకుపోయాయి. అలా చిన్నప్పటి నుంచే డాక్టర్ కావాలని అనుకుంటున్నా.

ఏ కాలేజీలో చేరతారు?

ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చదవాలనుకుంటున్నాను. నాకు వచ్చిన ర్యాంకుతో ఆ కాలేజీలో సీటు వస్తుందనే నమ్మకముంది.



కుటుంబసభ్యులతో కాకర్ల జీవన్ సాయికుమార్

మీ విజయం వెనుక ఎవరెవరి ప్రోత్సాహం ఉంది?

మా అమ్మా, నాన్న, నాకు పాఠాలు చెప్పిన అధ్యాపకులు అంతా నన్ను ప్రోత్సహించారు. 'నీ ప్రయత్నం బలంగా చెయ్ ఫలితం కోసం ఆలోచించకు. ఆందోళన పెట్టుకోకుండా చదువు' అని చెబుతూ నాన్న నిత్యం ప్రోత్సహించేవారు. అమ్మ నాకు కావలసినవన్నీ ఏర్పాటు చేసేది. అధ్యాపకులు మార్కులు ఎలా తెచ్చుకోవాలనే మెళకువలు చెప్పేవారు. మాక్ టెస్టుల్లో ఏమైనా తప్పులు దొర్లితే అవి పునరావృతం కాకుండా జాగ్రత్తపడేవాడిని.

రోజు ఎంత సమయం చదివేవాడివి?

కాలేజీ, నీట్ శిక్షణ కేంద్రంలో కలిపి రోజుకు 14 గంటలు చదివేవాడిని. అయితే ఎంతసేపు చదివామన్నది కాదు, ఎంత మనసుపెట్టి చదివామనేదే ముఖ్యం.

ఈ ఫలితం ఊహించారా ?

నేను ఒత్తిడికి గురైన సందర్భాలు కొన్ని ఉన్నాయి. అయితే కీ చూశాక నాకు మంచి ర్యాంకు వస్తుందని కచ్చితంగా అనుకున్నాను. అయితే దక్షిణాదిలోనే మొదటి ర్యాంకు రావడం చాలా ఆనందంగా ఉంది.

మాటలు రావడం లేదు..

మాది ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా. నేను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ బోధిస్తున్నాను. నా భార్య గృహిణి. పరీక్ష ముందురోజు మా అబ్బాయి చాలా ఒత్తిడికి గురయ్యాడు. శక్తివంచన లేకుండా ప్రయత్నించావు. అనుకున్న ర్యాంకు వస్తే సంతోషం. ఒకవేళ ఇది మిస్ అయితే నీకోసం వేరే రంగం ఎదురు చూస్తుందని అనుకోవాలని చెప్పా.. ధైర్యంగా వెళ్లి పరీక్ష రాసి వచ్చాడు. కీ చూసుకున్నాక తప్పకుండా ర్యాంకు వస్తుందని చెప్పినపుడు మా కుటుంబం చాలా సంతోషించింది. ఈరోజు ఫలితాలు చూశాక ఇక చెప్పడానికి మాటలు రావడం లేదు.

- గంగాధర నాగ కుమార్ (సాయికుమార్ తండ్రి)

భూదాన్ భూములపై లోతైన కుట్ర!

ఫోర్జరీ పత్రాలతో రికార్డుల మార్పు.. సర్వే 194, 195 కొనుగోళ్లూ అబద్ధమే

- ఆ సర్వే నంబర్లలో మహేశ్ భగవత్, సౌమ్యామిశ్రా, స్వాతి లక్రా, రవిగుప్తా, తరుణ్‌జోషి, రేణుగోయల్, బీకే రాహుల్ హెగ్డే, రాహుల్ బుసిరెడ్డి, వీరన్నగారి గౌతమ్‌రెడ్డి, రేఖా షరాఫ్ కొనుగోళ్లు
- పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తే.. మరిన్ని విషయాలు బయటకొస్తాయి
- హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసిన ఈడీ
- చట్టబద్ధంగా కొన్నాం: ఐఏఎస్, ఐపీఎస్‌లు

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నాగారం భూదాన్ భూముల అన్యాక్రాంతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సంచలన విషయాలను వెల్లడించింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలోని 181, 182, 194, 195 తదితర సర్వే నంబర్లలో ప్రభుత్వ భూదాన్ భూములను ఫోర్జరీ పత్రాలతో ఏఐఎస్‌లు, ఐపీఎస్‌లు తమ పేర్లపై బదిలీ చేయించుకున్నారని, ఈ తతంగం వెనక లోతైన కుట్ర ఉందని ఆరోపించింది. దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తే.. మరిన్ని విషయాలు బయటకు వస్తాయని అభిప్రాయపడింది. ఈ మేరకు హైకోర్టులో కౌంటర్ దదాఖలు చేసింది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. ఏపీ, తెలంగాణకు చెందిన సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు నాగారంలోని భూములకు సంబంధించి ఫోర్జరీ పత్రాలతో రెవెన్యూ రికార్డులను తారుమారు చేశారని, ఈ వ్యవహారంలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు కుమ్మక్కయ్యారని పేర్కొంటూ మహేశ్వరం మండలం అమీర్‌పేట్ గ్రామానికి చెందిన బీర్ల మల్లేశ్ హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. సదరు సర్వే నెంబర్లలోని భూములను నిషేధిత జాబితాలో పెట్టాలంటూ ఏప్రిల్ 24న ఆదేశాలు జారీచేసింది. అయితే.. సర్వే నెంబర్లు 194, 195లో తాము చట్టబద్ధంగా భూములను కొనుగోలు చేశామని.. ఏకపక్షంగా తమ వాదన వినకుండా సదరు సర్వే నంబర్లను నిషేధిత జాబితాలో పెట్టడం చెల్లదని.. ఈ మేరకు సింగిల్ జడ్జి ఆదేశాలను కొట్టేయాలని.. పలువురు ఐపీఎస్‌లు, వారి కుటుంబ సభ్యులు– మహేశ్ భగవత్, సౌమ్యామిశ్రా, స్వాతి లక్రా, రవిగుప్తా, తరుణ్‌జోషి, రేణుగోయల్, బీకే రాహుల్ హెగ్డే, రాహుల్ బుసిరెడ్డి, వీరన్నగారి గౌతమ్‌రెడ్డి, రేఖా షరాఫ్ తదితరులు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేశారు. ఈ వ్యవహారాన్ని సింగిల్ జడ్జి వద్దే తేల్చుకోవాలని డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది. దీంతో బీర్ల మల్లేశ్ దాఖలు చేసిన పిటిషన్ మళ్లీ సింగిల్ జడ్జి వద్దకు వచ్చింది. ఈ క్రమంలోనే సింగిల్ జడ్జి ధర్మాసనం ఎదుట ఈడీ దాఖలు చేసిన కౌంటర్ సంచలనంగా మారింది. ఇదే వ్యవహారానికి సంబంధించి అప్పటి కలెక్టర్ అమోయ్‌కుమార్‌ను సైతం ఈడీ విచారించింది.

- ఇది ప్రభుత్వ భూములకు సంబంధించిన వ్యవహారం అని తెలిసి కూడా అప్పటి తహసీల్దార్-కం-జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ ఆర్పీ జ్యోతి నేరపూరిత కుట్రలో భాగస్వామిగా తప్పుడు పత్రాలను స్వీకరించడం ద్వారా ప్రభుత్వ భూమిని ప్రైవేటు బిల్డర్స్ పరంచేశారు. ఈ విధంగా ఖాదరున్నీసా, ఆమె కుమారుడు మునార్‌ఖాన్, ఆర్పీ జ్యోతి, బొబ్బిలి దామోదర్‌రెడ్డి తదితరులు నోటిపై చేసిన ప్రభుత్వ భూమిని విక్రయించి నేరానికి పాల్పడ్డారు.

కౌంటర్‌లో ఈడీ పేర్కొన్న అంశాలివే..

- ప్రాథమిక దర్యాప్తులో ఈ వ్యవహారంలో లోతైన కుట్ర దాగి ఉందని స్పష్టంగా తెలుస్తోంది. ఫోర్జరీ, దొంగ డాక్యుమెంట్లతో రెవెన్యూ రికార్డులను తారుమారు చేశారు. తహసీల్, జిల్లా, సీసీఎల్ఏ స్థాయిలో రెవెన్యూ రికార్డుల్లో ఉన్న వాస్తవ విషయాలను పక్కనపెట్టి.. దొంగ పత్రాలను చేర్చారు. తద్వారా విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయ్యాయి. సర్వే నంబర్ 181, 182లో ఉన్న ప్రభుత్వ భూములకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇచ్చిన అప్పటి కలెక్టర్ అమోయ్‌కుమార్ వాగ్మూలాన్ని సైతం తీసుకున్నాం. పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తే.. ప్రభుత్వ అధికారులు, ఇతరుల పాత్రపై మరిన్ని విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉంది.
- నాగారంలోని సర్వే నంబర్లు 194, 195లలో ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు పాగావేశారు. సదరు సర్వే నంబర్ల గురించి ఎక్కడా ఎఫ్ఆర్ నమోదు కాలేదు. అందుకే మేం ఆ భూములపై దర్యాప్తు చేపట్టలేదు. అయితే సర్వే నంబర్లు 194, 195 గురించి పిటిషనర్ బీర్ల మల్లేశ్ వాంగ్మూలం ఆధారంగా వివరాలను తెలంగాణ డీజీపీకి పంపి.. ఎఫ్ఐఆర్ నమోదు చేసే విధంగా పరిశీలించాలని కోరం. అయితే డీజీపీ నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. మా దర్యాప్తులో కీలక విషయం ఏంటంటే.. సర్వే నంబరు 194లోని భూములను నవాబ్ హాజీఅలీ ఖాన్ నుంచి 1992లో అబ్దుల్ షకూర్ కుటుంబ సభ్యులు కొనుగోలు చేసినట్లు పత్రాలు ఉన్నప్పటికీ.. అబ్దుల్ షకూర్ ల్యాండ్ గ్రాబింగ్ చేసినట్లు ఇప్పటికే రెండు ఎఫ్ఆర్‌లు ఉన్నాయి. దీనిప్రకారం 1992లో 194 సర్వే నంబర్‌లో కొనుగోళ్లు మోసపూరితమని గుర్తించాం.
- సర్వే నంబర్లు 181, 182లో ఉన్న భూములను అసలు యజమాని అయిన నవాబ్ హాజీ అలీఖాన్ కుమారులైన అక్బర్ అలీఖాన్, ఫరూఖ్ అలీఖాన్‌ల నుంచి షేక్ దస్తగిరి షరీఫ్ అనే వ్యక్తి కొనుగోలు చేశారు. నవాబ్ హాజీ అలీఖాన్ కుమార్తె ఖాదరున్నీసా, ఆమె కుమారుడు మునావర్‌ఖాన్‌కు ఎలాంటి టైటిల్ లేకపోయినా.. అక్రమ పత్రాలతో తామే అసలు వారసులమంటూ పాస్‌పుస్తకాలను సంపాదించారు. ఖాదరున్నీసా, ఆమె కుమారుడు మునార్‌ఖాన్ 2021లో మరో 11 సేల్ డీడ్స్‌ను సృష్టించారు. మొత్తం 40 ఎకరాలను రూ.13.57 కోట్లకు విక్రయించారు. ఈ భూముల కొన్న నలుగురు.. 40 ఎకరాలను ఈఐపీఎల్ కన్‌స్ట్రక్షన్స్‌కు నాలుగు సేల్‌డీడ్‌ల ద్వారా రూ.17.50 కోట్లకు అమ్మేశారు. ఈ అక్రమాలపై షేక్ దస్తగిరి షరీఫ్ ఫిర్యాదుతో మహేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. దాని ఆధారంగా ఈడీ కేసు నమోదైంది. దాంతో అప్పటి కలెక్టర్ అమోయ్‌కుమార్‌ను విచారించింది.

విశాఖకు దక్షిణ కోస్తా జోన్ జీఎం

- ఆకస్మిక పర్యటన.. అధికారులతో చర్చలు



దక్షిణ కోస్తా రైల్వే జోన్ జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ (చిత్రంలో కుడి వైపు ఉన్న వ్యక్తి)కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఆర్ఎం లలిత్ మెహ్రా

విశాఖపట్నం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం కేంద్రంగా పని చేసే దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు జనరల్ మేనేజర్‌గా నియమితులైన సందీప్ మాథుర్ ఆకస్మికంగా నగరానికి వచ్చారు. ఆయన్ను ఈ నెల ఐదో తేదీన ప్రభుత్వం నియమించగా, అదే రోజు ఢిల్లీలో బాధ్యతలు స్వీకరించారు. ముందస్తు సమాచారం లేకుండా గురువారం రాత్రి ఇక్కడకు వచ్చిన ఆయన ఈస్ట్ పాయింట్ కాలనీలోని రైల్వే గెస్ట్ హౌస్‌లో బస చేశారు. శుక్రవారం డీఆర్ఎం కార్యాలయానికి వెళ్లి అధికారులను పరిచయం చేసుకున్నారు. ఇక్కడ ఉన్న విభాగాలు, వసతులపై చర్చించారు. శనివారం ఉదయం తిరుపతి బయలుదేరి వెళ్లారు. అక్కడ గుంతకల్ డివిజన్ అధికారులతో సమావేశం కానున్నారు. ఆ తరువాత విజయవాడ వెళ్లి అక్కడి అధికారులతో సమావేశమైన అనంతరం తిరిగి ఢిల్లీ వెళతారని సమాచారం.

ఆగస్టులో ఆపరేషన్ ప్రారంభం?

ఆగస్టు నుంచి విశాఖలో జీఎం కార్యాలయం ప్రారంభమవుతుందని విశ్వసనీయంగా తెలిసింది. ఈలోగా జీఎం కార్యాలయానికి అవసరమైన భవనం ఎంపిక జరుగుతుంది. అలాగే వాల్తేరు డివిజన్‌లో కొన్ని ప్రాంతాలను తీసుకువెళ్లి కొత్తగా ఏర్పాటుచేసిన రాయగడ డివిజన్‌లో కలిపిన సంగతి తెలిసిందే. ఒడిశా పెద్దలు ప్రస్తుతం వాల్తేరు డివిజన్‌లో భాగంగా ఉన్న కొత్తవలస స్టేషన్‌ను కూడా రాయగడకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఇటీవల ఢిల్లీకి పంపిన నివేదికలో కొత్తవలస ఈ డివిజన్‌లో ఉండాలని ఇక్కడి అధికారులు స్పష్టంచేశారు.

గోదావరి-బనకచర్లను అడ్డుకోండి

- ప్రాథమిక సాధ్యాసాధ్యాల నివేదికను తిరస్కరించండి
- కేంద్ర జలశక్తి మంత్రి పాటిల్‌కు తెలంగాణ మంత్రి ఉత్తమ్ ఘాటు లేఖ

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నికర జలాలు లేని ప్రాజెక్టుకు డీపీఆర్ దాఖలు చేయాలని ఎలా కోరతారని కేంద్ర జలశక్తి శాఖను తెలంగాణ ప్రభుత్వం ప్రశ్నించింది. గోదావరి-బనకచర్ల అనుసంధానంపై కేంద్ర వైఖరిని తప్పుబడుతూ ఈనెల 13న జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి లేఖ రాశారు. " గోదావరి-బనకచర్ల పీఎఫ్ఆర్‌ను సునిశితంగా పరిశీలిస్తున్నామని, ఈ నెలాఖరు నాటికి డీపీఆర్‌ను సమర్పించాలని ఏపీని కేంద్ర ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి కోరడం తీవ్ర అభ్యంతరకరం. ఒక పథకం డీపీఆర్‌ను కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ)లో దాఖలు చేయాలంటే తొలుత ప్రాథమిక సాధ్యాసాధ్యాల నివేదిక(పీఎఫ్ఆర్)కు ఆ విభాగం క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉంటుంది. అలాకాకుండా గోదావరి-బనకచర్ల అనుసంధానం డీపీఆర్ దాఖలు చేయాలని ఏపీని ఏ విధంగా కోరతారు..? తెలంగాణ హక్కులను హరించే ప్రాజెక్టుకు కేంద్రం మద్దతు తెలపడం సహజ న్యాయసూత్రానికి విరుద్ధం. అంతర్రాష్ట్ర నదీ జలాల్లో సమాన వాటాకు విరుద్ధం. ఈ అంశాల దృష్ట్యా పీఎఫ్ఆర్‌ను తక్షణమే తిరస్కరించేలా సీడబ్ల్యూసీని ఆదేశించాలి. ఈ పథకం డీపీఆర్‌ను కూడా సీడబ్ల్యూసీలో దాఖలు చేయకుండా నిలువరించాలి. టెండర్లు పిలవకుండా అడ్డుకోవాలి. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టానికి విరుద్ధంగా వెళుతున్న ఏపీని కట్టడి చేయాలి" అని ఉత్తమ్ లేఖలో పేర్కొన్నారు.

బనకచర్లపై సుప్రీం కోర్టుకు వెళతాం: హరీశ్

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): గోదావరి-బనకచర్ల అనుసంధానం ద్వారా ఆంధ్రప్రదేశ్ జల దోపిడీ చేస్తోందని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. గోదావరి పరీవాహక ప్రజలతో కలిసి బనకచర్ల ప్రాజెక్టుకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టుకు వెళతామని తెలిపారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును హరీశ్‌రావు వివరించారు. నాడు మహారాష్ట్రతో 2 టీఎంసీల నీటి కోసం బాబ్లీ ప్రాజెక్టుపై చంద్రబాబు పోరాటం చేశారని, నేడు 200 టీఎంసీల బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణంపై తెలంగాణ అంతకు ఎన్ని రెట్లు పోరాటం చేయాలని ప్రశ్నించారు. ఇది 200 టీఎంసీలతో ఆగిపోదని, భవిష్యత్తులో 400 టీఎంసీలకు పెంచుకునేందుకు ఏపీ సర్కార్ కుట్ర పన్నుతోందని హరీశ్ పేర్కొన్నారు.

నేడు రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు

విశాఖపట్నం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రకు ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఇంకా బంగ్లాదేశ్ నుంచి ఉత్తర బంగాళాఖాతం మీదుగా దక్షిణ ఒడిశా వరకూ, మరఠ్వాడ నుంచి తెలంగాణ మీదుగా కోస్తాంధ్ర వరకు వేర్వేరు ఉపరితల ద్రోణులు విస్తరించాయి. వీటి ప్రభావంతో శనివారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కోస్తాలో అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది. ప్రస్తుతం కోస్తాలో తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

భారతి, జగన్ క్షమాపణలు చెప్పాల్సిందే

- రాజధానిలో రైతులు, మహిళల నిరసన ప్రదర్శన



సాక్షి మీడియాను నిషేధించాలని తుళ్లూరులో మహిళలు, రైతుల నిరసన ప్రదర్శన

తుళ్లూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యల చేసిన వారిని అరెస్టు చేయాలని, దీని వెనుక ఉన్న మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి, వైఎస్ భారతి క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేస్తూ రాజధానిలో మహిళలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. తుళ్లూరులో రైతు జేఏసీ నేత పువ్వాడ సుధాకరరావు నేతృత్వంలో మహిళలు ప్లకార్డులు పట్టుకొని నిరసన ప్రదర్శన చేశారు. 'సాక్షి' డిబేట్‌లో అమరావతి మహిళలపై ఎనలిస్టు కృష్ణంరాజుతో కుట్రపూరితంగా వ్యాఖ్యలు చేయించారని, దీని వెనుక భారతీ రెడ్డి, జగన్‌రెడ్డి హస్తం ఉందని వారు ఆరోపించారు. జగన్, భారతి వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలను మానసిక క్షోభకు గురిచేస్తున్న వైసీపీ నేతలను, వారిని ప్రోత్సహిస్తున్న సాక్షి మీడియాను రాష్ట్రం నుంచి తరిమి కొట్టాలి... రాజధాని అభివృద్ధి నిరోధక అరాచక ప్రభుత్వాన్ని పెంచి పోషిస్తున్న సాక్షి మీడియాను వెంటనే నిషేధించాలి.. మహిళలను కించపరచిన వారిని కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేశారు.

రోత రాతల్ని సహించేది లేదు

- మంత్రి అచ్చెన్న



చిత్తూరు సెంట్రల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అదేపనిగా ప్రభుత్వంపై, కూటమి పార్టీలపై రోత రాతలు రాస్తే సహించబోమని మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరించారు. తిరుపతి, చిత్తూరు జిల్లాలో శనివారం పర్యటించిన ఆయన ధరల్లేక కుదేలైన మామిడి రైతుల పరిస్థితులను పరిశీలించారు. మద్దతు ధర అందేలా చూస్తామని వారికి భరోసా ఇచ్చారు. చిత్తూరులో జరిగిన సభలో మాట్లాడారు. గతేడాది జూన్ 12న అధికారం చేపట్టే నాటికి ప్రభుత్వం వెంటిలేటర్‌పై ఉండేదని గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో చంద్రబాబు నేర్పుగా ముందుకెళుతున్నారన్నారు. 'రూ.3 వేల సామాజిక పెన్షన్ రూ.4 వేలకు పెంచాం. పేదవాడి ఆకలి తీర్చేందుకు 170 నియోజకవర్గాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసి రూ.5కే భోజనం ఇస్తున్నాం. ఎంతమంది స్కూలుకెళ్లే పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం కింద రూ.13 వేలు ఇస్తున్నాం. మిగిలిన రూ.2 వేలు లోకేశ్ ఖాతాలో వేసుకున్నారని చెబుతున్న వారిని ఏమనుకోవాలి? విమర్శించిన వారు ధైర్యంగా ముందుకు వచ్చి నిరూపించాలి. అంతేకానీ రోత రాతలు రాస్తే ఊరుకునే ప్రసక్తే లేదు' అని హెచ్చరించారు.

అన్ని మండలాల్లో వికసిత్ భారత్ సంకల్ప సభలు

- ఏపీ బీజేపీ చీఫ్ పురందేశ్వరి

అమరావతి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో వికసిత్ భారత్ సంకల్ప సభలు నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ పదకొండేళ్ల పరిపాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమం పథకాల గురించి క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించడమే లక్ష్యంగా అన్ని మండల కేంద్రాల్లో సభలు నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆమె వెల్లడించారు.

మోదీ పదవి వీడాలి: కేఏ పాల్

న్యూఢిల్లీ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఎయిర్ ఇండియా విమాన ప్రమాద నేపథ్యంలో ప్రధాని మోదీ రాజకీయాలకు రిటైర్‌మెంట్ ప్రకటించి పదవి నుంచి దిగిపోవాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ డిమాండ్ చేశారు. ప్రధాని బాధ్యతలను అమిత్ షాకు అప్పగించాలన్నారు. శనివారం ఏపీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేఏ పాల్ మాట్లాడారు.



చిత్రపతి శివాజీ బొమ్మల సేన!

బొమ్మలు నిర్భయ ప్రకాశికలు. తెగువకి, ఎదురీతకి, నిలదీతకి నిజదర్శనాలు. ఒంటి రేఖాచిత్రమైనా సరే... కోటి సిపాయిల బలగాన్ని మించిన శక్తివంతం. ఒక వ్యంగ్యచిత్రం లక్ష అక్షరాలలో పొదిగిన భావానికంటే కూడా మహా మిన్న. వందశాతం గురి తప్పని బాలిస్టిక్ క్షిపణితో సమానం. ఇవి అతి శయోక్తులు కావు. క్రూర నియంతలను, కర్కోటక చక్రవర్తులను వేలెత్తి చూపి వెక్కిరించిన కార్టూనిస్టులు, చిత్రకారుల జీవిత కథలు కోకొల్లలు. ఏ ప్రజా కళకైనా ఉండేది అంతటి పదునే. అందుకే పాలకులకు అవంటే అస్సలు గిట్టదు.

పైకి వినిపించకపోవచ్చును గానీ బొమ్మలు మనతో సంభాషిస్తాయి. మనలోని ఖాళీలను ప్రేమతనంతో నింపుతాయి. శైశవ గీతాలకి కోరస్ ఇస్తాయి. మనసుకి గాయమైతే మందు పూస్తాయి. నిస్పృహ పుటని మూసేసి ఆశల మీటని సుతారంగా తడతాయి. ఈ ఊరడింపే కళా ప్రయోజనానికి సూచిక. ఈ వరుసలో ఇప్పుడు తలుచుకోవలసిన ముఖ్యులు తల్లావజ్ఝల శివాజీ. ఆయన సీనియర్ పాత్రికేయుడు, చిత్రకారుడు, రచయిత, కళా విమర్శకుడు. ఆయన రాతలో, గీతలో హాస్యమూ, సున్నితత్వమూ సమతూకంలో ఒదిగిపోతాయి. విషయం ఎంత గాఢమైనదైనా ఇట్టే జీర్ణమైపోవడం ఆయన చిత్రాల స్వభావం. ఒకానొక కాలంలో ఆర్టిస్ట్ రాజుతో కలిసి ఆయన సృష్టించిన 'లింగా ది గ్రేట్' కార్టూన్ కదంబం సూపర్ డూపర్ హిట్. అంతకంటే ముందే 'ఆ నీలి నగరిలో' పేరుతో శివాజీ ఒక నవలిక రాశారు. నగరానికి వచ్చిన ఒక బాలుడి జీవితంలో జరిగే సంఘటనలే ఇందులో కథాంశం. పిల్లల కోసమే శివాజీ ఎక్కువ ఆలోచిస్తారనడానికి ఇది మరొక దాఖలా. ప్రస్తుత ప్రస్తావనకి హేతువు కూడా ఇక్కడే ఉంది. గాజాలో గత కొన్ని నెలలుగా సాగుతున్న భీకర దాడుల్లో అసంఖ్యాకంగా పిల్లలు మరణించారు, మరణిస్తున్నారు. గాయపడ్డ చిన్నారుల సంఖ్య అంతకు అనేక రెట్లు అధికం. తప్పొప్పుల లెక్కలను అలా ఉంచితే, ఏ యుద్ధంలో అయినా అతిగా ఛిద్రమయ్యేది పిల్లలు, స్త్రీలు, వృద్ధుల జీవితాలే. గాజాలో ఇజ్రాయిల్ దళాల దాడుల్లో సాగుతున్న శిశువధ పట్ల ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఇజ్రాయిల్ పౌరసమాజం కూడా తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్న సందర్భాలున్నాయి. ఎక్కడికక్కడ కవులు, రచయితలు, గాయకులు, కళాకారులు, చిత్రకారులు సహా వివిధ శ్రేణులవారు రకరకాల రూపాల్లో నిరసనలు, ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో తల్లావజ్ఝల శివాజీ డజను వరకు చిత్రాలు వేశారు. 'ఓ.. నౌ వెకేట్ గాజా లిటిల్ డియర్', 'ప్లాంట్ హోప్ @ గాజా', 'ఐ లవ్ వార్ ఎనీ వేర్', 'లెట్ దేర్ బి హోప్.. గాజా', 'వెయిట్ యు విల్ హావ్ సమ్ మోర్.. గాజా' వంటి క్యాప్షన్స్‌తో శివాజీ వేసిన ఈ చిత్రాలు కార్టూన్ శైలిలో ఉన్నప్పటికీ, వ్యంగ్యం కంటే విషాదస్పర్శే మనసుని తాకుతుంది.

> క్రూర నియంతలను, కర్కోటక చక్రవర్తులను వేలెత్తి చూపి వెక్కిరించిన కార్టూనిస్టులు, చిత్రకారుల జీవిత కథలు కోకొల్లలు. ఏ ప్రజా కళకైనా ఉండేది అంతటి పదునే. అందుకే పాలకులకు అవంటే అస్సలు గిట్టదు.

జెరూసలెంలోని హిబ్రూ విశ్వవిద్యాలయం పూర్వ ఆచార్యులు డేవిడ్ షుల్మన్ ఇండియన్ స్టడీస్‌లో తులనాత్మక మత అధ్యయనం విభాగంలో ప్రొఫెసర్‌గా దీర్ఘకాలం పనిచేశారు. ఆయన కవి, చరిత్రకారుడు, ఇండాలజిస్ట్ కూడా. దక్షిణ భారత మత చరిత్ర, భారత రాజకీయాలు, ద్రవిడ భాషాశాస్త్రం, కర్ణాటక సంగీతం వంటి అంశాలలోనూ ఆయన నిష్ణాతులు. తమిళ, తెలుగు, హిందీ, సంస్కృత భాషల్లో పట్టున్న విద్యాధికుడు, పీస్ యాక్టివిస్ట్ కూడా. ఇజ్రాయిల్ యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా ఆ దేశ పౌరసమాజంతో కలిసి అనేక నిరసన ప్రదర్శనలు నిర్వహించారాయన. శివాజీ సోదరులు తల్లావజ్ఝల పతంజలిశాస్త్రికి షుల్మన్‌తో స్నేహ సంబంధాలు ఉండటంతో శివాజీ వేసిన చిత్రాలను షుల్మన్‌కి పంపించారు పతంజలిశాస్త్రి. వాటిని చూసిన షుల్మన్ ఎంతో ఆసక్తి కనబరిచి హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. ఇజ్రాయిల్ పాలకుల వైఖరిని నిరసించే అక్కడి పౌరసమాజ ప్రముఖుడి ప్రశంసలందుకున్న చిత్రాలు ఈ శివాజీ బొమ్మలు.

గాజాపై సాగుతున్న దాడిని వ్యతిరేకిస్తూ నేడు మధ్యాహ్నం హైదరాబాద్‌లోని లా మకాన్‌లో 'హైదరాబాద్ ఫర్ ద చిల్డ్రన్ ఆఫ్ గాజా' పేరుతో ఒక కార్యక్రమం జరుగుతున్నది. ఇందులో కవి గాయకులు, చిత్రకారులు, కళాకారులు, ప్రజాసంఘాల నేతలు పాల్గొంటున్నారు. ఈ తరుణంలో శివాజీపై గౌరవంతో ఆయన చిత్రాలను పోస్టర్లుగా తీర్చి ప్రత్యేకంగా ప్రదర్శించనున్నారు. యుద్ధ వ్యతిరేక చిత్రకారుడు, చిన్నారుల శ్రేయోభిలాషి శివాజీకి అభినందనలు.

ఒమ్మి రమేష్‌బాబు

సింధు జీవధార సమరాయుధమా?

ఒక దేశం యుద్ధంలో ఉన్నప్పుడు ఆ దేశ ప్రజలు, నాయకులు శత్రుదేశానికి వ్యతిరేకంగా తీవ్ర ప్రకటనలు చేస్తారు. అవి ఆచరణ సాధ్యంకాకున్నా సరే. కానీ, బాధ్యతాయుతమైన నాయకులు ఆ ప్రకటనలను పదేపదే పునరుద్ఘాటిస్తే దేశ ప్రయోజనాల దృష్ట్యా వాటిని నిశితంగా పరిశీలించవలసి ఉన్నది. సింధు నదీజలాల ఒప్పందం (ఇండస్ వాటర్ ట్రీటీ– ఐడబ్ల్యుటి) విషయంలో అటువంటి పరిస్థితే ఇప్పుడు భారత్‌కు తటస్థించింది.

సింధు నదీజలాల ఒప్పందం గురించి రాజకీయవేత్తలు ఇప్పుడు ఏమి మాట్లాడుతున్నప్పటికీ అది కాల పరీక్షకు నిలిచింది. భారత్, పాకిస్థాన్‌ల మధ్య మూడు యుద్ధాలు జరిగినా వాటి ప్రభావం దాని అమలుపై పడలేదు. ఆ ఒప్పందాన్ని చారిత్రక తప్పిదంగా కొందరు ఘోషిస్తున్నారు. ఇది వివేకవంతమైన అభిప్రాయం కాదు. అంతకంటే మెరుగైన, ఉభయత్రా మేలైన ఒప్పందం ఇప్పుడు సాధ్యం కాదు.

ఇరుగు పొరుగు దేశాలతో ఉమ్మడి నదీ పరీవాహక ప్రాంతాలున్న దేశం భారత్ మాత్రమే కాదు. ప్రపంచ వ్యాప్తంగా కనీసం 286 నదీ పరీవాహక ప్రాంతాలను ఒకటి కంటే ఎక్కువ దేశాలు కలిగి ఉన్నాయి. 150కి పైగా దేశాలు వివిధ నదీ పరీవాహక ప్రాంతాలను పంచుకుంటున్నాయి. రాజకీయ సరిహద్దులను అధిగమించే నదీ పరీవాహక ప్రాంతాలు ప్రపంచ భూ విస్తీర్ణంలో 42 శాతంగా ఉన్నాయి. ఈ పరీవాహక ప్రాంతాలలో 300 కోట్ల మంది ప్రజలు నివసిస్తున్నారు. ఈ రివర్ బేసిన్‌ల నిర్వహణ, యాజమాన్యం వివిధ ఒప్పందాలకు అనుగుణంగా జరుగుతోంది. మన దేశం వివిధ నదీ పరీవాహక ప్రాంతాలను డజన్‌కు పైగా దేశాలతో పంచుకుంటున్నది. ఆయా ప్రాంతాలకు భారత్ ఎగువ దేశంగాను, దిగువ దేశంగాను ఉన్నది. నదీజలాల పంపకానికి సంబంధించి అనేక అంతర్జాతీయ ఒప్పందాలు, మార్గదర్శక సూత్రాలు, చారిత్రక రివాజులు ఉన్నాయి. ప్రపంచ అగ్రరాజ్యంగా ప్రభవించాలని ఆకాంక్షిస్తున్న భారత్ వాటన్నిటినీ గౌరవించవలసి ఉన్నది. అది అనివార్యం. నీరు, ప్రాదేశిక హక్కులు ఉన్న భూమి కాదు. నది సదా దిగువకే ప్రవహిస్తుంది. వివిధ చట్టాల ప్రకారం నీటి నిర్వహణ, యాజమాన్యం ఉంటుంది. ఇది ఎవరూ కొట్టివేయలేని సత్యం.

నదీ పరివాహక ప్రాంతాలకు సంబంధించిన ఒప్పందాలలో సింధు నదీజలాల ఒప్పందం (ఐడబ్ల్యుటి) కొంత మేరకు భిన్నమైనది. 1947లో దేశ విభజన కాలం నుంచి భారత్, పాకిస్థాన్‌ల మధ్య అపరిష్కృతంగా ఉన్న వివాదాన్ని సింధు ఒప్పందం ఒక కొలిక్కి తీసుకువచ్చింది. ప్రపంచవ్యాప్తంగా చాలా నదీ పరీవాహక ప్రాంతాల ఒప్పందాలు నదీజలాల పంపకానికి సంబంధించినవి కాగా ఐడబ్ల్యుటి నదుల విభజనకు సంబంధించినది. ఈ ఒప్పందం సమకూర్చిన ఏర్పాటును భారత్ స్వయంగా కోరుకున్నదే. ఇటువంటి ఏర్పాటుకు భారత్ 1954లో సానుకూలత చూపగా పాకిస్థాన్ దాన్ని అంగీకరించేందుకు చాలా సంవత్సరాలు తీసుకున్నది. ఐడబ్ల్యుటి కింద సింధు నదీ వ్యవస్థను పశ్చిమ, తూర్పు నదులుగా విభజించారు. పశ్చిమ నదులు అయిన జీలమ్, చీనాబ్, ఇండస్‌ను పాకిస్థాన్‌కు కేటాయించారు. తన భూభాగాల గుండా ప్రవహించే ఈ నదుల నీటిని భారత్ చాలా పరిమితంగా మాత్రమే వినియోగించుకోవలసి ఉన్నది. ఆ నదులలో మొత్తం ప్రవాహ పరిమాణంలో ఎటువంటి తేడా సంభవించకుండా ఉండేలా మాత్రమే వినియోగించుకోవాలి. ఈ ప్రకారం ఆ మూడు పశ్చిమ నదులపై భారత్ ఎటువంటి ఆనకట్టలు నిర్మించకూడదు. తూర్పు నదులు అయిన రావి, బియాస్, సట్లేజ్‌లను భారత్‌కు కేటాయించారు. ఈ మూడు నదులు పాకిస్థాన్‌లోకి ప్రవేశించేంతవరకు వాటిపై పూర్తి నియంత్రణ భారత్‌కు ఉంటుంది. ఈ నదులలోని ప్రతి చుక్క నీటిని భారత్ వినియోగించుకోవచ్చు. పాకిస్థాన్‌కు ఏ మాత్రం నీరు ప్రవహించకుండా చేసేందుకు కూడా భారత్‌కు హక్కులు ఉన్నాయి. పాకిస్థాన్‌కు ఆ నదులు ప్రవహించకుండా భారత్ అడ్డుకున్నా అది ఐడబ్ల్యుటి ఉల్లంఘన కిందకు రాదు.

సింధు నదీపరివాహక ప్రాంతం నాలుగుదేశాల– పాకిస్థాన్, భారత్, చైనా, అఫ్ఘానిస్తాన్–లో 1.14 మిలియన్ చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్నది. సింధు ఆయకట్టులో నివసిస్తున్న మొత్తం జనాభా 2025లో 320మిలియన్లు. 2050 సంవత్సరం నాటికి ఈ జనాభా 380 మిలియన్లకు పెరగవచ్చని అంచనా. ఈ జనాభాలో 110 మిలియన్ (35శాతం) భారత్‌లో ఉండగా 195 మిలియన్ (61శాతం) పాకిస్థాన్‌లో ఉన్నారు. మిగతా 4శాతం మంది



> ఐడబ్ల్యుటి భవిష్యత్తును న్యూఢిల్లీలో నిర్ణయించేందుకు ఆస్కారం లేనేలేదు. అంతర్జాతీయ వేదికలలో లేదా అంతర్జాతీయ న్యాయస్థానంలో దానిపై నిర్ణయమవుతుందనేది స్పష్టం.

అఫ్ఘానిస్తాన్‌లో ఉన్నారు. చైనా పరిధిలో ఉన్న జనాభా సంఖ్య ఉపేక్షింపదగినది. పాకిస్థాన్ జనాభాలో 80 శాతం మంది, భారత్ జనాభాలో 8 శాతం మంది సింధు నదీపరివాహక ప్రాంతంలోనే నివసిస్తున్నారు.

సింధు బేసిన్‌లో లభ్యమయ్యే మొత్తం ఉపరిత జలాల పరిమాణం 239 బిలియన్ క్యూబిక్ మీటర్లు (బిసిఎమ్). ఇందులో తూర్పు నదుల నుంచి ప్రవహించేది 73.3 బిసిఎమ్‌లు. ఈ జలాలపై భారత్‌కు సంపూర్ణ హక్కులు ఉన్నాయి. వివిధ ప్రాకృతిక కారణాల వల్ల భారత్ ఈ జలాలను పూర్తిగా వినియోగించుకోలేకపోతోంది. కేవలం 46 బిసిఎమ్‌లను మాత్రమే వినియోగించుకోగలుగుతుంది. భారత్ తన అవసరాలకు తగ్గట్టుగా ఈ నీటిని వినియోగించుకోవచ్చు. అయితే కేవలం 16.3 బిసిఎమ్‌లను మాత్రమే నిల్వచేసుకోగల సామర్థ్యం మాత్రమే కలిగి ఉంది. మిగతా జలాలు పాకిస్థాన్‌లోకి ప్రవహిస్తున్నాయి. వాటిని నిలిపివేసే హక్కు భారత్‌కు ఉన్నది. అయితే వాటిని నిల్వ చేసుకునే సామర్థ్యం భారత్‌కు లేదు. పాకిస్థాన్‌కు కేటాయించిన పశ్చిమ నదుల నుంచి లభ్యమయ్యే సగటు నీటి సామర్థ్యం 165 బిసిఎమ్. ఐడబ్ల్యుటి ప్రకారం వాటిని సంపూర్ణంగా వినియోగించుకునే హక్కు పాకిస్థాన్‌కు ఉన్నది. తన భూభాగాల గుండా ప్రవహించే ఈ పశ్చిమ నదుల నీటిని మళ్లించేందుకుగానీ, నిల్వచేసుకునేందుకుగానీ భారత్‌కు హక్కు లేదు.

ఐడబ్ల్యుటి ఇప్పటికే అంతర్జాతీయ అంశమయింది. పాకిస్థాన్ దాన్ని తన ప్రచారానికి, ఉగ్రవాదంపై చర్చను దారి మళ్లించేందుకు పూర్తి స్థాయిలో ఉపయోగించుకుంటుంది. సాయుధ సంఘర్షణ కాలంలో నదీజలాల పరిరక్షణ విషయమై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి నిర్వహించిన ఒక సమావేశంలో భారత రాయబారి మాట్లాడుతూ సింధు నది ఎగువ ప్రాంత దేశంగా భారత్ ఎల్లప్పుడూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ వస్తోందని పునరుద్ఘాటిస్తూ ఐడబ్ల్యుటి పీఠిక ప్రస్తావించిన 'సుహృద్భావ, స్నేహ స్ఫూర్తి'ని పాకిస్థానే ఉల్లంఘించిందని విమర్శించారు. ఉగ్రవాదులు తుల్‌బుల్ నేవిగేషన్ ప్రాజెక్ట్‌పై కూడా దాడి చేశారని ఆయన పేర్కొన్నారు. పాక్ ప్రేరేపిస్తున్న ఉగ్రవాదుల వల్ల ఆ ప్రాజెక్ట్ భద్రతకు, ప్రజల ప్రాణాలకు రక్షణ కొరవడుతోందని భారత రాయబారి అన్నారు. అదే సమావేశంలో పాకిస్థాన్ ప్రతినిధి సైమా సలీమ్ మాట్లాడుతూ పాకిస్థాన్‌లో 24కోట్ల ప్రజలకు ప్రాణరక్షకంగా ఉన్న సింధు జలాల ప్రవాహానికి భారత్ అవరోధాలు కల్పిస్తోందని అంటూ, 'నీరే ప్రాణం. అది సమరాయుధం కానేకాదు' అని వ్యాఖ్యానించారు. చెప్పవచ్చినదేమిటంటే ఐడబ్ల్యుటి భవిష్యత్తును న్యూఢిల్లీలో నిర్ణయించేందుకు ఆస్కారం లేనేలేదు. అంతర్జాతీయ వేదికలలోను లేదా అంతర్జాతీయ న్యాయస్థానంలో దానిపై విస్తృత చర్చల ద్వారా అది నిర్ణయమవుతుందనేది స్పష్టం. సింధు వివాదానికి ఇటువంటి పరిష్కారం కోసమే పాకిస్థాన్ సకల ప్రయత్నాలు చేస్తోంది.

పహల్గాం ఉగ్రఘాతుకానికి మొదటి ప్రతిస్పందనగా సింధు నదీజలాల ఒప్పందం అమలును నిలిపివేస్తామని భారత్ ప్రకటించింది. 2016లో కూడా భారత్ ఇటువంటి హెచ్చరికే చేసింది. అయితే అప్పుడుగానీ, ఆ తరువాత గానీ ఏమీ జరగలేదు. తమ పోరాటం ఉగ్రవాదుల నిర్మూలనకేనని భారత్ పదేపదే చెప్పుతుండగా ఐడబ్ల్యుటి అమలును నిలిపివేయడం తమ ప్రజలను అకారణంగా శిక్షించడమేనని పాకిస్థాన్ ఆక్రోశిస్తోంది. ఆపరేషన్ సిందూర్ పూర్వాపరాలను ప్రపంచ దేశాల నాయకులకు వివరించేందుకు మోదీ సర్కార్ పంపించిన భారత పార్లమెంటరీ ప్రతినిధుల బృందాలు ఐడబ్ల్యుటి అమలు నిలిపివేత విషయంలో ఎదురైన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడంలో ఇబ్బందుల నెదుర్కొన్నాయి.

> నదీపరివాహక ప్రాంతాలకు సంబంధించిన ఒప్పందాలలో సింధు నదీజలాల ఒప్పందం భిన్నమైనది. 1947లో దేశ విభజన కాలం నుంచి భారత్, పాకిస్థాన్‌ల మధ్య అపరిష్కృతంగా ఉన్న వివాదాన్ని ఈ ఒప్పందం ఒక కొలిక్కి తీసుకువచ్చింది. ప్రపంచవ్యాప్తంగా చాలా నదీ పరీవాహక ప్రాంతాల ఒప్పందాలు నదీజలాల పంపకానికి సంబంధించినవి కాగా, ఐడబ్ల్యుటి నదుల విభజనకు సంబంధించినది.

అంతర్జాతీయ పర్యవసానాలను ఉపేక్షించి పాకిస్థాన్‌కు ప్రవహించే సింధు జలాలను నిలిపివేసేందుకు భారత్ దృఢంగా నిర్ణయించుకుందనే అనుకుందాం. ఆ నిర్ణయాన్ని అమలుపరచడం సాధ్యమవుతుందా? సింధునదిపై భారత ప్రభుత్వ నివేదిక ఒకటి ఇండస్ బేసినులో సగటు నీటి లభ్యత 73 బిసిఎమ్ (బిలియన్ క్యూబిక్ మీటర్లు) పేర్కొంది. ఉపయోగించుకోగల మొత్తం ఉపరితల జలాల లభ్యత 46 బిసిఎమ్ అని, ప్రస్తుత 'లైవ్ స్టోరేజి కెపాసిటీ' 16.3 బిసిఎమ్ అని ఆ నివేదిక పేర్కొంది. ఈ అంకెలు అన్నీ భారత్‌కు కేటాయించిన తూర్పు నదులకు సంబంధించినవి. లభ్యమయ్యే మొత్తం నీటిని పూర్తిగా నిల్వ చేసుకోవాలంటే భారత్ కనీసం భాక్రానంగల్ స్థాయి భారీ ప్రాజెక్టులు ఒకటి కాదు, రెండు కాదు, మూడు నిర్మించుకోవలసి ఉంటుంది. కేవలం తూర్పు నదుల నుంచి నీరు పాకిస్థాన్‌కు ప్రవహించకుండా నిలిపివేసేందుకే అంత ఖర్చుచేయవలసి ఉంటుంది. మరి పశ్చిమ నదుల నుంచి లభ్యమయ్యే నీటిని సైతం పూర్తిగా నిల్వ చేసుకోవాలని భారత్ నిర్ణయించుకుంటే అందుకయ్యే వ్యయం అనేక రెట్లు అధికంగా ఉంటుంది. సింధు, దాని ఉపనదుల నుంచి ఒక్క చుక్క నీరు కూడా పాకిస్థాన్‌కు వెళ్లకుండా నిలిపివేసేందుకు భారత్ రాబోయే పదిసంవత్సరాల కాలంలో కనీసం 10,000 నుంచి 15,000 కోట్ల డాలర్లను వెచ్చించవలసి వస్తుంది.

భారత ప్రభుత్వం పాకిస్థాన్‌కు జారీ చేస్తున్న హెచ్చరికలు దేశంలో ప్రజల మద్దతును మరింతగా సమీకరించుకోవడానికే కావచ్చు. కానీ, అవి పాకిస్థాన్ పాలకులకు బాగా తోడ్పడుతున్నాయి. వారు తమకు స్వదేశంలో భారత్‌కు వ్యతిరేకంగా మద్దతు కూడగట్టుకొనేందుకు అవి తోడ్పడుతున్నాయి. సింధు ఒప్పందం అమలును నిలిపివేయడం ద్వారా పాకిస్థాన్‌ను గట్టిగా శిక్షించినట్లయిందని కోట్లాది భారతీయులు భావిస్తున్నట్టుగానే, ఆ నీళ్ళు తమకు చేరకుండా భారత్ అడ్డుకుంటోందని ఇప్పటికే కోట్లాది పాకిస్థాన్ ప్రజలు విశ్వసిస్తూండవచ్చు. ఉగ్రవాదాన్ని అరికట్టేందుకు సింధు వాహిని నిలిపివేస్తామని పదే పదే ప్రకటించడం సరైన వ్యూహం కాదు, కాబోదు. –భారత్ ప్రయోజనాలకు అదేమీ దోహదం చేయదు.

బిక్షం గుజ్జా
అంతర్జాతీయ జలవిధాన నిపుణుడు

రియల్ హీరో 'నాన్న'



అంతులేని ప్రేమతో
అంతంలేని ఆయుష్షు నీకివ్వాలని
అనుక్షణం తాపత్రయపడుతూ
అద్భుతమైన జీవితాన్ని
నీకు పరిచయం చెయ్యాలని

అత్యాశతో పగలు, రాత్రి
అలసట ఎరుగని శ్రామికుడు నాన్న
అంతులేని ప్రేమను పంచి, అందలం ఎక్కించి,
అట్టడుగులో తానుండి
నీ నవ్వును చూసి మురిసే పిచ్చోడు నాన్న

అపురూపమనే పదానికి
అందం అనే అబద్ధానికి
అర్థ నిస్వార్థమైన తన బిడ్డలని
అరమరికలు లేని నీ స్వభావాన్ని
నీ విజయోత్సవంగా ఉత్సహించే ప్రేమపిపాసి నాన్న

బరువు అనిపించినా నీ బలం తానై
బలహీనతలు వెంటాడుతున్నా
బాధ్యతను విడిచిపెట్టక
భక్తికి శక్తిని తోడుచేసుకొని
తన జీవితమంతా రంగరించి
బిడ్డలకు నేనున్నాననే గుండె నిబ్బరం నాన్న

అనునిత్యం కర్పూరంలా తాను కరిగిపోతూ
నవ్వులు వెదజల్లే విశ్వాసం నాన్న
ప్రతి కూతురుకి (కొడుకుకి) రియల్ హీరో నాన్న
ఈ రోజున ఎదిగిన ప్రతి కొడుక్కి జీరో నాన్న
అత్యంత విలువైన సంపద నాన్న

– వాసి జ్యోత్స్న
(నేడు ఫాదర్స్ డే)

మృత్యువిహంగం

గగనాన ఎగరాల్సిన కలలు
రెక్కలు తెగి నేలరాలడమేమిటి
అనుబంధాల దారప్పోగులు
పుటుక్కున తెగి
చితిపై కాలడమేమిటి
చంద్రమండలం మీద కాలుమోపిన
మానవుడు చటుక్కున
చతికిలపడటమేమిటి

యంత్రానికి ప్రకృతికి నడుమ
నిరంతర సంఘర్షణ
పెనువిధ్వంసం జరిగాక
బ్లాక్ డే గా ప్రకటించాక
బ్లాక్ బాక్స్ కై వెతుకులాటెందుకు
ఎక్స్‌గ్రేషియా టిష్యూ పేపర్‌తో
కంటితుడుపు చర్యలెందుకు
పెనువిధ్వంసం జరిగాక
పోస్టుమార్టమ్ రిపోర్టులెవరికోసం...

కుటుంబాలకు కుటుంబాలే
బుగ్గిపాలైన ఘోరవిపత్తు
ఆకాశమంత ఎదిగిన
సంతానం సజీవదహనమైతే
ఆ బూడిదను ఏ పుణ్యతీర్థంలో
నిమజ్జనం చేయాలి

విమానంలో ప్రయాణించే
మనుషులు వేరు కావచ్చు
ఎదురొచ్చిన చావు ఒక్కటే

ఐనా ఎవ్వడికీ ఏమీ పట్టదు
ఈ రోజు పతాక శీర్షికలో
నెత్తురోడినవార్త...
అనాథశవంలా
రేపు చెత్తకుప్పలోకే...

కాలం నేర్పే గుణపాఠాలను
గుండెగోడలకు వేలాడదీసే
కనువిప్పు కావాలిప్పుడు

వర్తమానం కాన్వాసు మీద మనిషి
వాస్తవాల వర్ణచిత్రం కావాలిప్పుడు

కానీ ఎప్పటికీ ఒక్కడుంటాడు
సమాధి మీద ఎగిరే విజయపతాకై
ఒక్కడుంటాడు
బతుకుపోరులో మృత్యుంజయుడై...

– సరికొండ నరసింహరాజు
(అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మరణించినవారి కోసం)

తూర్పు ఆఫ్రికాలో 'ఇనుపపాము'



> ఇప్పుడు కెన్యాగా పిలుస్తున్న ప్రదేశంలో యూరోపియన్లు అడుగుపెట్టడానికి వంద సంవత్సరాల క్రితమే, కిమ్నియోల్ అనే గిరిజన ప్రవక్త గడ్డి మైదానాల గుండా జారిపోయే ఒక క్రూరమైన 'ఇనుప పాము' గురించి మాట్లాడాడు. 'అది పశువులను మింగేస్తుందని, విధ్వంసం సృష్టిస్తుందని, ఇంతకు ముందెన్నడూ చూడని విదేశీయుడిని తీసుకువస్తుందని' అతను చెప్పాడు. తన ప్రజలకు కష్టాలు రాబోతున్నాయన్నదే కిమ్నియోల్ ప్రవచనాల సారాంశం. అవి నిజమని తేలినప్పటికీ 'ఇనుప పాము' ఆఫ్రికన్ ప్రజల జీవితాలను కిమ్నియోల్ ఊహించలేని విధంగా మార్చింది.


తూర్పు ఆఫ్రికాలోని ప్రాంతాలను అనుసంధానించడానికి, కెన్యా నుంచి ఉగాండా వరకూ రైలు మార్గాన్ని నిర్మించాలని బ్రిటిష్ సామ్రాజ్య పాలకులు నిర్ణయించారు. చౌక శ్రమశక్తికి వెసులుబాటు కల్పించిన బానిసత్వ వ్యవస్థ అప్పటికే రద్దయ్యింది. దీంతో రైలు మార్గాన్ని నిర్మించడానికి కాంట్రాక్ట్ ప్రాతిపాదికన, తక్కువ ధరలో ఒప్పంద కార్మికులను భారతదేశం నుంచి తెచ్చుకోవచ్చు అనుకున్నారు తూర్పు ఆఫ్రికా వలస పాలకులు. దానికోసం 'ఇంపీరియల్ బ్రిటిష్ ఈస్ట్ ఆఫ్రికా కంపెనీ'ని 1888లో స్థాపించి, 1896లో మొంబాసా నుంచి విక్టోరియా సరస్సు దాకా రైల్వే ట్రాక్ నిర్మాణాన్ని ప్రారంభించారు. అవసరమైన కార్మికులు, సహాయక అధికారులను నియమించడానికి బాధ్యత వహించే ఒక ఏజెంట్‌ను కరాచీలో నియమించారు. ప్రధాన నియామక కేంద్రమైన లాహోర్‌లో ఒక బ్రాంచ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

భారతదేశంలో రైల్వే నిర్మాణాన్ని ప్రారంభించిన దాదాపు 40 సంవత్సరాల తరువాతనే, తూర్పు ఆఫ్రికాలో రైల్వే నిర్మాణ ఆలోచన మొదలయింది. భారతదేశంలో అటువంటి నిర్మాణ పనుల్లో పనిచేసిన



కార్మికుల మీద బ్రిటిష్ వారి దృష్టి పడింది. ఉచిత ప్రయాణం, ఉచిత భోజనం, జీతం, ఉచితంగా తిరుగు ప్రయాణం లాంటి జనాకర్షక హామీలతో, పంజాబ్‌లోని గ్రామాల నుంచి కేవలం మగ, యువ కార్మికులను సమీకరించగలిగారు. బ్రిటిష్ ఇండియా స్టీమ్ నావిగేషన్ కంపెనీకి చెందిన ప్రత్యేక చార్టర్డ్ స్టీమర్లలో వారినందరినీ కరాచీకి పంపారు. అక్కడి నుంచి మొంబాసాకు దాదాపు 3వేల మైళ్లు, తొమ్మిది రోజుల ప్రయాణం. 1896 జనవరి 24న మొంబాసాలో 350 మంది పంజాబీల మొదటి జట్టుతో ఒప్పంద కార్మిక వ్యవస్థ అక్కడ ప్రారంభమైంది. 7,500 మంది నైపుణ్యం ఉన్న కార్మికులు, 20 వేల మంది నైపుణ్యం లేని కార్మికులు భారతదేశం నుంచి వెళ్లారు. మొత్తం మీద, రైల్వే నిర్మాణంలో 32 వేల మంది భారతీయులు ఉపాధి పొందారు.

1898లో రైల్వే నిర్మాణం 100 మైళ్ల దూరం వరకూ సాగింది. తీరం నుంచి 326 కి.మీ దూరంలో ఉన్న నైరోబీకి మే 1899లో చేరుకుంది. ఆ తరువాత అక్కడ అది కీలకమైన ఓడరేవు అయింది. అయితే 200 మైళ్ల ప్రయాణం తరువాత, రైల్వే నిర్మాణంలో అత్యంత భయంకరమైన అధ్యాయాలలో ఒకటి 1898లో త్సావో నది మీద వంతెన నిర్మాణ సమయంలో జరిగింది. నరమాంస భక్షక మగ సింహాల జత, కార్మికుల శిబిరాలకు చేరి, రాత్రిపూట గుడారాలలో నిద్రిస్తున్న కార్మికులను బయటకు లాగి భక్షించేవి. పది నెలల పాటు కొనసాగిన ఆ దాడిలో వందమందికి పైగా మరణించారు. వందలాది మంది కార్మికులు త్సావో నుంచి పారిపోవడంతో రైల్వే నిర్మాణం దాదాపు ఆగిపోయింది. ఆ సింహాలు కొంతకాలం తర్వాత, పనిలో ఉన్న పురుషులను వెంబడించడంలో నిపుణులయ్యాయి. సింహాలు అనుసరించిన పద్ధతులు అసాధారణమైనవి కావడంతో, ఆ రెండు మగ సింహాలూ కచ్చితంగా సింహాల శరీరంలోకి ప్రవేశించిన దెయ్యాలని భారతీయ కార్మికులు నమ్మడం మొదలుపెట్టారు. సింహాలను అంతం చేసే పని రైల్వే నిర్మాణాన్ని పర్యవేక్షించే ఇంజనీర్, లెఫ్టినెంట్ కల్నల్ జాన్ ప్యాటర్సన్ మీద పడింది. వారాల తరబడి నిరంతరాయంగా వెంబడించిన తర్వాత, ప్యాటర్సన్ ప్రాణాలకు తెగించి సింహాలను అంతం చేయగలిగాడు. వీటి నిర్మూలన ఆ రైల్వే చరిత్రలో ఒక భయంకరమైన అధ్యాయానికి ముగింపు పలికింది. 'దెయ్యం' 'చీకటి' అనే మారుపేరుతో వాటిని చెప్పుకునేవారు.



రైలు నైరోబీ రైల్వే రిఫ్ట్ వ్యాలీ వైపు మళ్లిన తర్వాత ఆ ప్రాంతం మరీ ప్రమాదకరంగా మారింది. నిర్మాణం త్సావో నదికి చేరుకోకముందే, రైల్వే కార్మికుల మీద అక్కడి మాసాయి తెగ భయంకరంగా దాడి చేసింది. దానికి కారణం గతంలో (నవంబర్ 1895) ఇద్దరు మాసాయి గిరిజన బాలికల మీద అత్యాచారం జరగడమే. దానికి ప్రతిక్రియగా, మాసాయి తెగ దాదాపు ఆరు వందల మందికి పైగా రైల్వే కార్మికులను హతమార్చింది. మరొక ముఖ్యమైన ప్రతిబంధకం... అక్కడి సెత్సే దోమల కాటు. ఇవి కార్మికులలో నిద్ర జబ్బును సృష్టించేవి. క్లిష్టమైన భూభాగం కారణంగా చాలా మంది మలేరియా, నల్ల జ్వరంతో మరణించారు. అనేక మరణాలకు అక్కడ ఏ వైద్య సదుపాయాలూ లేవు. పేలుడు పదార్థాలతో పని చేయడం వల్ల, వడదెబ్బల వల్ల, సొరంగాల తవ్వకాలలో కార్మికులు ప్రాణాలకు తెగించి పనిచేయాల్సి వచ్చేది. విక్టోరియా సరస్సుకి దగ్గరగా రైలు మార్గం విస్తరించడంతో నిర్మాణ పనుల్లో ఆటంకాలు మరింత పెరిగాయి. కార్మికుల పరిస్థితి మరింత దిగజారింది. అయినా భారతీయ ఒప్పంద కార్మికుల అకుంఠిత కృషి కారణంగా రైల్వే అథారిటీ ఆరేడు సంవత్సరాల వ్యవధిలోనే నిర్మాణాన్ని పూర్తి చేయగలిగింది.

1899లో తీరం నుంచి నైరోబీ వరకు, 1900 నాటికి నకురు ప్రాంతం వరకూ రైల్వే పనులు పూర్తయి, 1901లో విక్టోరియా సరస్సు తీరంలో కిసుము ప్రాంతానికి రైల్వే అథారిటీ చేరుకుంది. మొంబాసా నుంచి కిసుము దాదాపు 560 మైళ్ల దూరంలో ఉంది. కిసుముకు చేరుకునే నాటికి దాదాపు 2,500 మంది మరణించారు. 1903 నాటికి విక్టోరియా సరస్సు వరకు రైలు మార్గాన్ని వేగంగా అభివృద్ధి చేశారు. పూర్తిగా స్థానిక కార్మికులపై ఆధారపడి ఉంటే రైల్వే నిర్మాణం కనీసం ఇరవై సంవత్సరాలు పట్టేదని బ్రిటిష్ అధికారులే భావించారు. ఆ ప్రశంస, కీర్తి అక్కడి ఒప్పంద భారతీయ కార్మికులకే చెందుతాయి. రైల్వేను నిర్మించడానికి మొత్తం 31,983 మంది భారతీయ కార్మికులు పని చేశారు. 6,454 మంది వ్యక్తులు ట్రాక్‌లు వేయడం మూలంగా అశక్తులయారు. రైల్వే నిర్మాణం పూర్తయిన తర్వాత 6,724 మందిని వారి సంరక్షిత రాజ్యంలో పని చేసేందుకు తీసుకున్నారు. వీరిలో 2,000 మందిని మాత్రమే రైల్వే శాఖల్లో నియమించుకున్నారు.

ఆఫ్రికా సమాజానికి ఆ రైల్వే అనేక విధాలుగా ఉపయోగపడింది. భారతీయ ఒప్పంద కార్మికులు పోషించిన పాత్రతో తరువాత ఆఫ్రికా సమాజంలో అనేక మార్పులొచ్చాయి. రైల్వే నిర్మాణానికి ప్రారంభ ఖర్చు 50 లక్షల డాలర్లుగా నిర్ణయించబడినా, దాని నిర్మాణానికి బ్రిటిష్ వారికి 90 లక్షల డాలర్ల వరకూ ఖర్చయింది. అది పార్లమెంటులోను, మీడియాలోను తీవ్ర ఆగ్రహాన్ని సృష్టించింది. నిర్మాణం ప్రారంభించకముందే, ఈ ఆలోచనను వ్యతిరేకించినవారు చాలా మంది ఉన్నారు. వీరిలో ఒకరైన హెన్రీ లాబౌచెర్ కామన్స్ సభలో బ్రిటిష్ విదేశాంగ మంత్రి జార్జ్ కర్జన్‌ను ఇలా ఆక్షేపించాడు: 'దీనికి ఎంత ఖర్చవుతుందో ఏ పదాలూ చెప్పలేవు/ దాని లక్ష్యం ఏమిటో ఏ మెదడూ ఊహించలేదు/ అది ఎక్కడి నుంచి మొదలవుతుందో ఎవరూ కనిపెట్టలేరు/ అది ఎక్కడికి వెళుతుందో ఎవరికీ తెలియదు.. స్పష్టంగా అది ఒక ఉన్మాద లైను తప్ప మరొకటి కాదు' అని. ఉగాండా రైల్వేను లూనాటిక్ (ఉన్మాద/పిచ్చి) అనే పదంతో పేర్కొనడం అదే మొదటిసారి. 'లూనాటిక్ ఎక్స్‌ప్రెస్' అనే పదాన్ని చార్లెస్ మిల్లర్ 1971లో తన పుస్తకం 'ది లూనాటిక్ ఎక్స్‌ప్రెస్: యాన్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇన్ ఇంపీరియలిజం'లో ఉపయోగించాడు. అయితే కొంతమంది స్థానికులు ఆ ఎక్స్‌ప్రెస్‌ను 'ఇనుప పాము' అని పిలుచుకున్నారు. దానికి కారణం– ఇప్పుడు కెన్యాగా పిలువబడే ప్రదేశంలో యూరోపియన్లు అడుగుపెట్టడానికి వంద సంవత్సరాల క్రితమే, కిమ్నియోల్ అనే గిరిజన ప్రవక్త గడ్డి మైదానాల గుండా జారిపోయే ఒక క్రూరమైన 'ఇనుప పాము' గురించి మాట్లాడాడు. 'అది పశువులను మింగేస్తుందని, వారి భూములను దోచుకుంటుందని, దారిలో విధ్వంసం సృష్టిస్తుందని, ఆ మృగం, ఇంతకు ముందెన్నడూ చూడని ఒక రకమైన విదేశీయుడిని తీసుకువస్తుందని, ఒక రోజు వారి భూమిని పరిపాలించే వింతైన ఎర్రటి జుట్టు గల వ్యక్తిని తీసుకొస్తుందని' అతను చెప్పాడు. అతను చేసిన ప్రవచనం ఒక విషయాన్ని స్పష్టపరిచింది– అక్కడి ప్రజలకు కష్టాలు రాబోతున్నాయని! కిమ్నియోల్ ప్రవచనాలు నిజమని తేలినప్పటికీ 'ఇనుప పాము' ఆ ప్రజల జీవితాలను ఆయన కూడా ఊహించలేని విధంగా మార్చింది. ఆశ్చర్యంగా బ్రిటిష్ పత్రికలు సైతం దానిని 'ఇనుప పాము' అనే అన్నాయి, ఎందుకంటే దాని నిర్మాణ సమయంలో అపారమైన సంపద వృథా అయింది. ఆ ప్రాంతంలో నివసించిన తెగలు రైల్వే నిర్మాణాన్ని ప్రతిఘటించాయి.



ఈ రైలు మార్గం ఉగాండా, కెన్యా అంతర్భాగాలను, కెన్యాలోని హిందూ మహాసముద్ర నౌకాశ్రయాన్ని మొంబాసాతో అనుసంధానించింది. మొదటి ప్రపంచ యుద్ధంలో తూర్పు ఆఫ్రికాలో జర్మనీని ఓడించడానికి బ్రిటిష్ వారికి సహాయపడి, ఇతర వలస రాజ్యాలతో కమ్యూనికేషన్ కొనసాగించడానికి చాలా ముఖ్యమైనదిగా మారింది. రైల్వే రాక ముందు నైరోబీ జనావాసాలు లేని చిత్తడినేల. నేడు నైరోబీ కెన్యాలో ముప్పై లక్షలకు పైగా జనాభా ఉన్న అతిపెద్ద నగరం. నిద్రాణస్థితిలో ఉన్న తీరప్రాంతం మొంబాసా అనంతరం పట్టణమై, ఆధునిక ఓడరేవుగా రూపాంతరం చెందింది. కెన్యాతో పోలిస్తే ఉగాండాకు ఇప్పుడు వ్యవసాయం నుంచి సమృద్ధిగా రాబడి వస్తోంది. 1938 నాటికి, పత్తి సాగు ఒక్కటే 30 లక్షల ఎకరాల భూమిని ఆక్రమించింది. 1900–04 సంవత్సరాల మధ్య బ్రిటిష్ తూర్పు ఆఫ్రికా కమిషనర్‌గా ఉన్న చార్లెస్ ఎలియట్ వీటన్నింటినీ గమనించి ఇలా వ్యాఖ్యానించాడు: 'ఒక దేశం రైల్వేను సృష్టించడం అసాధారణం కాదు, కానీ రైల్వేనే ఒక దేశాన్ని సృష్టించడం అసాధారణం.'

ముకుంద రామారావు
కవి, వలసజీవితాల చరిత్రకారుడు (99083 47273)

నేను నాన్ననీ..

అమ్మ నవమాసాలు మోసి జన్మనిస్తే నాన్న అన్నీ తానై ముందుకు నడిపిస్తాడు. బిడ్డ భూమి మీదకు వచ్చింది మొదలు బాధ్యతగా కనిపెట్టుకుంటాడు. నాన్న అంటే ఓ ధైర్యం.. ఓ స్ఫూర్తి.. మనమెక్కే ప్రతి మెట్టు కింద ఆయన ఉంటాడు. అందుకే అమ్మకు, బ్రహ్మకు మధ్యన నిచ్చెన నాన్నే అంటారు. పిల్లల పెంపకంలో తల్లిని తలపిస్తూ.. కుటుంబం కోసం తన జీవితాన్ని ధారపోస్తున్న తండ్రులకు నేడు ఫాదర్స్ డే శుభాకాంక్షలు.. (నగరంలో కెనాల్ రోడ్డు వద్ద మండుటెండలో తన బిడ్డతో కలిసి పూల వ్యాపారం చేస్తున్న ఓ తండ్రి)



నీట్‌లో మెరిశారు

గుడివాడకు చెందిన వి.పృథ్వీరాజ్‌కు ఆలిండియా 3508 ర్యాంకు

- ఓబీసీ కేటగిరీలోనూ 1291 ర్యాంకు సాధించి రికార్డు
- ఉమ్మడి కృష్ణాలో ఓపెన్ కేటగిరీలో వెయ్యిలోపు 40 జాతీయ ర్యాంకులు
- వీరంతా విజయవాడలో చదువుతున్న ఇతర జిల్లాల విద్యార్థులే.

6



ఆలిండియా 3508 ర్యాంకు సాధించిన పృథ్వీరాజ్

కలిసికట్టుగా..

నిడమానూరు-రామవరప్పాడు డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్

- నిడమానూరు-మహానాడు 4 వరసల ఫ్లైఓవర్
- సంయుక్త డీపీఆర్‌కు ఎన్‌హెచ్, మెట్రో శ్రీకారం

మొత్తంగా రూ.150 కోట్లు ఆదా



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : 16వ నెంబర్ జాతీయ రహదారిపై నిర్మించే డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌కు సంయుక్త డీపీఆర్ తయారుకానుంది. ఇప్పటికే జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్) రూ.600 కోట్లతో 7 కిలోమీటర్ల మేర నిర్మించే నాలుగు వరసల సింగిల్ ఫ్లై ఓవర్‌కు, మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులు 4.7 కిలోమీటర్ల మేర రూ.500 కోట్లతో నిర్మించే డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌కు డీపీఆర్‌లను వేర్వేరుగా తయారు చేశాయి. కానీ, ఫ్లై ఓవర్, మెట్రో ఎలివేటెడ్ కారిడార్స్ రెండూ వేర్వేరుగా ఎన్‌హెచ్ అభివృద్ధి చేయటం సాధ్యం కాదు కాబట్టి మెట్రో కారిడార్ వరకు డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ నిర్మించాలని నిర్ణయించారు. ఎన్‌హెచ్, ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ (ఏపీఎంఆర్‌సీ) మధ్య కుదిరిన ఏకాభిప్రాయం మేరకు డబుల్ డెక్కర్ ప్రతిపాదనకు అంగీకరించారు. డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాల్సిందిగా ఏపీఎంఆర్‌సీ నుంచి కేంద్ర మిగతా 6లో..

విస్తరణ వివాదం

ఎన్‌హెచ్-65 విస్తరణ అలైన్‌మెంట్‌పై అభ్యంతరం

జిల్లాలో విస్తరణను కుదించేలా తెలంగాణ ఎన్‌హెచ్ ప్లాన్

హైదరాబాద్-విజయవాడ 65వ నెంబర్ జాతీయ రహదారి విస్తరణ అలైన్‌మెంట్‌లో వివాదాలు అలముకున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో 20 కిలోమీటర్లకే విస్తరణను పరిమితం చేయడంపై ఎంపీ కేశినేని చిన్ని అభ్యంతరం వ్యక్తం చేశారు. గొల్లపూడి వరకు విస్తరణ జరగాలని ఆయన పట్టుబట్టారు.

- అభ్యంతరం వ్యక్తంచేసిన ఎంపీ కేశినేని శివనాథ్
- గొల్లపూడి వరకు విస్తరించాల్సిందేనని పట్టు
- పశ్చిమ బైపాస్‌కు కలపాలని స్పష్టీకరణ
- ఎన్‌హెచ్ అధికారులతో ఎంపీ అత్యవసర సమావేశం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : హైదరాబాద్-విజయవాడ 65వ నెంబర్ జాతీయ రహదారి విస్తరణలో వివాదం తలెత్తింది. ఈ జాతీయ రహదారిని ఆరు వరసలుగా విస్తరించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన డీపీఆర్ కూడా హైదరాబాద్ ఎన్‌హెచ్ అధికారులు రూపొందిస్తున్నారు. ఈ డీపీఆర్‌లో ఎన్టీఆర్ జిల్లాలో తెలంగాణ ఎన్‌హెచ్ అధికారులు భారీగా కొత పెట్టారు. ఈ జాతీయ రహదారిని అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్) వరకు ఆరు వరసలుగా మిగతా 6లో..





6

మారేడుమిల్లిలో విషాదం

పాములేరులో మునిగి ఇద్దరు విజయవాడ వాసులు గల్లంతు

ఒడిశా రైతులతో గంజాయి స్నేహం

- డుబ్రీగూడ టూ బెంగళూరు వయా బెజవాడ
- ఐదారేళ్లుగా యథేచ్ఛగా గంజాయి వ్యాపారం
- బయటకు వస్తున్న బిక్కి నరేంద్ర లీలలు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : కన్‌స్ట్రక్షన్ కంపెనీ ముసుగులో జరుగుతున్న గంజాయి వ్యాపారం కేసులో అనేక చీకటి కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో ఐదుగురు నిందితులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేయగా, పెనమలూరు మండలం కానూరు నారాయణపురం కాలనీకి చెందిన బిక్కి నరేంద్ర వ్యవహారాలు బయట పడుతున్నాయి. ఒడిశాలోని డుబ్రీగూడ నుంచి బెంగళూరుకు గంజాయి సరఫరా మిగతా 6లో..

ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ నూతన కౌన్సిల్ ఏర్పాటు

విజయవాడ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ కొత్త ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయడానికి 8 మంది విద్యావేత్తలతో కూడిన నిపుణులను ప్రభుత్వం నామినేట్ చేసింది. శనివారం సీఎం చంద్రబాబు అధికారికంగా ఈ కౌన్సిల్‌ను ఆమోదించారు. గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుబ్బారావు, కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీకి చెందిన ఎనస్తీషియా మాజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎం విష్ణు మహేష్ బాబు, తిరుపతి శ్రీ వెంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నుంచి గైనకాలజీ ప్రొఫెసర్ కే మాధవి, విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజీకి చెందిన ఆర్థోపెడిక్స్ ప్రొఫెసర్ సూరపనేని సురేష్‌బాబు, విజయనగరానికి చెందిన మహారాజ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నుంచి రేడియాలజీ ప్రొఫెసర్ ఎం.జైచంద్రనాయుడు, ఆమదాలవలస ప్రభుత్వాసుపత్రికి చెందిన శిశువైద్యుడు డాక్టర్ చాపర సుధాకర్, ప్రొద్దుటూరు నుంచి (జనరల్ మెడిసిన్) ఎండీ డాక్టర్ టీడీ వరుణ్‌కుమార్ రెడ్డి, విజయవాడ పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ వై.సాయి కిషోర్‌ను ఈ కౌన్సిల్‌లో సభ్యులు చేస్తూ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. వీరితో పాటు ప్రభుత్వ నామినీలుగా కార్యనిర్వాహక మండలిలోని ఐదుగురిని ఎక్స్ అఫీషియో సభ్యులుగా నియమించారు. ఇందులో ఆరోగ్య ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఆర్థిక కార్యదర్శి, వైద్య విద్య డైరెక్టర్, కమిషనర్ (ఆయుష్ విభాగానికి), హెల్త్ డైరెక్టర్లను నియమించారు. వారి వివరాలు ప్రభుత్వం ఇంకా వెల్లడించలేదు.

దుర్గగుడికి కానుకగా కారు, కనకదుర్గ అమ్మవారికి బంగారు హారం

ఇంద్రకీలాద్రి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్‌కు చెందిన కనకదుర్గమ్మ భక్తుడు జి.భూపాల్ రెడ్డి శనివారం ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకోవటానికి కుటుంబం సహా వచ్చారు. ఈ సందర్భంగా తాము గతంలో అమ్మవారికి మొక్కుకున్న మేరకు దేవస్థానానికి కారు, దుర్గమ్మకు హారాన్ని కానుకగా ఇచ్చారు. రూ.4.75 లక్షల విలువైన రినాల్ట్ క్విడ్ కారు, రాళ్లు, ముత్యాలు పొదిగిన 21 గ్రాముల బరువున్న బంగారు నెక్లెస్‌ను కానుకగా ఈవో శీనానాయక్ ద్వారా అందజేశారు. అనంతరం జి.భూపాల్ రెడ్డి, కుటుంబ సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించారు. వారికి అర్చకులు వేదమంత్ర ఆశీర్వచనం, ప్రసాదం, శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం అందజేశారు.

బెజవాడ బార్‌లో ఘనంగా కర్నాటి జయంతి వేడుకలు

● హాజరైన హైకోర్టు నాయమూర్తి జస్టిస్ కృపాసాగర్



విజయవాడ లీగల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): బెజవాడ బార్ అసోసియేషన్ లో శనివారం సీనియర్ న్యాయవాది స్వర్గీయ కర్నాటి రామ్మోహన రావు జయంతి వేడుకలను న్యాయవాదులు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృపాసాగర్ ముందుగా కర్నాటి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ కర్నాటి రామ్మోహన రావు జయంతిని న్యాయవాదులు నిర్వహించడం సంతోషదాయకమన్నారు. కర్నాటి న్యాయవాది అయినప్పటికీ ప్రజా ఉద్యమాలను ముందుండి నడిపించేవారన్నారు. దేశం నలుమూలలా ఆయనకు ప్రత్యేక స్థానం కల్పించుకొన్నారన్నారు. రిటైర్డ్ హైకోర్టు రిజిస్ట్రార్ తల్లా వేణుగోపాలరావు మాట్లాడుతూ ఏ న్యాయమూర్తుల మీటింగ్‌లోనైనా కర్నాటి ప్రస్తావన తప్పకుండా వస్తుందన్నారు. సిద్ధార్థ లా కళాశాల ప్రిన్సిపాల్ చెన్నుపాటి దివాకర్ బాబు మాట్లాడుతూ కర్నాటి రామ్మోహనరావు తనకు ఆత్మీయులని ఒక్క బెజవాడలోనేకాక దేశంలోనే ఎక్కడ మానవ హక్కులకు భంగం కలిగినా ముందుండి వారికి న్యాయం జరిగేదాకా కర్నాటి పోరాడేవారన్నారు. అనంతరం న్యాయవాదులు జస్టిస్ కృపాసాగర్‌ను ఘనంగా సత్కరించారు. మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎ.సత్యానందం, ఇతర న్యాయమూర్తులు, బెజవాడ బార్ అధ్యక్ష, కార్యదర్శులు ఏకే బాషా, కేవీ రంగారావు, బార్ కార్యవర్గసభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

పాములేరు వాగులో ఇద్దరు యువకుల గల్లంతు

మారేడుమిల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతమైన అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి పాములేరు వాగులో ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. శనివారం విజయవాడ నగరానికి చెందిన 10 మంది స్నేహితులు మారేడుమిల్లి పర్యాటకానికి వచ్చారు. పాములేరు వాగులో డి.సాలీస్ (23), కటకం రవితేజ (30), మరో ఇద్దరు యువకులు స్నానానికి దిగారు. వాగులో గల్లంతవుతుండగా స్నేహితులు రక్షించే ప్రయత్నం చేశారు. ఇద్దరు ప్రాణాలతో బయటపడగా సాలీస్, రవితేజ గల్లంతయ్యారు. దీంతో మిగిలిన స్నేహితులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఎస్డీఆర్ఎఫ్ బృందాలు శనివారం రాత్రి వరకు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ గల్లంతైన యువకుల ఆచూకీ లభించలేదు. గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు.

ఒడిశా రైతులతో గంజాయి స్నేహం

(5వ పేజీ తరువాయి)

చేస్తున్న నరేంద్ర ఐదారేళ్ల నుంచి ఈ వ్యవహారాలు నడుపుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించారు. గంజాయి కొనుగోలుకు మధ్యవర్తులతో కాకుండా నేరుగా రైతులతోనే సత్సంబంధాలు పెట్టుకుని వ్యాపారంలో కిక్కును పొందుతున్నాడు. నరేంద్ర కొంటున్న గంజాయి మొత్తం ఒడిశాలోని డుబ్రీగూడలో పండించిందేనని పోలీసులు గుర్తించారు.

మైనర్‌ను తీసుకొచ్చి ఉపాధి

టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసిన ఐదుగురిలో ఒక మైనర్ ఉన్నాడు. సరుకు కొనుగోలు నిమిత్తం నరేంద్ర ఒడిశాకు వెళ్లినప్పుడు ఆ మైనర్‌ను గుర్తించి సహాయకుడిగా తెచ్చుకున్నాడు. నరేంద్ర తన గ్యాంగ్‌తో గంజాయి కొనుగోలుకు వెళ్లిన ప్రతిసారీ కొండలపై నుంచి ప్యాకెట్లను మోసుకుని బాలుడు కిందకు రావడాన్ని గమనించాడు. పైగా ఆ అబ్బాయి తెలుగు బాగా మాట్లాడుతుండటంతో కానూరుకు తీసుకురావాలని భావించాడు. కొనుగోలు చేసిన సరుకును సంబంధిత వ్యక్తులకు చేర్చడానికి ఈ మైనర్ బాగా ఉపయోగపడతాడని గుర్తించాడు. దీంతో ఆ బాలుడిని కానూరుకు తీసుకొచ్చి ఒక రూమ్‌ను అద్దెకు తీసుకుని ఉంచాడు. అవసరమైన సదుపాయాలు కల్పించాడు.

బైకులు, కార్లతో ఎస్కార్ట్

గంజాయి గ్యాంగ్ సాధారణంగా ఎస్కార్ట్ విధానాన్ని పాటిస్తుంది. వెనుకవైపు రెండు బైక్‌లపై గంజాయి తీసుకొస్తున్నారంటే ముందు మరో రెండు బైకులు ఆ మార్గంలో పరిస్థితులను గమనించడానికి వెళ్తుంటాయి. ఎక్కడెక్కడ పోలీసులు ఉన్నారు, ఎక్కడైనా చెకింగ్‌లు జరుగుతున్నాయా.. అనే విషయాలను గమనించి సమాచారం అందిస్తాయి. ఇప్పటివరకు వెనుకవైపు కారులో గంజాయిని తీసుకొస్తే ముందు నుంచి బైకులు ఎస్కార్ట్ ఇచ్చేవి. నరేంద్ర ఇందుకు భిన్నమైన మార్గాన్ని ఎంచుకున్నాడు. కారులో సరుకును తీసుకొస్తే పోలీసులకు దొరికిపోవడం ఖాయమని భావించాడు. ఇందుకోసం బైక్లపై తన అనుచరులతో గంజాయిని రప్పిస్తూ కార్లతో వారికి ఎస్కార్ట్ ఇచ్చేవాడు. ఇందుకోసం తన సొంత కార్లను ఉపయోగించడమే కాకుండా అద్దెకు కార్లు తీసుకునేవాడు.

కలిసికట్టుగా..

(5వ పేజీ తరువాయి)

ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ (మోర్తు)కు ప్రతిపాదనలు అందాయి. ప్రస్తుతం ఈ అంశం మోర్తు దగ్గర పెండింగ్‌లో ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రి గడ్కరీ మధ్య ఈ అంశం చర్చకు వచ్చింది. కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకారం తెలిపినా మోర్తు నుంచి అధికారికంగా అనుమతులు రావాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం హామీ ఇవ్వటంతో ఇక ఆలస్యం కాకుండా ఉండేందుకు కంబైన్డ్ డీపీఆర్ తయారు చేయించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఏపీఎంఆర్‌సీ అధికారులే కంబైన్డ్ డీపీఆర్‌ను తయారు చేయించాలని నిర్ణయించారు. బాలాజీ రైల్ కంపెనీ లిమిటెడ్ అనే సంస్థకు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం కంబైన్డ్ డీపీఆర్‌కు రూపకల్పన జరుగుతోంది.

బహుళ ప్రయోజనమే..

డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ వల్ల ఎన్‌హెచ్, మెట్రో అధికారులకు వ్యయం తగ్గుతుంది. నిడమానూరు జంక్షన్ నుంచి మహానాడు జంక్షన్ వరకు 7 కిలోమీటర్ల మేర ఎన్‌హెచ్ నిర్మించాలనుకున్న 4 వరసల ఫ్లై ఓవర్‌కు రూ.600 కోట్లు అవుతుందని అంచనా వేశారు. అదే మెట్రో కారిడార్‌తో సంయుక్తంగా చేపట్టడం వల్ల ఎన్‌హెచ్‌కు రూ.100 కోట్ల మేర ఆదా అవుతుంది. అలాగే, నిడమానూరు జంక్షన్ నుంచి రామవరప్పాడు రింగ్ వరకు మెట్రో రైల్ కార్పొరేషన్ నిర్మించే డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌కు కూడా ఖర్చు తగ్గుతుంది. రూ.500 కోట్లు అంచనా వ్యయం కాగా, రూ.50 కోట్ల మేర తగ్గుతుంది.

డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ నిర్మాణం ఏపీఎంఆర్‌సీదే..

డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ మాత్రమే చేపట్టనుంది. తామే డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ నిర్మిస్తామని ఆ సంస్థ ప్రకటించింది. నాలుగు వరసల ఫ్లై ఓవర్‌పై మెట్రో ఎలివేటెడ్ కారిడార్ వస్తున్న నేపథ్యంలో భూగర్భ పిల్లర్లను ఆ స్థాయిలో నిర్మించాల్సి ఉంటుంది.

నీట్‌లో మెరిశారు..!

● గుడివాడకు చెందిన పృథ్వీరాజ్‌కు ఆలిండియా 3,508వ ర్యాంకు
● ఓబీసీ కేటగిరీలో 1,291 ర్యాంకు.. తల్లిదండ్రులిద్దరూ వైద్యులే!
● ఉమ్మడి కృష్ణా జిల్లాలో 1,000 లోపు ఓపెన్ కేటగిరీలో 40 జాతీయ ర్యాంకులు
● విజయవాడలో చదువుకున్న ఇతర జిల్లాల విద్యార్థులకు భారీగా ర్యాంకులు
● 50-60 మార్కులు తగ్గటంతో మంచి ర్యాంకులు కోల్పోయామన్న విద్యార్థులు

ఆంధ్రజ్యోతి, విజయవాడ/కానూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నీట్‌లో మన దగ్గర చదువుకున్న విద్యార్థులు మెరిశారు! వైద్య వృత్తి పట్ల ఇష్టంతో ఎంతో కష్టంతో తాము కన్న కలలను విద్యార్థులు సాకారం చేసుకున్నారు. నీట్‌లో జాతీయ ర్యాంకులు సాధించి వైద్యరంగంలోకి ప్రవేశించేందుకు బాటలు పరచుకున్నారు. అందుబాటులో ఉన్న సమాచారం మేరకు ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఓపెన్ కేటగిరీలో వెయ్యిలోపు 40 మంది విద్యార్థులు జాతీయ ర్యాంకులు సాధించారు. ఈసారి పేపర్ చాలా కష్టంగా రావటంతో 40-50 మార్కులు తగ్గాయని పలువురు విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటు విద్యాసంస్థలైన గోసలైట్స్, చైతన్య, నారాయణ కాలేజీలో చదువుకున్న విద్యార్థులు జాతీయ స్థాయిలో సత్తా చాటారు! కృష్ణాజిల్లా గుడివాడకు చెందిన వేల్పూరి పృథ్వీరాజ్ జాతీయ స్థాయిలో సత్తా చాటాడు. ఆలిండియాలో 3508 ర్యాంక్ సాధించగా.. ఓబీసీ కేటగిరీలో 1291 ర్యాంకు లభించింది. పృథ్వీరాజ్ తల్లిదండ్రులు వృత్తిరీత్యా వైద్యులు.

ఆలిండియా ర్యాంకర్లు వీరే..

ఉమ్మడి కృష్ణాజిల్లాలోని నారాయణ విద్యాసంస్థలకు చెందిన ముస్కాన్ ఆనంద్ 643 మార్కులతో ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 112వ ర్యాంక్ సాధించాడు. అభినవ 631 మార్కులతో 231వ ర్యాంక్, ఎం హన్సికారెడ్డి 625 మార్కులతో 343వ ర్యాంక్, అక్షయ్ కీర్తన్ 623 మార్కులతో 379వ ర్యాంక్, శ్రీరామ్ యాదవ్ 617 మార్కులతో 536వ ర్యాంక్, కే నికిత 615 మార్కులతో 646వ ర్యాంక్, యశస్వినీ 614 మార్కులతో 646వ ర్యాంక్, భావనాసి ఇషాంత్ 614 మార్కులతో 657వ ర్యాంక్, కే సైనారెడ్డి 609 మార్కులతో 866వ ర్యాంక్, వై కృష్ణ ప్రణీత్ 608 మార్కులతో 900వ ర్యాంక్ సాధించినట్టు సంస్థ డీజీఎం రవిశంకర్ తెలిపారు. జాతీయ స్థాయిలో 5వేలలోపు 34మంది, 10 వేలలోపు 79 మంది ర్యాంకులు సాధించారు. మొత్తంగా 170కు పైగా విద్యార్థులు మెడికల్ సీట్లు సాధిస్తారన్నారు.

విజయవాడ శ్రీచైతన్య విద్యాసంస్థల్లో విజయవాడ క్యాంపస్ నుంచి ఆలిండియా అన్ని కేటగిరీల్లో 100 లోపు ర్యాంకులు ఆరుగురు సాధించారు. బీ ధీరజ్ 8వ ర్యాంకు, పి.అవినాష్ 15వ ర్యాంకు, టి.శివ మనదీప్ 24వ ర్యాంకు, పి.త్రివిక్రమ్ 57వ ర్యాంకు, బి.కుముద 61వ ర్యాంకు, కె.ప్రిన్స్ 98వ ర్యాంకు సాధించినట్టు ఆ సంస్థల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం మద్దినేని మురళీకృష్ణ తెలిపారు. ఆలిండియా క్యాటగిరీలో ఐదుగురు 10లోపు ర్యాంకులు సాధించారని కళాశాల యాజమాన్య ప్రతినిధులు అభినందించారు. వెయ్యిలోపు 1600 మందికి పైగా మెడికల్ సీట్స్ వచ్చినట్లు ప్రకటించారు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులకు మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ అభినందించారు.

144వ ర్యాంక్ వస్తుందని ఊహించలేదు
ఎస్ ప్రజ్ఞేశ్వరరావు, హైదరాబాద్



నీట్‌లో ఆలిండియా క్యాటగిరిలో 144వ ర్యాంక్ వస్తుందని ఊహించలేదు. మంచి ర్యాంకే వస్తుందని భావించా. ఇంత మంచి ర్యాంక్ వస్తుందనుకోలేదు. శ్రీగోసలైట్స్‌లోనే కోచింగ్ తీసుకున్నా.

తల్లిదండ్రుల కృషి వల్లే బాగా చదివా
జీ సతీష్ చంద్ర రాయల్, కర్నూలు జిల్లా



తల్లిదండ్రుల కృషి, విజయవాడ శ్రీగోసలైట్స్ సంస్థ సహకారంతో నీట్ ఆలిండియా క్యాటగిరిలో 181వ ర్యాంక్ సాధించడం ఎంతో ఆనందంగా ఉంది. తండ్రి వెంకట సుబ్బన్న రైతుగా పనిచేస్తూ పడుతున్న ఇబ్బందుల ను గుర్తుచేసుకుంటూ బాగా చదివి ర్యాంక్ సాధించాను.

ఎంతో సంతోషంగా ఉంది
డీజేజీ యువరాజ్, అమలపాడు, శ్రీకాకుళం జిల్లా



ఆలిండియా క్యాటగిరిలో 207 ర్యాంక్ సాధించడం ఆనందంగా ఉంది. డాక్టర్ కోర్సు పూర్తిచేసుకున్న తరువాత శాస్త్రవేత్తల వింగ్‌లోకి వెళ్లి వారికి వైద్యసేవలందిస్తాను. విజయవాడలో శిక్షణ బాగా ఇస్తారని తెలిసి కోచింగ్ తీసుకున్నా. ఫ్యాకల్టీ, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ర్యాంక్ సాధించా

పేదలకు వైద్యసేవలు అందిస్తా
టీ హర్షిత్, శ్రీకాళహస్తి, తిరుపతి జిల్లా



నీట్‌లో ఎస్సీ క్యాటగిరిలో 22 ర్యాంక్, ఆలిండియా క్యాటగిరిలో 87_6 ర్యాంక్ రావడం ఆనందంగా ఉంది. తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ తాను మెడిసిన్ చదవాలని ప్రోత్సహించారు. శ్రీగోసలైట్స్ విద్యా సంస్థలోని ఫ్యాకల్టీ బాగా బోధన చేశారు.

కార్డియాలజీ లేకపోతే న్యూరాలజీ
సాయికిరణ్, 98వ ర్యాంకర్



నేను శ్రీ చైతన్యలో చదువుతూ అక్కడే నీట్ కోచింగ్ తీసుకున్నా. ఒక ప్లానింగ్ ప్రకారం చదవడం వల్లే ఇది సాధ్యమైంది. కార్డియాలజీలో కాని న్యూరాలజీలో కాని స్పెషలైజేషన్ చేయాలన్నది నా కోరిక. ఎయిమ్స్‌లో సీటు కష్టమనిస్తుంది. అయినా నా కోరికను నెరవేర్చుకుంటా.

ఢిల్లీ ఎయిమ్స్‌లో చదవాలని కోరిక
తుమ్మరి శివ మన్‌దీప్



ఢిల్లీ ఎయిమ్స్‌లో చదవాలని కోరిక. అందులో సీటు సంపాదించాలంటే కష్టపడాలని సీనియర్లు చెప్పేవారు. అందుకు తగ్గట్టు కష్టపడ్డాను. ఎంబీబీఎస్‌లో కార్డియాలజీ చేయాలన్నదే నా ఆశ. డాక్టర్‌గా మంచి సేవలందించాలని చిన్నప్పటి నుంచి కోరిక. కేటగిరీలో 57వ ర్యాంకు రావడం చాలా ఆనందంగా ఉంది.



డాక్టర్ అవ్వాలన్నది నా కల
వేల్పూరి పృథ్వీరాజ్, గుడివాడ

డాక్టర్ అవ్వాలన్నది నా కల! దీనికోసం ఎంతో కష్టపడ్డా. నా కష్టం వృథా పోలేదు. జాతీయ స్థాయి ర్యాంకు సాధించటం ఆనందంగా ఉంది. విజయవాడలోని శ్రీగోసలైట్స్ మెడికల్ అకాడమీలో చదివాను. కళాశాల ప్రోద్బలం, తల్లిదండ్రుల సహకారంతో ఈ ర్యాంక్‌ను సాధించాను. చిన్నప్పటి నుంచి డాక్టర్‌ను కావాలన్న కోరిక. డాక్టర్‌ను అయిన తరువాత పేద, మధ్య తరగతి వర్గాలకు సేవలు అందించాలన్నది నా ఆశయం. దీని కోసం ఎంబీబీఎస్‌కు కూడా ఇలాగే కష్టపడతా.

ఇంకా మంచి ర్యాంకు వస్తుందనుకున్నా-
కుముద, 61వ ర్యాంకర్



కష్టపడి చదివా. ఇంకా మంచి ర్యాంకు వస్తుందని ఊహించా. నా ర్యాంకు పట్ల తల్లిదండ్రులు ఆనందంగా ఉన్నారు. మంచి వైద్యురాలిగా సేవలందించాలి. ఫలానా విభాగం అని ఏమీలేదు. డాక్టర్‌గా పేదలకి సేవలందించాలి. సివిల్స్‌లో కూడా రాణించాలని నా కోరిక.

412 ర్యాంకుతో శ్రీలక్ష్మి అత్యుత్తమ ప్రతిభ



నందిగామ: పట్టణానికి చెందిన కొల్లూరి శ్రీలక్ష్మి అనే విద్యార్థిని నీట్ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. శనివారం విడుదలైన ఫలితాల్లో శ్రీలక్ష్మి 412వ ర్యాంక్ సాధించారు. రైతు కుటుంబానికి చెందిన శ్రీలక్ష్మి ఈ ఘనత సాధించడంపై ఆమె తల్లిదండ్రులు వెంకటేశ్వరరావు, శైలజ సంతోషం వ్యక్తం చేశారు. పట్టణానికి చెందిన పలువురు విద్యావేత్తలు, రాజకీయ ప్రముఖులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. తాను సాధించిన విజయానికి సహకరించిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు శ్రీలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

నీట్‌లో శ్రీగోసలైట్స్‌కు ర్యాంకల పంట

నీట్-2025 ఫలితాల్లో విజయవాడలోని శ్రీగోసలైట్స్ మెడికల్ అకాడమికి అధిక ర్యాంక్‌లు వచ్చాయి. ఈ సందర్భంగా శనివారం కానూరులో జరిగిన కార్యక్రమంలో సంస్థ చైర్మన్ నరేంద్రబాబు ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్‌లో సుమారు 1500 మందికిపైగా శ్రీగోసలైట్స్ విద్యార్థులు దేశవ్యాప్తంగా ఫ్రీ మెడికల్ సీట్లు సాధించే ఆత్మవిశ్వాసంతో అడుగులు వేస్తున్నారన్నారు. నీట్‌లో 720 మార్కులకు గాను 600కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 11మంది, 550పైన మార్కులు సాధించిన 69 మంది, 500కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 379 మంది ఉన్నారన్నారు. ఎస్సీ క్యాటగిరిలో టి.హర్షిత్ అనే విద్యార్థి 22వ ర్యాంక్, ఆలిండియా క్యాటగిరిలో పలువురు విద్యార్థులు మంచి ర్యాంక్‌లు సాధించారన్నారు. 2026 నీట్‌లో మొదటి 10 ర్యాంక్‌లో తమ సంస్థ విద్యార్థులను నిలపాలనే దృఢసంకల్పంతో ఉన్నామని నరేంద్రబాబు చెప్పారు.

ప్రతిభకు పేదరికం అడ్డుకాదు

● ఎమ్మెల్యే వసంత ● 130 మంది విద్యార్థులకు రూ.7.40 లక్షల సొంత నగదు అందజేత

మైలవరం టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రతిభకు పేదరికం అడ్డుకాదని, విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం కూడా ముఖ్యమని ఎమ్మెల్యే వసంత అన్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్, పదవ తరగతుల్లో విద్యనభ్యసించి నియోజకవర్గవ్యాప్తంగా తొలి మూడుస్థానాల్లో నిలిచిన షైనింగ్ స్టార్స్ విద్యార్థినీ, విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతుల పంపిణీని పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, రాజకీయ ఘనత కోసం కాదన్నారు. బాగా చదువుకొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థులకు ప్రభుత్వ సౌకర్యాలతో పాటు తన అండదండలు ఉంటాయని భరోసా కల్పించారు. టెన్త్, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన 130 మంది విద్యార్థులకు రూ.7.40లక్షల సొంత నిధులను ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో ఎ.కొండూరు గ్రామానికి చెందిన కొప్పుల దుర్గా ప్రసాద్‌రెడ్డి అనే విద్యార్థి తనకు సైకిల్ లేకపోవడంతో పడిన ఇబ్బందులు చెబుతూ నవ్వులు పువ్వులు పూయించాడు. దీంతో ఎమ్మెల్యే అతడికి కార్యక్రమం ముగిసేలోగా సైకిల్ తెప్పించి అందజేశారు.



విద్యార్థి హారిణికి ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

కృత్రిమ అవయవాలు, ఉపకరణాల అందజేత

నియోజకవర్గ పరిధిలోని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు 222 మందికి రూ.43.20 లక్షల విలువైన కృత్రిమ అవయవాలను, ఉపకరణాలను ఎమ్మెల్యే వసంత మైలవరం మార్కెట్ యార్డులో అందజేశారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

రెడ్డిగూడెం మండలంలో నలుగురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.3.73 లక్షలు, మైలవరం మండలంలో ఐదుగురికీ రూ.5.37 లక్షలు, జి.కొండూరు మండలంలో 10 మందికి రూ.4.90 లక్షలు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే వసంత ఆయా లబ్ధిదారులకు మార్కెట్ యార్డులో చెక్కులు అందజేశారు. ఏఎంసీ చైర్మన్ నవ్యశ్రీ, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ చారుగుండ్ల ప్రసాద్, మైలవరం సర్పంచ్ మంజుభార్గవి, జంపాల సీతారామయ్య, ఉయ్యూరి నర్సింహరావు, ముప్పిడి నాగేశ్వరరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఉమ్మడి కృష్ణాలో ఆర్ అండ్ బీ రోడ్లకు టెండర్లు

● రూ.13.18 కోట్ల వ్యయంతో ఆరు రోడ్ల అభివృద్ధికి శ్రీకారం

ఆంధ్రజ్యోతి, విజయవాడ: ఉమ్మడి కృష్ణాజిల్లాలో రహదారులు భవనాల శాఖ (ఆర్అండ్‌బీ) ఆధ్వర్యంలో గ్రామీణ రోడ్ల అభివృద్ధికి టెండర్లు పిలిచారు. మొత్తం ఆరు రోడ్ల అభివృద్ధికి ఎండీఆర్ - నాబార్డు నిధులతో పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచారు. మొత్తంగా రూ.13.18 కోట్ల వ్యయంతో టెండర్లు పిలిచారు. ఎన్టీఆర్ జిల్లాలో అక్కపాలెం నుంచి తిరువూరు రోడ్డు అభివృద్ధికి రూ.2.25 కోట్ల వ్యయంతో ఆర్అండ్‌బీ అధికారులు టెండర్లు పిలిచారు. ఎండీఆర్ - నాబార్డు నిధులతో ఈ రోడ్డును బాగు చేసేందుకు టెండర్లు పిలిచారు. జూన్ 20న టెండర్లను ఓపెన్ చేస్తారు. అలాగే చందర్లపాడు మండలంలో ముప్పాళ్ల నుంచి ఏటూరు రోడ్డు వరకు 14.50 కిలోమీటర్లు, అలాగే చందర్లపాడు నుంచి పెట్రంపాడు వరకు 3 కిలోమీటర్లు వరకు రూ.2కోట్లతో అభివృద్ధి చేసేందుకు టెండర్లు పిలిచారు. జూన్ 27న టెండర్లను ఓపెన్ చేస్తారు. కృష్ణాజిల్లాలో పోడు నుంచి చిన్నగొల్లపాలెం వరకు 14 కిలోమీటర్ల మేర రోడ్డు అభివృద్ధికి టెండర్లు పిలిచారు. జూన్ 27న టెండర్లను ఓపెన్ చేస్తారు. కృష్ణాజిల్లాలో మచిలీపట్నం డివిజన్ పరిధిలో రామాపురం గ్రామం దగ్గర హిందూ శ్మశాన వాటిక నుంచి రైస్‌మిల్, ఫోర్ రోడ్డు జంక్షన్ వరకు 3.30 కిలోమీటర్ల దూరాన రోడ్డును అభివృద్ధిపరిచేందుకు రూ.2.09 కోట్ల వ్యయంతో టెండర్లు పిలిచారు. జూన్ 24న టెండర్లను ఖరారు చేయనున్నారు. తాళ్లపాలెం నుంచి నారాయణపురం రోడ్డు వరకు 14 కిలోమీటర్ల మేర రోడ్డును అభివృద్ధి చేసేందుకు రూ.1.98 కోట్ల వ్యయంతో టెండర్లు పిలిచారు. జూన్ 20న టెండర్లు ఓపెన్ చేస్తారు. పునాదిపాడు - పెద పారుపూడి రోడ్డును రూ.1.66 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసేందుకు టెండర్లు పిలిచారు. జూన్ 19న టెండర్లు తెరుస్తారు.

16న కొండపల్లి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక

ఇబ్రహీంపట్నం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16న కొండపల్లి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఫలితం తెలిపే సీల్డ్ కవర్‌ను తెరిసేందుకు అధికారులు డేట్ ఫిక్స్ చేశారు. 16న ఉదయం 10 గంటలకు హైకోర్టు నుంచి వచ్చిన తీర్పుకు సంబంధించిన సీల్డ్ కవర్‌ను ఓపెన్ చేయనున్నారు. దీంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎవరనే ఉత్కంఠకు తెరపడనుంది. ఈనెల 9న జరపాల్సిన సీల్డ్ కవర్ ఓపెన్‌ను కొన్ని అనివార్య కారణాలతో వాయిదా వేసిన అధికారులు 16న అయినా వాయిదా లేకుండా సీల్డ్ కవర్ ఓపెన్ చేస్తారో లేదో వేసి చూడాలి.

గంపలగూడెంలో రైతుల ధాన్యం నగదుతో పరార్

గంపలగూడెం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి లక్షలాది రూపాయలు విలువైన ధాన్యం కొనుగోలు చేసి వారికి నగదు చెల్లించకుండా మోసం చేసి ధాన్యం వ్యాపారి పరారైన ఘటనపై గంపలగూడెం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సత్యాలపాడు గ్రామానికి చెందిన దుద్దుకూరు వెంకటేశ్వర్లు గంపలగూడెంలోని ఒక రైస్ మిల్లును లీజుకు తీసుకొని దాన్ని నిర్వహిస్తూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నాడు. ఈక్రమంలో వినగడపకు చెందిన అనుమోలు శేషగిరిరావు, గంపలగూడెంకు చెందిన చారుగుండ్ల చిన్న హనుమంతరావు, కేతేపల్లి మురళీకృష్ణ, చారుగుండ్ల చిత్తరంజన్‌తో కలిసి మొత్తం 11మంది రైతుల నుంచి రూ.39.67 లక్షల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేసి దాన్ని నగదుగా మార్చి రైతులకు ఇవ్వకుండా పరారయ్యాడు. రైతులు సత్యాలపాడులోని అతడి ఇంటి చుట్టూ ధాన్యం డబ్బుల కోసం ఎన్నిసార్లు తిరిగినా ఉపయోగం లేకుండా పోయింది. వెంకటేశ్వర్లు ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి 20 రోజులుగా పరారీలో ఉన్నాడు. అనుమోలు శేషగిరిరావుతో పాటు మరికొందరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

విస్తరణ వివాదం

(5వ పేజీ తరువాయి)

విస్తరించనున్నట్టు చెప్పారు. దీనిపై విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్‌హెచ్-65ను ఓఆర్ఆర్ వరకు విస్తరించటం అర్థరహితమని వ్యాఖ్యానించారు. ఇదేమి అమరావతి-హైదరాబాద్ రోడ్డు కాదని, దానికి వేరే ప్రణాళికలు ఉన్నాయన్నారు. హైదరాబాద్-విజయవాడ విస్తరణ పనులను గొల్లపూడి నుంచి విజయవాడ పశ్చిమ బైపాస్‌కు అనుసంధానించాల్సిందేనని ఆయన పట్టుబట్టారు. ఈ మేరకు డీపీఆర్ రూపొందించాలంటున్నారు. ఈ అంశాన్ని తాను రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన చెప్పారు.

ఎన్‌హెచ్ అధికారులతో సమావేశం

ఎన్‌హెచ్-65 విస్తరణకు సంబంధించి విజయవాడ వేదికగా శుక్రవారం ఎన్‌హెచ్ అధికారులతో ఎంపీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వరకు జాతీయ రహదారిని గొల్లపూడి వరకు విస్తరించడమే సబబు అనే అభిప్రాయం ఈ సమావేశంలో వ్యక్తమైంది. వాస్తవానికి గొల్లపూడి మైలురాయి సెంటర్ వరకు ఆరు వరుసలుగా విస్తరిస్తేనే బాగుంటుంది. అలాగే, గొల్లపూడి మీదుగా వెళ్తున్న విజయవాడ పశ్చిమ బైపాస్ (ఎన్‌హెచ్-16)కు కచ్చితంగా అనుసంధానం చేయాల్సిందే. దీనిద్వారా హైదరాబాద్-విజయవాడకు అనుసంధానంతో పాటు హైదరాబాద్-విశాఖ, హైదరాబాద్-చెన్నై మార్గాన్ని కూడా అనుసంధానించవచ్చు. కానీ, తెలంగాణా రాష్ట్ర ఎన్‌హెచ్ అధికారులు విజయవాడ ప్రయోజనాలను కాదని, తెలంగాణా ప్రయోజనాలకే పెద్దపీట వేశారు. దీంతో ఎన్టీఆర్ జిల్లాలో ఎన్‌హెచ్-65 ఆరు వరుసల రోడ్డు విస్తరణ అసమగ్రంగా మారింది. డీపీఆర్ దశలోనే అలైన్‌మెంట్ లోపాలను గుర్తించటం వల్ల సమస్యను పరిష్కరించుకునే మార్గం ఏర్పడింది.

గుంటుపల్లి వద్ద బైపాస్ ప్రతిపాదన.. తిరస్కరణ

హైదరాబాద్-విజయవాడ అలైన్‌మెంట్‌ను గొల్లపూడి వరకు విస్తరిస్తే గుంటుపల్లి వద్ద బైపాస్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను తెలంగాణ ఎన్‌హెచ్ అధికారులు తీసుకురాగా, దీనికి ఎంపీ కేశినేని శివనాథ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. బైపాస్ అవసరం లేదని, ఉన్న రోడ్డునే ఆరు వరుసలుగా గొల్లపూడి వరకు విస్తరించాలని పట్టుబట్టారు.

ఇబ్రహీంపట్నం ఎగువన బైపాస్‌లు

ఎన్‌హెచ్-65 విస్తరణకు సంబంధించి పాత డీపీఆర్‌లో ఇబ్రహీంపట్నం దిగువ వరకు నిర్దేశించిన బైపాస్‌లను యథాతథంగా కొత్త డీపీఆర్ పరిధిలోకి తీసుకురావాలన్న డిమాండ్‌ను సమావేశంలో లేవనెత్తారు. దీంతో పాత డీపీఆర్‌లో ఐతవరం, పరిటాల తదితర ప్రాంతాల్లో ప్రతిపాదిత బైపాస్‌ల విషయంలో ఎలాంటి అభ్యంతరాలు లేవని తెలియజేశారు.

ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్‌లో ఫ్లై ఓవర్

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ సమస్యగా ఉండటంతో ఈ ప్రాంతంలో ఫ్లై ఓవర్ నిర్మించాలని ప్రతిపాదించారు. ఈ ఫ్లై ఓవర్ ఇబ్రహీంపట్నం శివారు నుంచి ప్రారంభమై వీటీపీఎస్ కాల్వ ఎగువన దిగుతుంది. ఈ ఫ్లై ఓవర్‌ను టీ ఆకారంలో నిర్మించాలని నిర్ణయించారు. ఇబ్రహీంపట్నం నుంచి ఛత్తీస్‌గఢ్‌కు ఎన్‌హెచ్-30 కూడా అనుసంధానం అవుతుంది కాబట్టి, సర్కిల్ నుంచి కొండపల్లి వైపు ఫ్లై ఓవర్‌కు ఒక దారి ఇవ్వాలని నిర్ణయించారు.

ముందే అప్రమత్తమయ్యాం..

మాకు ఈ విషయం చివరి నిమిషంలో తెలిసింది. మొదట్లో అనుకున్న డీపీఆర్ గొల్లపూడి వరకు ఉంది. తర్వాత అలైన్‌మెంట్ మారింది. ఈ విషయాన్ని గ్రహించిన వెంటనే కలెక్టర్ లక్ష్మీశతో మాట్లాడాను. వెంటనే సమావేశం ఏర్పాటు చేయించాం. ఈ సమావేశంలో అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఎన్టీఆర్ జిల్లాలో 20 కిలోమీటర్ల వరకే పరిమితం చేయాలనుకున్న దానిని మేము అంగీకరించలేదు. గొల్లపూడి వరకు పొడిగించాల్సిందేనని గట్టిగానే చెప్పాం. ఈ విషయంలో వెనక్కి తగ్గేది లేదు. ప్రజల సమస్య కాబట్టి గట్టిగా పోరాడతాం. గొల్లపూడి వరకు అనుసంధానం చేసే వరకు కృషి చేస్తాం. **- కేశినేని శివనాథ్, విజయవాడ ఎంపీ**

విజయవాడ తూర్పు



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	108,116, 127
చికెన్ విత్ స్కిన్	206
చికెన్ స్కిన్‌లెస్	216

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

షార్ట్ సర్క్యూట్‌తో అపార్టుమెంట్‌లోని ఫ్లోర్ దగ్ధం

వన్‌టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్‌తో కృష్ణలంక పాత పోస్టాఫీస్ రోడ్డులోని ఒక అపార్టుమెంట్‌లోని ఫస్ట్‌ఫ్లోర్ పూర్తిగా దగ్ధమైంది. తాతా సాంబశివరావు ఆటోనగర్‌లో ఓ షాపును నిర్వహిస్తున్నారు. శనివారం పిల్లలు, భార్య బయటకు వెళ్లగా, అతను ఇంట్లోనే ఉన్నారు. ఈ సమయంలో ఏసీ నుంచి స్పార్క్ వచ్చి అమాంతంగా మంటలు చెలరేగాయి. దీంతో మంటలు వ్యాపించి ఇంట్లో సామాను దగ్ధమైంది. ఆ ఇంటి నివాసితులు కట్టుబట్టలతో ఉన్నారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. కృష్ణలంక పోలీసులు సంఘటనా ప్రదేశానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా, ఈ సంఘటన పై కృష్ణలంక పోలీసులకు ఆలస్యంగా సమాచారం తెలిసింది.

సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పిలుపు



సమావేశంలో గద్దె రామ్మోహన్

పటమట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పటమట అశోక్‌నగర్‌లోని తూర్పు కార్యాలయంలో శనివారం 2, 6, 9, 10, 13, 19 డివిజన్ల నాయకులతో డివిజన్ కమిటీపై ఆయన మాట్లాడారు. ప్రతి డివిజన్‌లో 10 మంది సభ్యులతో డివిజన్ కమిటీ నియమించాలని డివిజన్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శితో పాటుగా ముగ్గురు కార్యనిర్వహణ కార్యదర్శులు, ముగ్గురు కార్యదర్శులు, ఒక కోశాధికారి మొత్తం డివిజన్ కమిటీని నియమించాలన్నారు. కమిటీ బీసీ, ఎస్సీ, మైనార్టీ మహిళలకు ఒక్కొక్క రిజర్వేషన్ ఉండేలా చూడాలన్నారు. 14 మందితో డివిజన్ అనుబంధాల విభాగాల కమిటీలను నియమించుకోవాలన్నారు. తెలుగు యువత, ఐ.టీడీపీ, తెలుగు మహిళ, కల్చరల్, డాక్టర్స్ వింగ్, ఎస్.హెచ్.జీ గ్రూప్, ఎస్సీ విభాగం, మైనార్టీ, క్రిష్టియన్, బీసీ, ఎస్టీ, టీఎన్‌టీయూసీ, దివ్యాంగుల విభాగ కమిటీలను నియమించుకోవాలన్నారు. వరుసగా మూడు సార్లు డివిజన్ అధ్యక్ష పదవి చేసిన వారు స్వచ్ఛందంగా తప్పుకొని మరొకరికి అవకాశం కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చెన్నుపాటి గాంధీ, ముమ్మనేని ప్రసాద్, దేవినేని అపర్ణ, చెన్నుపాటి క్రాంతిశ్రీ, దాసరి గాబ్రియేల్ పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాల పంపిణీ

పటమట నల్లూరి వారి కల్యాణ మండపంలో స్నేహర్షి చారిటబుల్ ట్రస్టు, యాకం ట్రస్టు, రోటరీ ట్రస్టు భాగస్వామ్యంతో సుబదం పేరుతో కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. సంస్థను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అభినందించారు. దివ్యాంగులకు ట్రై సైకిల్స్ ఇవ్వడంతోనే తన సేవా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వీరంకి భారతిదేవి, డాక్టర్ వసుంధర, డాక్టర్ సుధాకర్ బాబు, శివ ప్రసాద్, డాక్టర్ శైలజ, మాధురి, లేపాక్షి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేడియంలో ముగిసిన వేసవి క్రీడా శిబిరం



శిక్షణ పొందిన బాలలతో డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్

రైల్వేస్టేషన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే డివిజన్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే 10 నుంచి 16 ఏళ్లలోపు పిల్లల కోసం నిర్వహించిన వేసవి క్రీడా శిబిరం శనివారంతో ముగిసింది. ఈ ముగింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో డివిజన్ మేనేజర్ నరేంద్ర ఎ పాటిల్ ముఖ్య అతిథిగా, అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ (మౌలిక సదుపాయాలు) పి.ఈ.ఎడ్విన్ గౌరవ అతిథిగా, సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ ప్రేమకుమార్ లఖావత్ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ ఎం.దినేష్ కుమార్ సమన్వయకర్తగా వ్యవహరించి కార్యక్రమాన్ని నిర్వహించారు. వేడుక ప్రారంభంలో రైల్వే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.ఎస్.నారాయణ కుమార్తెలు ఇత్తడి పళ్లెంపై నిలబడి బ్యాలెన్సింగ్ చేస్తూ సంప్రదాయ తరంగ నృత్యాన్ని ప్రదర్శించారు. రైల్వే కుటుంబాల నుంచి 71 మంది, ఇతరులు 45 మంది కలిసి మొత్తం 116 మంది పిల్లలు వేసవి శిబిరంలో పాల్గొన్నారు. 70 మంది క్రికెట్‌లో, 17 మంది అథ్లెటిక్స్‌లో, 18 మంది ఫుట్‌బాల్‌లో, ఏడుగురు కబడ్డీలో, నలుగురు వాలీబాల్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సభలో నరేంద్ర ఎ పాటిల్ క్రీడా శిబిర ఏర్పాట్ల పై ప్రశంసించారు. కోచ్‌లకు గౌరవ వేతనాలను పంపిణీ చేశారు.

ప్రమాదకరంగా ఉన్న కేబుల్, ఇంటర్నెట్ వైర్లను తొలగించండి

నగర కమిషనర్ ధ్యానచంద్ర

కార్పొరేషన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ప్రజల భద్రతకు ప్రమాదకరంగా మారిన కేబుల్, ఇంటర్నెట్ వైర్లు, అవసరంలేని వాడని వైర్లను వారం రోజుల్లో తొలగించాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర శనివారం ఒక ప్రకటనలో అధికారులను ఆదేశించారు. నగర సుందరీకరణను కూడా పరిగణలోకి తీసుకుని వైర్లను క్రమబద్దీకరించాలని సూచించారు. వారం రోజుల్లోగా వైర్లను తొలగించకపోతే, వారం తరువాత నగరపాలకసంస్థ అధికారులు స్వయంగా రంగంలోకి దిగి తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. పౌరులు, కేబుల్ ఆపరేటర్లు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

2574 కేంద్రాల్లో యోగా ప్రదర్శన

విజయవాడ నగరపాలకసంస్థ పరిధిలో ఉన్న సచివాలయాలన్నిటిలోనూ ప్రతి సచివాలయానికి తొమ్మిది కేంద్రాల్లో యోగా ప్రదర్శన నిర్వహించారని నగర కమిషనర్ ధ్యానచంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే విధంగా యోగాంధ్ర కార్యక్రమాల ద్వారా ప్రజలకు యోగాపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. విజయవాడ నగరపాలకసంస్థలో ఉన్న 286 సచివాలయాల్లో 2574 కేంద్రాల్లో యోగా ప్రదర్శన నిర్వహించినట్లు తెలిపారు.



శ్రీవారి ఆలయంలో యోగాసనాలు నేడు



యోగాసనాల కార్యక్రమ బ్యానర్ ఆవిష్కరిస్తున్న టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలిత రమాదేవి తదితరులు

లబ్బీపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదివారం టీటీడీ ఆధ్వర్యంలో టీటీడీ కల్యాణ మండపంలోని శ్రీవారి ఆలయ ప్రాంగణంలో యోగాసనాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చేకూరి లలిత రమాదేవి తెలిపారు. శనివారం ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో కార్యక్రమానికి సంబంధించిన బ్యానర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివారం ఉదయం 6గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభవుతుందని, యోగా గురువు శిఖాకొల్లి వెంకట సుబ్బారావు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రాం అసిస్టెంట్ నీవీకే ప్రసాద్, జిల్లా ధార్మిక కమిటీ సభ్యులు బొగ్గరపు వెంకట బాల కోటేశ్వరరావు, ఆలయ అసిస్టెంట్ పి.రోహిత్, యోగా శిక్షకులు సుబ్బారావు, ఆలయపోటు స్వామి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



నీట్‌లో విజయవాడ నారాయణ విద్యార్థుల సత్తా


● డీజీఎం జాగర్లమూడి రవిశంకర్

పెనమలూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): శనివారం విడుదలైన దేశవ్యాప్త నీట్ ఫలితాల్లో విజయవాడ నారాయణ కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి సత్తా చాటారని సంస్థ డీజీఎం జాగర్లమూడి రవిశంకర్ తెలిపారు. ముస్కాన్ ఆనంద్ 643 మార్కులతో ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 112వ ర్యాంకు, అభినవ 231వ ర్యాంకు, ఎం హస్నికరెడ్డి 343వ ర్యాంకు, అక్షయ్ కీర్తన్ 379వ ర్యాంకు, శ్రీరాం యాదవ్ 536వ ర్యాంకు, కే నికిత 605వ ర్యాంకు, యశశ్విని 646 వర్యాంకు, ఇషాంత్ 657వ రాంక్యు, కే సైనా రెడ్డి 866వ ర్యాంకు, వై కృష్ణ ప్రణీత్ 900వ ర్యాంకులతో విజయ దుందుభి మోగించారని రవిశంకర్ తెలిపారు. 5వేల లోపు 34 మంది, పదివేలలోపు 79 మంది, మొత్తం170 మందికి పైగా విద్యార్థులు మెడికల్ సీట్లు సాధిస్తారని తెలిపారు. పటిష్టమైన బోధనా పద్ధతులు, మైక్రో షెడ్యూల్స్, పరీక్ష విధానాలపై ప్రత్యేక శిక్షణ, విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ తదితర అంశాల వలనే ఇంతటి విజయాలు సాధిస్తున్నట్లు రవిశంకర్ తెలిపారు. విజేతలను డీన్స్, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు అభినందనలతో ముంచెత్తారు.



దుర్గగుడిలో సంకట హర గణేశుడికి అర్చన

ఇంద్రకీలాద్రి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో సంకటహర చతుర్థి తిథి సందర్భంగా శనివారం గణపతికి విశేష అర్చన నిర్వహించారు. గణపతికి అభిషేకం, అర్చన, హోమాది కార్యక్రమాలను శాస్త్రోక్తంగా, వేదోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని గణేశుడికి పూజలు చేశారు.



నేతల చిత్రపటాలకు పాలాభిషేకం



నేతల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న ఈశ్వర్

ప్రభుత్వాసుపత్రి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న 30 లక్షల మంది బీసీ విద్యార్థుల తల్లుల బ్యాంకుఖాతాల్లో తల్లికి వందనం డబ్బులు వేసినందుకు సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌ల చిత్రపటాలకు శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్ 6వ డివిజన్‌లో శనివారం పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పడాల గంగాధర్, వేముల దుర్గారావు, పడమటి సతీష్ చంద్ర, దాసరి గాబ్రియేల్ పాల్గొన్నారు.



స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా సీపీఎం పాదయాత్ర



స్థానికుల విద్యుత్ బిల్లులను తనిఖీ చేస్తున్న బాబూరావు

విజయవాడ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ విషయంలో కూటమి ప్రభుత్వం ఆదిలోనే తప్పటడుగు వేసిందని సీపీఎం రాష్ట్రకార్యవర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు విమర్శించారు. శనివారం స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా కండ్రిక కాలనీలో పాద యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రంలో మోదీ ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోయి నాడు వైసీపీ స్మార్ట్‌మీటర్ల ఒప్పందం చేసుకుందని, ఆ మీటర్లను తొలగించాలని పిలుపునిచ్చిన టీడీపీ నేతలే నేడు మీటర్లను బిగించాలని ఆదేశాలు ఇవ్వడం దుర్మార్గమని విమర్శించారు. 64వ డివిజన్‌లో కండ్రిక కాలనీలో 75 సంవత్సరాల వృద్ధురాలి ఇంట్లో ఉన్న పాత మీటర్ పనిచేయడంలేదనే సాకుతో అదానీ కంపెనీ సిబ్బంది మార్చడానికి ప్రయత్నించారని, దీనిపై ప్రశ్నించగా పాత మీటర్‌ను యథాస్థానంలో ఉంచి వెళ్లిపోయారని తెలిపారు. అనంతరం కాలనీలో గృహాలకు సంబంధించిన విద్యుత్ బిల్లులు తనిఖీ చేశారు. సీపీఎం నేతలు రాజ్యలక్ష్మి, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి విష ప్రచారాలను రాష్ట్ర ప్రజలు నమ్మరు: లుక్కా

వన్‌టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డి విష ప్రచారాలను రాష్ట్ర ప్రజలు ఎవరూ నమ్మరని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ తెలిపారు. ఆటోనగర్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లికి వందనం పథకం కింద కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి డబ్బులు జమ చేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అందచేస్తున్న సంక్షేమ పథకాలు చూసి ఓర్వలేక జగన్‌రెడ్డి సైకోబ్యాచ్ తమ ఎక్స్ ఖాతాలో రూ.15వేలలో రూ.2వేలు మంత్రి లోకేష్ ఖాతాలో జమ అయ్యాయని విషప్రచారం చేస్తున్నారని తెలిపారు. దీనిపై మంత్రి లోకేష్ స్పందించి 24 గంటల్లో రుజువు చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని వైసీపీకి సవాల్ విసిరారని, వైసీపీ సైకో బ్యాచ్ తోక ముడిచిందన్నారు. వైసీపీ సైకో బ్యాచ్ చేసే విష ప్రచారం ప్రజలు నమ్మవద్దని, సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటారని ఆయన తెలిపారు.



ఆంధ్రజ్యోతి
చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

రేవంత్ అన్నా... తగ్గేదేలే

సంధ్య థియేటర్ ఘటన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి, అల్లు అర్జున్ ఒకే వేదికను పంచుకోవడం ఇదే తొలిసారి కావడం, వారిద్దరి కలయిక ఎలా ఉండబోతోందో అనే ఆసక్తిని పెంచింది. అల్లు అర్జున్‌ను రేవంత్‌రెడ్డి ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. 'పుష్ప 2' చిత్రానికి గాను ఉత్తమనటుడు పురస్కారాన్ని రేవంత్‌రెడ్డి నుంచి అందుకున్నారు అల్లు అర్జున్. వ్యాఖ్యాతలు ఆయన్ను వేదికపై మాట్లాడాలని కోరడంతో అల్లు అర్జున్ మైక్ అందుకున్నారు. ముందుగా తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రేవంత్‌రెడ్డి అన్న అంటూ ముఖ్యమంత్రిని సంబోధించారు. 'సినిమా ఫంక్షన్ కాబట్టి సరదాగా ఒక డైలాగ్ చెప్పొచ్చా అన్నా' అంటూ రేవంత్‌రెడ్డిని అనుమతి అడగడం, ఆయన నవ్వుతూ అనుమతిస్తున్నట్లు చేతిని ఊపడంతో 'పుష్ప 2'లోని డైలాగ్‌ను అల్లు అర్జున్ చెప్పారు.




పైడి జైరాజ్ ఫిల్మ్ అవార్డు
మణిరత్నం


బీఎన్ రెడ్డి ఫిల్మ్ అవార్డు
సుకుమార్


నాగిరెడ్డి - చక్రపాణి అవార్డు
అట్లూరి పూర్ణచంద్రరావు


కాంతారావు ఫిల్మ్ అవార్డు
విజయ్ దేవరకొండ


రఘుపతి వెంకయ్య ఫిల్మ్ అవార్డు
యండమూరి వీరేంద్రనాథ్


2024 ఉత్తమ నటి
నివేదా థామస్


ఉత్తమ చిత్రం బాహుబలి 2
రాజమౌళి, ప్రసాద్ దేవినేని

కన్నుల పండుగగా గద్దర్ అవార్డుల వేడుక



'గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ 2024' ప్రధానోత్సవ కార్యక్రమం శనివారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా 2024 ఏడాదికి గాను తెలుగు చలనచిత్రాలకు చెందిన వివిధ కేటగిరీల్లో విజేతలతో పాటు 2014-2023 వరకు ఉత్తమ ప్రథమ, ద్వితీయ, తృతీయ చలనచిత్రాలకు, ఉత్తమ నటీనటులు, దర్శక నిర్మాతలకు సైతం ఈ పురస్కారాలను అందించారు. 14 ఏళ్ల తర్వాత తెలంగాణ ప్రభుత్వం తెలుగు సినిమాకు ప్రాంతీయ అవార్డులు ఇచ్చింది ఈ కార్యక్రమానికి యావత్ చిత్ర పరిశ్రమ కదిలొచ్చింది. తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ (టీజీఎఫ్‌డీసీ) చైర్మన్ దిల్ రాజు, ఎండీ ఎస్. హరీష్ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. రెడ్‌కార్పెట్‌పై సినీ ప్రముఖులు సందడి చేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే అవార్డ్ ఫంక్షన్‌కు సంబంధించిన సావనీర్‌ను వారిద్దరూ ఆవిష్కరించారు. తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్ మెమెంటోనూ రూపొందించిన రమావత్ నాగుల నాయక్‌ను, జ్యూరీ చైర్మన్ మురళీమోహన్, చైర్‌పర్సన్ జయసుధ, సభ్యులు కే దశరథ్, డీవీకేరాజు, ఊహ తదితరులను జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు ఎస్. తమన్, ఎం.ఎం కీరవాణి, గాయకులు రామ్ మిరియాల, మంగ్లీ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గద్దర్‌ను గుర్తు చేసుకుంటూ మంగ్లీ 'పొడుస్తున్న పొద్దుమీద, బండెనక బండికట్టి' పాటలు ఆలపించారు. పాతతరం కథానాయికలు జయప్రద, జయసుధ, సుహాసిని, ఒకేఫ్రేమ్‌లో కనిపించి అలరించారు. భీమ్స్ సిసిరోలియో తల్లితో పాటు కలసి పురస్కారం అందుకున్నారు. ఆ సందర్భంలో ఆయన తల్లిని ముద్దాడిన దృశ్యం మనసుకు హత్తుకుంది. ముందుగా వ్యక్తిగత అవార్డ్ విభాగం ప్రధానంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఈ పురస్కారాలను అందజేశారు. తర్వాత రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా తొలిపురస్కారాన్ని 'రజాకార్' చిత్రానికి గాను ఉత్తమ నిర్మాతగా గూడురు నారాయణరెడ్డి, దర్శకుడు యాట సత్యనారాయణకు అందజేశారు. ఉత్తమ ప్రజాదరణ చిత్రం కేటగిరిలో 'ఆయ్' చిత్రానికి గాను బన్నీ వాసు తరపున అల్లు అరవింద్ పురస్కారం అందుకున్నారు.

శుభ పరిణామం

14 ఏళ్ల తర్వాత ఈ రోజు తెలుగు సినిమా అవార్డ్ వేడుకను నిర్వహించుకోవడం శుభ పరిణామం. 2014 జూన్ 2న తెలంగాణ ఆవిర్భవించినప్పటి నుంచి జ్యూరీ ఎంపిక చేసిన చిత్రాలకు అవార్డ్ ఇవ్వడం సంతోషకరం. తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్ ఈ రోజు ఇంత వైభవంగా నిర్వహించుకోవడానికి కారణమైన తెలంగాణ సీఎం ఎ. రేవంత్‌రెడ్డి గారికి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారికి ధన్యవాదాలు.

- దిల్‌రాజు

నా కుటుంబం తరఫున ధన్యవాదాలు

ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నందమూరి బాలకృష్ణ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'తెలంగాణ ప్రభుత్వం బ్రహ్మాండమైన ఉత్సవాన్ని జరుపుతోంది. గద్దరన్న తెలంగాణ ముద్దుబిడ్డ. ఆయన పేరును చిరస్థాయిగా నిలబెట్టేలా ఈ అవార్డులు ఇవ్వడం గొప్ప విషయం. అందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు. 1996లో ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డ్ ఇవ్వడం మొదలైంది. మధ్యలో ఆగిపోయింది. మళ్లీ పదేళ్ల తర్వాత తిరిగి ఎన్టీఆర్ అవార్డ్‌ను ఇస్తున్నందుకు నా కుటుంబం తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నాను. ఈ అవార్డ్‌కు తొలి గ్రహీతగా ఎంపికవ్వడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. ఈ పురస్కారంతో పాటు ఇచ్చే నగదు బహుమతిని బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు రేవంత్ అన్న ఇచ్చినట్లు భావిస్తున్నాను' అని చెప్పారు.

నా బాధ్యతను పెంచింది

సినిమా పరిశ్రమను ఒకతాటిపైకి తెచ్చి గద్దరన్న పేరుతో అవార్డులు ఇవ్వడం ఆనందంగా ఉంది. కాంతారావు గారి పేరు మీద ఇచ్చే అవార్డ్‌ను స్వీకరిస్తున్న తొలి నటుడిగా నా బాధ్యతను మరింత పెంచింది. రేవంత్‌రెడ్డి గారికి ధన్యవాదాలు.

విజయ్ దేవరకొండ

2024లో ఉత్తమ చిత్రాలు


మొదటి ఉత్తమ చిత్రం: కల్కి 2898 ఏడీ - దర్శక నిర్మాతలు చలసాని అశ్వనిదత్, నాగ్ అశ్విన్


రెండో ఉత్తమ చిత్రం పొట్టేల్ - నిర్మాత ఎస్ కుమార్


మూడో ఉత్తమ చిత్రం లక్కీ భాస్కర్ - దర్శకనిర్మాత వెంకీ అట్లూరి, నాగవంశీ


రజాకార్ (బెస్ట్ పిక్చర్ ఆన్ హిస్టరీ) నిర్మాత గూడూరు నారాయణ రెడ్డి, డైరెక్టర్ సత్యనారాయణ


ఫరియా అబ్దుల్లా (మత్తు వదలరా-2)


దర్శకులు- సుజిత్, సందీప్ ('క')


బాలనటులు -అరుణ్‌దేవ్, హారిక (35 చిన్న కథ కాదు)


ఉత్తమ చిత్రం ఉప్పెన
నవీన్ యెర్నేని, వై. రవిశంకర్


దర్శకుడు వేణు - బలగం


అడివి శేష్ - మేజర్


జ్యూరీ చైర్మన్ మురళీమోహన్


జ్యూరీ చైర్‌పర్సన్ జయసుధ


కీరవాణి, చంద్రబోస్‌కు సత్కారం


దర్శకుడు యదువంశీ (కమిటీ కుర్రోళ్లు)

బిజినెస్ ప్లస్

మోతీలాల్ ఓస్వాల్ బీఎస్ఈ 1000 ఇండెక్స్ ఫండ్

మోతీలాల్ ఓస్వాల్ మ్యూచువల్ ఫండ్ (ఎంఓఎంఎఫ్).. బీఎస్ఈ 1000 ఇండెక్స్ ఫండ్‌ను తీసుకువచ్చింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఫండ్. దీని బీఎస్ఈ 1000 టీఆర్ఐ బెంచ్‌మార్క్ ఇండెక్స్‌గా ఉండనుంది. ఈ ఇండెక్స్ ఫండ్‌లో లార్జ్, మిడ్, స్మాల్, మైక్రోక్యాప్ విభాగాలకు చెందిన కంపెనీలున్నాయి. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.500. సిప్ రూపంలో కూడా ఇన్వెస్ట్ చేయవచ్చు. ముగింపు తేదీ ఈ నెల 19.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



15వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	515
వరంగల్	542	గోదావరి	500
చిత్తూరు	613	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	97	విజయవాడ	100
వరంగల్	97	గుంటూరు	103
కరీంనగర్	97	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	97	చిత్తూరు	94
కర్నూలు	97	నెల్లూరు	99
విశాఖపట్నం	90	అనంతపురం	99
గోదావరి	100		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,680 ▲	93,200 ▲	1,20,000 ▲
విజయవాడ	1,00,300 ▲	97,500 ▲	1,10,000 ▲
విశాఖపట్నం	1,01,400 ▼	93,200 ▲	1,20,000 ▲
రాజమండ్రి	1,01,670 ▲	93,200 ▲	1,09,400 ▲
ప్రొద్దుటూరు	98,100 ▼	90,250 ▼	1,05,000 ▲
ముంబై	99,060 ▲	90,740 ▲	1,06,170 ▲

లవ్ యూ నాన్న



నేడు ఫాదర్స్ డే. ఈ సందర్భంగా మీ తండ్రికి ఏదైనా బహుమతి ఇవ్వాలనుకుంటున్నారా..? చిన్న పిల్లలిచ్చే చిరు కానుకైనా నాన్నకు కలిగే సంతోషం చెప్పలేనంత. టీనేజీలో ఉంటే.. డాడీ ఇచ్చే పాకెట్ మనీతో గిఫ్ట్ కొని ఆయన్ని సంబుర పెట్టవచ్చు. ఇప్పటికే ప్రయోజకులై, సంపాదిస్తుంటే మాత్రం కాస్త భిన్నంగా ఆలోచించండి. మీ జీవితానికి సుస్థిర బాట వేసిన నాన్న భవిష్యత్‌కు ఆర్థిక భరోసా కల్పించే కానుక అందించడం మేలు.

ఆరోగ్య బీమా

వయసుతో పాటు ఆరోగ్య సమస్యలూ పెరగడం సాధారణం. కానీ, ఈ రోజుల్లో వైద్యం చాలా ఖరీదైపోయింది. దేశంలో వైద్య ఖర్చులు ఏటా 14 శాతం చొప్పున పెరుగుతున్నాయని ఓ సర్వే వెల్లడించింది. ఈ ప్రత్యేక దినోత్సవం సందర్భంగా మీ నాన్న ఆరోగ్యానికి బీమాతో ధీమా కల్పించండి. మీ నాన్న పేరిట హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ కొనుగోలు చేయడం మేలు. మీ తండ్రి గారికి ఇప్పటికే దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలుంటే వాటికీ బీమా కవరేజీ లభించేలా పాలసీ తీసుకోవడం ఉత్తమం. ఒకవేళ మీ తండ్రి వయసు 50-60 ఏళ్ల పైబడితే, క్యాన్సర్, గుండెపోటు వంటి తీవ్ర అనారోగ్యాల ఖర్చులకూ కవరేజీ కల్పించే క్రిటికల్ ఇల్‌నెల్ పాలసీని తీసుకోవడం మంచిది.

రిటైర్మెంట్ ప్లాన్

మీ నాన్నకు రిటైర్మెంట్ ప్లాన్ బహుమతిగా ఇవ్వండి. లేదా ఆయన పేరిట యూనిట్ లింక్డ్ పెన్షన్ ప్లాన్ (యూఎల్‌పీపీ)లో ఇన్వెస్ట్ చేయొచ్చు. సాధారణంగా ఈ పథకాలు ఈక్విటీలతో పాటు రుణపత్రాల్లోనూ పెట్టుబడులు పెడుతుంటాయి. కాబట్టి, దీర్ఘకాలంలో మంచి ప్రతిఫలాలు లభించే అవకాశం ఉంటుంది. ఈ పాలసీ గడువు ముగిశాక, పోగైన కార్పస్‌లో 60 శాతం వెనక్కి తీసుకొని, మిగతా సొమ్ముతో నెలవారీ పెన్షన్ లభించేలా ప్లాన్ చేయండి. తద్వారా మలి వయసులో మీ నాన్నకు ఆర్థిక స్వేచ్ఛ కల్పించండి. అంతేకాదు, మన సగటు ఆయుష్షు 80 ఏళ్లకు పెరిగింది. కాబట్టి, రిటైర్మెంట్ తర్వాత 20-30 ఏళ్ల వరకు మీ నాన్నకు ప్రతినెలా ఖర్చులకు సరిపడా సొమ్ము చేతికందేలా దీర్ఘకాలిక వ్యూహంతో పెట్టుబడులు పెట్టండి.

పొదుపు పథకాలు

మీ తండ్రి పేరిట కొంత సొమ్మును ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయవచ్చు. ఒకవేళ సీనియర్ సిటిజన్ అయితే, అధిక వడ్డీ చెల్లించే పొదుపు పథకాలు చాలా అందుబాటులో ఉన్నాయి. బ్యాంకులు, పోస్టల్ డిపార్ట్‌మెంట్ వీరి కోసం ప్రత్యేక పథకాలను ఆఫర్ చేస్తున్నాయి. లేదంటే, ఏదైనా మ్యూచువల్ ఫండ్ స్కీమ్‌లోనూ పెట్టుబడులు పెట్టవచ్చు. క్రమానుగత పెట్టుబడి పథకాలు (సిప్) కూడా మంచి ప్రత్యామ్నాయం.

షేర్లు, సెక్యూరిటీలు

భవిష్యత్‌లో మంచి ప్రతిఫలాలు అందించేందుకు అవకాశాలున్న కంపెనీల షేర్లను కానుకగా ఇవ్వండి. ప్రభుత్వ సెక్యూరిటీల్లోనూ పెట్టుబడులు పెట్టవచ్చు. కొంత రిస్క్ తీసుకోగలిగితే, మంచి రేటింగ్ కలిగిన కార్పొరేట్ బాండ్లలోనూ ఇన్వెస్ట్ చేయొచ్చు.

యాడ్ ఆన్ కార్డ్

మీ క్రెడిట్ కార్డుపై యాడ్ ఆన్ కార్డు తీసుకోగలిగే వెసులుబాటు ఉంటే.. దాన్ని మీ నాన్నకు గిఫ్ట్‌గా ఇవ్వవచ్చు. తద్వారా చిన్న మొత్తాల్లో ఖర్చుల కోసం వారు ఆ కార్డును ఉపయోగించుకునే వీలుంటుంది.

గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ నిర్వహిస్తున్నారా..!

ఇదీ GST



రాంబాబు గొండాల

దేశ ఆర్థికాభివృద్ధిలో రవాణా రంగం పాత్ర ఎంతో కీలకం. ముఖ్యంగా వస్తు రవాణా సేవలు (ట్రాన్స్‌పోర్ట్ సర్వీస్) సరిగా లేకుంటే ఏ ప్రాంతంలో కూడా పారిశ్రామికాభివృద్ధి, వ్యాపారాభివృద్ధి జరగదు. ఒక ఫ్యాక్టరీకి ముడి సరుకు కావాలన్నా, తయారైన వస్తువులు బయటకు పోవాలన్నా, ఒక వ్యాపారి సరుకు కొనుగోలు చేయాలన్నా, అమ్మాలన్నా లేదా ఒక రైతు పండించిన పంటను అమ్ముకోవాలన్నా రవాణా సౌకర్యం లేకుంటే ఏదీ జరగదు. ఇంత ముఖ్య పాత్ర పోషిస్తున్న 'గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్'కు సంబంధించి జీఎస్‌టీ విధివిధానాలు, పన్ను రేటు వివరాలు మీ కోసం. ఇంతకు ముందు సర్వీస్ ట్యాక్స్‌లో కానీ ఇప్పుడు జీఎస్‌టీలో కానీ వస్తు రవాణాకు సంబంధించి 'గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ' అనే ఒక సర్వీస్ ప్రవేశపెట్టడం జరిగింది. దీనినే జీటీఏ అని అంటారు. జీఎస్‌టీలో గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ మీద విధించే పన్ను ఈ జీటీఏకు సంబంధించి ఉంటుంది. మరి జీటీఏ అంటే ఏమిటి? వస్తు రవాణా చేసే ప్రతి వాహనం జీటీఏ కిందకు వస్తుందా?

జీఎస్‌టీ పరిభాషలో చెప్పాలంటే రోడ్డు ద్వారా వస్తు రవాణా చేస్తూ కన్‌సైన్‌మెంట్ నోట్ లాంటివి ఇచ్చే వ్యక్తి లేదా సంస్థను గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ అంటారు. మరి కన్‌సైన్‌మెంట్ నోట్ అంటే ఏమిటి? దీనికి అటుఇటుగా నిర్వచించినప్పటికీ ట్రాన్స్‌పోర్ట్‌కు సంబంధించిన వ్యక్తి తన వాహనంలో రవాణా చేసే వస్తువులకు సంబంధించి ఇచ్చే రసీదు. ఇందులో వస్తువులు పంపే వ్యక్తి, స్వీకరించే వ్యక్తి, రవాణా అవుతున్న వస్తువుల వివరాలతో పాటుగా సరుకు ఎక్కడి నుంచి బయలుదేరుతుంది, ఎక్కడకు రవాణా అవుతుందనే వివరాలు ఇందులో ఉంటాయి. కన్‌సైన్‌మెంట్ నోట్‌కు ఎందుకు అంత ప్రాముఖ్యత ఉందంటే ఎప్పుడైతే ట్రాన్స్‌పోర్టర్ కన్‌సైన్‌మెంట్ నోట్ ఇస్తాడో.. ఆ వస్తువులకు సంబంధించిన పూర్తి బాధ్యత వస్తు విక్రయదారుని నుంచి ట్రాన్స్‌పోర్టర్‌కు బదిలీ అవుతుంది. ఆయా వస్తువులు గమ్యస్థానం చేరే వరకు వాటి సంరక్షణ బాధ్యత అతనిదే. కాబట్టి ఏ వాహనదారుడైతే కన్‌సైన్‌మెంట్ నోట్ ఇస్తాడో అతను మాత్రమే జీటీఏ కింద పరిగణించబడతాడు. అతను మాత్రమే జీఎస్‌టీ పరిధిలోకి వస్తాడు. అంటే రోడ్డు మీద ఉండే చిన్న వాహనాలు, ఆటో సర్వీస్‌లు జీటీఏ పరిధిలోకి రావు. ఎందుకంటే ఇవి సాధారణంగా ఎలాంటి కన్‌సైన్‌మెంట్ నోట్ ఇవ్వవు.

మరి జీటీఏ కిందకు వచ్చే వ్యక్తి ఎంత పన్ను కట్టాలి? జీటీఏకి సంబంధించి రెండు రకాల పన్ను శ్లాబులు ఉన్నాయి. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) వాడుకుంటే 12 శాతం లేకుంటే 5 శాతం చొప్పున పన్ను కట్టాల్సి ఉంటుంది.

అయితే జీటీఏ ఈ కింది కేటగిరిలోని వ్యక్తులకు సర్వీస్ అందజేస్తే సదరు సర్వీస్‌ను రివర్స్ చార్జ్ కింద పరిగణించి ఆయా సేవలు అందుకునే వ్యక్తులు 5 శాతం చొప్పున పన్ను కట్టాల్సి ఉంటుంది. అవేమిటంటే.. ఏదేనీ ఫ్యాక్టరీ, సొసైటీ, కో-ఆపరేటివ్ సొసైటీ, జీఎస్‌టీ కింద రిజిస్టర్ అయిన వ్యక్తులు, బాడీ కార్పొరేట్, పార్ట్‌నర్‌షిప్ ఫర్మ్, క్యాజువల్ ట్యాక్సబుల్ పర్సన్ మొదలైనవి. అంటే, ఎప్పుడైతే ఒక జీటీఏ పైన తెలిపిన కేటగిరీలోని వ్యక్తులకు లేదా సంస్థలకు సరుకు రవాణా చేస్తేంటే.. ఆయా వ్యక్తులు లేదా సంస్థలు రివర్స్ చార్జ్ మెకానిజం (ఆర్‌సీఎం) కింద 5 శాతం పన్ను చెల్లించాలి. ఇలాంటి సందర్భంలో జీటీఏకి ఐటీసీ పొందే అర్హత ఉండదు. అంటే వారు కొనే లారీల మీద లేదా ఇతర సర్వీసుల మీద ఐటీసీ పొందే అర్హత కోల్పోతారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని తనంతట తానే ట్యాక్స్ కడుతూ ఐటీసీ పొందే సౌలభ్యాన్ని ప్రభుత్వం కల్పించింది. కానీ పన్ను 12 శాతం చొప్పున కట్టాలి. అంటే ఒక జీటీఏ తనంత తానే ట్యాక్స్ కట్టాలంటే (ఫార్వర్డ్ ట్యాక్స్ మెకానిజం) కచ్చితంగా 12 శాతం చెల్లించాలి. ఒకసారి ఈ విధానాన్ని ఎంచుకుంటే ఆ ఆర్థిక సంవత్సరం మొత్తం అదే విధానంలో ఉండాలి.

అయితే 2022 జూలైలో దీనికి మళ్లీ సవరణ చేయటం జరిగింది. దీని ప్రకారం ఫార్వర్డ్ మెకానిజంలో రెండు రకాల ఆప్షన్స్ ఇవ్వటం జరిగింది. 5 శాతం, 12 శాతం అంటే జీటీఏ తనే ట్యాక్స్ కడుతూ ఐటీసీ పొందాలంటే 12 శాతం ఎంచుకోవాలి. ఒకవేళ 5 శాతం ఎంచుకుంటే ఐటీసికి అర్హత ఉండదు. ఇది ఏదీ కాకుండా సర్వీస్ పొందిన వ్యక్తి పన్ను కట్టాలంటే ఆర్‌సీఎం విధానాన్ని ఎంచుకోవాలి. అప్పుడు కూడా ఐటీసీ అర్హత ఉండదు. మరి ఏ విధానం ఎంచుకున్నాడో ఎలా తెలవాలంటే.. తదుపరి ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తాను ఎంచుకునే విధానానికి సంబంధించి అనెగ్జర్-V ను మార్చి 15లోపు దాఖలు చేయాల్సి ఉంటుంది. అంటే 2025-26 ఆర్థిక సంవత్సరంలో తాను ఏ పన్ను విధానాన్ని ఎంచుకుంటున్నది 2025 మార్చి 15లోపు తెలియజేయాలి. ముఖ్యంగా గుర్తు పెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే ఒకసారి ఒక విధానాన్ని ఎంచుకుంటే ఆ ఆర్థిక సంవత్సరం మొత్తం అదే విధానంలో కొనసాగాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

వ్యక్తిగత రుణం తీసుకుంటున్నారా!

ఈ నిబంధనలు తెలుసుకోండి..



ప్రస్తుత ప్రపంచంలో ఎక్కువ మంది అప్పుల అప్పారావులే. ఖర్చులు ఆదాయాన్ని మించిపోయినప్పుడు ఎవరైనా అప్పులు చేయక తప్పదు. ఆరోగ్య బీమా లేకుండా ఆరోగ్యం దెబ్బతిన్నప్పుడు, ఇంటి రిపేర్లు, లేదా ఇతర అత్యవసర ఖర్చుల కోసం అప్పులు చేయక తప్పదు. ఈ రోజుల్లో చేబదులు ఇచ్చే వాళ్లు తక్కువ. అప్పుడు వ్యక్తిగత రుణాలే గతి.

బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) నుంచి వ్యక్తిగత (పర్సనల్) రుణాలు తీసుకునే వారి సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. కొద్దిగా రిస్క్ ఉన్నా వడ్డీ రేటు కొద్దిగా ఎక్కువగా ఉండడంతో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు కూడా ఈ రుణాలు ఇచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి. ప్రస్తుతం బ్యాంకు రుణాల్లో దాదాపు 36 శాతం ఈ రుణాలే. దీన్ని బట్టి బ్యాంకులు కూడా ఈ రుణాలపై ఎంత ఆసక్తితో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. కాకపోతే కొన్ని అర్హతలకు లోబడి మాత్రమే బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఈ రుణాలు ఇస్తాయి. ఆ అర్హతలు ఏమిటో తెలుసుకుందాం.

రుణ అర్హతలు: వ్యక్తిగత రుణాల మంజూరుకు ప్రతి బ్యాంకు, ఎన్‌బీఎఫ్‌సీ కొన్ని నిబంధనలు పాటిస్తుంది. ఈ అర్హతలు ఆయా సంస్థలను బట్టి వేరు వేరుగా ఉంటాయి. అయితే అన్ని సంస్థలు రుణం తీసుకునే వ్యక్తి కనీస ఆదాయం, క్రెడిట్ స్కోరు, వయసు, చేస్తున్న ఉద్యోగం, తీసుకునే రుణాన్ని ఎంత కాలంలో చెల్లిస్తాడు? అనే విషయాలను తప్పనిసరిగా చూస్తాయి. పై విషయాల ఆధారంగా వ్యక్తిగత రుణం తీసుకున్న వ్యకికి ఎంత రుణం మంజూరు చేయవచ్చు? ఆ రుణం తీసుకున్న వ్యక్తి ఆ రుణాన్ని సకాలంలో తిరిగి చెల్లించగలడా? లేదా? అనే అంశంపై బ్యాంకులు ఒక అవగాహనకు వస్తాయి. ప్రస్తుతం చాలా బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఈ రుణాల మంజూరు ప్రక్రియను ఆన్‌లైన్ చేశాయి. ఆయా బ్యాంకుల వెబ్‌సైట్‌లోకి వెళ్లి మీ కేవైసీ వివరాలు, కావాల్సిన ఈఎంఐ ప్లాన్ ఎంటర్ చేస్తే వ్యక్తిగత రుణ మంజూరుకు మీకు అర్హత ఉన్నదీ, లేనిదీ బ్యాంకులు వీలైనంత త్వరగా తెలియజేస్తాయి. ఈ రుణాల కనీస వడ్డీ 10.5 శాతం నుంచి ప్రారంభమవుతుంది.

ప్రధాన అర్హతలు

- 21 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్కులై ఉండాలి
- కనీస క్రెడిట్ స్కోర్ 700 పైన ఉండాలి
- ఉంటున్న నగరాన్ని బట్టి కనీస నెలవారీ ఆదాయం
- ఎన్నాళ్ల నుంచి అయా సంస్థల్లో పని చేస్తున్నారు
- స్వయం ఉపాధా లేక ఉద్యోగమా?
- ఇతర రుణాల చెల్లింపు భారమేమైనా ఉందా లేదా అనే అంశం

తెలుసుకోవడం ఎలా?

వ్యక్తిగత రుణాలకు మనకు అర్హత ఉందా? లేదా? అనే విషయం తెలుసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. ఇందుకు ప్రస్తుతం ఆన్‌లైన్‌లో అనేక ఫ్రీ టూల్స్ ఉన్నాయి. ఆ వెబ్‌సైట్లలోకి లాగిన్ అయి మీ వయసు, ఆదాయం, ఉద్యోగం, ఇప్పటికే ఉన్న అప్పుల వంటి వివరాలు నమోదు చేస్తే చాలు. మీరు ఎంత వ్యక్తిగత రుణానికి అర్హులో వెంటనే తెలిసిపోతుంది.

స్పోర్ట్స్

ఒలింపిక్ చాంపియన్‌కు ఆర్య జోడీ షాక్

వరల్డ్‌కప్‌లో స్వర్ణం కైవసం



మ్యూనిచ్: ఒలింపిక్ చాంపియన్‌కు షాకిచ్చిన భారత షూటింగ్ జోడీ ఆర్య బోర్స్-అర్జున్ బబుతా స్వర్ణాన్ని కైవసం చేసుకొంది. ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్‌లో శనివారం జరిగిన 10 మీ ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ ఈవెంట్ స్వర్ణ పోరులో ఆర్య-అర్జున్ జంట 17-7తో చైనాకు చెందిన వరల్డ్ చాంపియన్ ద్వయం జీఫీ వాంగ్-లిహావో షెంగ్‌ను చిత్తు చేసింది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో అర్జున్ (317.7 పాయింట్లు), ఆర్య (317.5)లు మొత్తం 635.2 పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలవగా.. షెంగ్-వాంగ్ జంట 635.9 పాయింట్లతో అగ్రస్థానాన్ని సొంతం చేసుకొన్నారు.

రెండు దశలలో రంజీట్రోఫీ

దేశవాళీ టోర్నీలో మార్పులు

న్యూఢిల్లీ: ఈసారి రంజీ ట్రోఫీ (2025-26) అక్టోబరు 15 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు రెండు దశలలో జరగనుంది. ఈమేరకు శనివారం జరిగిన బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్ణయించింది. అలాగే ఈ సీజన్ రంజీట్రోఫీలో మార్పులు కూడా చోటు చేసుకోనున్నాయి. వచ్చే సీజన్‌నుంచి ప్లేట్‌గ్రూపు నుంచి ఎలీట్‌కు ఒక్కోజట్టు మాత్రమే పదోన్నతి, రెలిగేషన్ అవనున్నాయి. రంజీ తొలి దశ అక్టోబరు 15 నుంచి నవంబరు 19 వరకు, రెండో దశ జనవరి 22 నుంచి ఫిబ్రవరి ఒకటి వరకు నిర్వహిస్తారు. నాకౌట్ ఫిబ్రవరి 6 నుంచి 28 వరకు జరుగుతుంది. దులీప్ ట్రోఫీని ఆగస్టు 28 నుంచి సెప్టెంబరు 15 వరకు నిర్వహిస్తారు. ఇరానీ కప్ అక్టోబరు ఒకటి నుంచి 5 వరకు జరుగుతుంది. ముస్తాక్ అలీ టోర్నీలో సూపర్ లీగ్ విధానాన్ని ప్రవేశపెడుతున్నారు. అలాగే ప్లేట్ గ్రూప్‌నూ పునఃప్రవేశపెడుతున్నారు.

హైదరాబాద్, విశాఖలో కివీస్ మ్యాచ్‌లు!

వచ్చే ఏడాది జనవరిలో మూడు వన్డేలు, ఐదు టీ20లలో భారత్-న్యూజిలాండ్ జట్లు తలపడనున్నాయి. జనవరి 11 నుంచి 31 వరకు సిరీస్ జరగనుంది. ఈ సిరీస్‌లో భాగంగా జనవరి 11న జరిగే తొలి వన్డేకు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనున్నట్టు తెలిసింది. రెండో వన్డే రాజ్‌కోట్ (జనవరి 14), మూడో వన్డే ఇండోర్ (జనవరి 18), తొలి టీ 20 నాగ్‌పూర్ (జనవరి 21), రెండో టీ20 రాంచి (జనవరి 23), మూడో టీ20 గువాహటి (జనవరి 25), నాలుగో టీ 20 విశాఖపట్నం (జనవరి 28), ఐదో టీ20 తిరువనంతపురం (జనవరి 31)లో జరగనున్నట్టు సమాచారం.

ప్రణతికి కాంస్యం

ఆసియా జిమ్నాస్టిక్స్



న్యూఢిల్లీ: భారత్‌కు చెందిన ప్రణతి నాయక్ ఆసియా సీనియర్ మహిళల ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్ వాల్ట్ విభాగంలో కాంస్యం సాధించింది. దక్షిణకొరియాలోని జెచియాన్‌లో శనివారం జరిగిన ఫైనల్లో 30 ఏళ్ల ప్రణతి 13.466 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానం దక్కించుకుంది. యిహాన్ ఝూంగ్ (చైనా, 13.650) స్వర్ణం, థీ క్విన్ (వియత్నాం, 13.583) రజతం నెగ్గారు. భారత్‌కే చెందిన ప్రొతిష్ఠ సమంత (13.016) నాలుగో స్థానంలో నిలిచింది. ఈ ప్రదర్శనతో ఆసియా స్థాయి పోటీలలో 3 పతకాలు అందుకున్న భారత జిమ్నాస్ట్‌గా ప్రణతి రికార్డుకెక్కింది. దీంతో దీపా కర్మాకర్ (రెండు పతకాలు)ను అధిగమించింది. 2019, 2022 ఆసియా చాంపియన్‌షిప్స్‌లో ప్రణతి కాంస్యాలు నెగ్గింది.

ఢిల్లీ చెస్ విజేత అభిజిత్



న్యూఢిల్లీ: ఢిల్లీ ఓపెన్ చెస్ టైటిల్‌ను భారత జీఎం అభిజిత్ గుప్తా (8.5 పాయింట్లు) సొంతం చేసుకున్నాడు. 9వ రౌండ్‌లో మిహాయిల్ (బెలారస్)పై కీలక విజయం సాధించిన అభిజిత్.. ఇంటర్నేషనల్ మాస్టర్ అరోనిక్ ఘోష్‌తో చివరి రౌండ్‌ను డ్రా చేసుకున్నాడు. నికీ టెన్కో (బెలారస్) రెండో, భారత గ్రాండ్‌మాస్టర్ దీప్తాయన్ ఘోష్ మూడో స్థానంలో నిలిచారు.

'బన్నీ హాప్స్' క్యాచ్‌లు కుదరవు..

దుబాయ్: బౌండరీల దగ్గర పట్టే 'బన్నీ హాప్స్' క్యాచ్‌ల విషయంలో మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. క్యాచ్ విషయంలో ఫీల్డర్ నియంత్రణ కోల్పోయే అవకాశం ఉంటే మైదానంలో ఉన్నప్పుడే బంతిని పైకి విసిరి.. లైన్ దాటి తిరిగి లోనికి వచ్చే అందుకోవాల్సి ఉంటుంది. అంటే బౌండరీ బయట బంతిని పలుమార్లు ఎగర వేయడం కుదరదు. ఈనెల నుంచే కొత్త రూల్ ఐసీసీ ప్లేయింగ్ కండిషన్స్‌లో భాగం కానుండగా.. వచ్చే ఏడాది అక్టోబరు నుంచి ఎంసీసీ రూల్ ఆఫ్ లాలో అధికారికంగా చేరుస్తారు. మరోవైపు వన్డేల్లో రెండు కొత్తబంతుల నిబంధనల్లో మార్పు, కంకషన్ సబ్‌స్టిట్యూట్ ప్రొటోకాల్‌ను ఐసీసీ ఆమోదించింది.

సఫారీలు సాధించారు

27 ఏళ్ల తర్వాత తొలి ఐసీసీ టైటిల్ సొంతం

వరల్డ్ టెస్టు చాంపియన్‌గా దక్షిణాఫ్రికా

ఫైనల్లో ఆసీస్‌పై ఘన విజయం

ఏళ్లు కాదు.. దశాబ్దాలపాటు ఎదురుచూసిన తరుణమిది. తమ శక్తి యుక్తులన్నీ ధారపోసి పోరాడినా ఐసీసీ టోర్నీల్లో నిరాశగా వెనుదిరగడమే చూసిన దక్షిణాఫ్రికా ఇప్పుడు సగర్వంగా 'గద' ఎత్తుకుంది. ఒత్తిడికి చిత్తయ్యే జట్టంటూ.. చోకర్స్‌గా ముద్ర వేసి క్రీడాలోకం పరిహసించినా.. క్రికెట్ పుట్టినిల్లుగా భావించే లార్డ్స్‌లోనే 'ఇదిగో ఇదీ మా సత్తా' అంటూ వరల్డ్ టెస్టు చాంపియన్స్ హోదాలో పోడియంపై నిలిచింది. బలమైన ప్రత్యర్థి ఆసీస్ బౌలర్ల ధాటికి తొలి ఇన్నింగ్స్‌లో విలవిల్లాడిన బ్యాటర్లు లక్ష్య ఛేదనలో మాత్రం తెగించి నిలబడ్డారు. శతక వీరుడు మార్‌క్రమ్‌తో పాటు చీలమండ గాయం ఇబ్బందిపెట్టినా గెలుపు కోసం కెప్టెన్ బవుమా క్రీజులో నిలిచిన తీరుకు వహ్వా.. అనాల్సిందే. దీంతో 27 ఏళ్ల తర్వాత ఐసీసీ టోర్నీల్లో సఫారీలు విజేతలయ్యారు.



ప్రైజ్‌మనీ

దక్షిణాఫ్రికాకు - రూ. 31.05 కోట్లు

ఆస్ట్రేలియాకు - రూ. 18.63 కోట్లు

సంక్షిప్త స్కోర్లు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 212; దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 138 ఆలౌట్; ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: 207 ఆలౌట్ (స్టార్క్ 58 నాటౌట్, క్యారీ 43, లబుషేన్ 22; ఎన్‌గిడి 3/38, రబాడ 4/59); దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: 282/5 (మార్‌క్రమ్ 136, బవుమా 66; బెడింగ్‌మ్ 21; స్టార్క్ 3/66).

2 లార్డ్స్ మైదానంలో రెండో అత్యధిక ఛేదన (282)ను సాధించిన జట్టుగా సౌతాఫ్రికా. 1984లో ఇంగ్లండ్‌పై 342 పరుగుల ఛేదనతో విండీస్ టాప్‌లో ఉంది.

3 డబ్ల్యూటీసీలో వరుసగా మూడో సీజన్‌లోనూ కొత్త విజేత రావడం విశేషం. గతంలో న్యూజిలాండ్, ఆస్ట్రేలియా చాంపియన్స్‌గా నిలిచాయి.

4 ఐసీసీ టోర్నమెంట్ ఫైనల్స్‌లో ఆసీస్ ఓడడం ఇది నాలుగోసారి.

దక్షిణాఫ్రికా ఆడిన ఐసీసీ ఫైనల్స్

టోర్నీ	ఏడాది	ప్రత్యర్థి
నాకౌట్ ట్రోఫీ	1998	విండీస్‌పై గెలుపు
మహిళల టీ20 వరల్డ్‌కప్	2023	ఆసీస్ చేతిలో ఓటమి
పురుషుల టీ20 వరల్డ్‌కప్	2024	భారత్ చేతిలో ఓటమి
మహిళల టీ20 వరల్డ్‌కప్	2024	కివీస్ చేతిలో ఓటమి
వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్	2025	ఆసీస్‌పై విజయం

లండన్: రెండేళ్ల పాటు అద్భుత విజయాలతో సాగిన దక్షిణాఫ్రికా ప్రయాణం.. ప్రతిష్ఠాత్మక వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకోవడంతో ముగిసింది. శనివారం డబ్ల్యూటీసీ ఫైనల్‌లో ఆస్ట్రేలియాను 5 వికెట్ల తేడాతో ఓడించిన బవుమా సేన ఐసీసీ టెస్టు గదను సగర్వంగా అందుకుంది. అలాగే ఈ జట్టుకిది వరుసగా ఎనిమిదో టెస్టు విజయం కాగా.. 1998లో నాకౌట్ ట్రోఫీ తర్వాత రెండో ఐసీసీ టోర్నీ విజయం కావడం విశేషం. అటు ఇప్పటికే పది ఐసీసీ టైటిళ్లను ఖాతాలో వేసుకున్న ఆసీస్ రెండోసారి డబ్ల్యూటీసీ టైటిల్‌పై ఆశలు పెట్టుకున్నా నిరాశే ఎదురైంది. 2010 (టీ20 వరల్డ్‌కప్) తర్వాత కంగారూలు ఓ ఐసీసీ టోర్నీ ఫైనల్లో ఓడడం ఇదే తొలిసారి. నాలుగో రోజు కేవలం విజయానికి 69 పరుగుల దూరంలో నిలిచిన సఫారీలు తమ రెండో ఇన్నింగ్స్‌లో 282/5 స్కోరు సాధించారు. మార్‌క్రమ్ (136), బవుమా (66) గెలుపులో కీలక పాత్ర పోషించారు. స్టార్క్‌కు మూడు వికెట్లు దక్కాయి. అంతకు ముందు ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 212, సౌతాఫ్రికా 138 పరుగులు చేయగా.. రెండో ఇన్నింగ్స్‌లో 207 పరుగులు సాధించిన ఆసీస్ ప్రత్యర్థి ముందు 282 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. **ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా మార్‌క్రమ్** నిలిచాడు.

తొలి సెషన్‌లోనే..: నాలుగో రోజు 213/2 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన సౌతాఫ్రికా గెలుపునకు మరో 69 పరుగులే చేయాల్సివుంది. ఆసీస్ బౌలర్లు సఫారీలపై ఒత్తిడి పెంచేందుకు స్టంప్స్‌ను లక్ష్యంగా చేసుకుని బంతులు విసిరారు. వికెట్ల కోసం ఆసీస్ తమకున్న మూడు రివ్యూలను కూడా వాడేసుకుంది. కొత్త బంతిని సైతం తీసుకున్నా.. మొక్కవోని ఏకాగ్రతతో బ్యాటర్లు క్రీజులో నిలిచారు. తొలి సెషన్‌లో కేవలం మూడు బౌండరీలు మాత్రమే వచ్చాయి. అయితే మూడో ఓవర్‌లోనే కెప్టెన్ బవుమాను కమిన్స్ దెబ్బతీయడంతో మూడో వికెట్‌కు 147 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కానీ మార్‌క్రమ్ వారికి అడ్డుగా నిలిచాడు. స్టబ్స్ (8)తో కలిసి నాలుగో వికెట్‌కు 24.. బెడింగమ్ (21 నాటౌట్)తో కలిసి ఐదో వికెట్‌కు 35 పరుగులు జోడించాడు. గెలుపునకు మరో 6 పరుగుల దూరంలో అతడి 6 గంటల 23 నిమిషాల సుదీర్ఘ పోరాటానికి పేసర్ హాజెల్‌వుడ్ తెరదించాడు. మార్‌క్రమ్‌కు ఇరు జట్ల ఆటగాళ్లతో పాటు లార్డ్స్ ప్రేక్షకులు లేచి నిలబడి చప్పట్లతో అభినందనలు తెలిపారు. చివరకు 84వ ఓవర్‌లో స్టార్క్ వైడ్ ఫుల్‌టాస్‌ను కవర్ పాయింట్ వైపు వెరెయిన్ (4 నాటౌట్) సింగిల్ తీయడంతో దక్షిణాఫ్రికా అంతులేని సంబరాల్లో మునిగింది.

సరికొత్త అధ్యాయం

ఎన్నాళ్ల నిరీక్షణ.. ఎన్నేళ్ల నిర్వేదన..! కీలక నాకౌట్ మ్యాచ్‌ల్లో ఓటములతో అభిమానుల కలలు కల్లలు కావడం.. జట్టు నైరాశ్యంలో మునిగిపోవడం. మొత్తంగా వెరసి 'అన్ లక్కీ' అనే ట్యాగ్‌ను సొంతం చేసుకొన్న జట్టు దక్షిణాఫ్రికా. చోకర్స్ (కీలక మ్యాచ్‌ల్లో ఒత్తిడికి చిత్తయ్యే జట్టు)గా ముద్ర వేసుకొన్న సఫారీలు ఇప్పుడు చాంపియన్లుగా నిలిచారు.

దిగ్గజాల వల్ల కానిది..: ఏబీ డివిల్లీర్స్, గ్రేమ్ స్మిత్, గ్యారీ కిర్‌స్టెన్, అలెన్ డొనాల్డ్, జాక్ కలిస్ లాంటి దిగ్గజ ఆటగాళ్లు జట్టు కోసం ఎంతో శ్రమించారు. వీరందరి కృషితో జట్టు మెరుగుపడినా.. ఐసీసీ ట్రోఫీ మాత్రం అందని ద్రాక్షే అయింది. ఎట్టకేలకు మార్‌క్రమ్, బవుమా అద్భుత పోరాటంతో సౌతాఫ్రికా క్రికెట్ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించారు.



ఓటములను దిగమింగుకొని..: నాకౌట్స్‌లో నిరాశ.. సఫారీలకు 1992 నుంచి వెంటాడుతోంది. ఆ వరల్డ్‌కప్‌లో ఇంగ్లండ్‌తో సెమీస్ మ్యాచ్‌లో వరుణుడి రూపంలో షాక్ తగిలింది. 1999 వరల్డ్ కప్‌లో ఆస్ట్రేలియాతో సెమీస్ మ్యాచ్ టై కావడం అనేది ఎప్పటికీ గుండెల్లో ముల్లులాంటిదే. గతేడాది జూన్ 29న జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్లో భారత్ చేతిలో ఓడిన దక్షిణాఫ్రికా.. ఏడాది తిరిగే సరికి 'జూన్ 14'ను సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజుగా మార్చుకొంది. కెరీర్ చివర్లో ఉన్న రబాడ.. ఫైనల్ మ్యాచ్‌లో కంగారూల పనిబట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో డకౌటైన మార్ క్రమ్.. భారీ శతకంతో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. వీరిద్దరి పోరాట స్ఫూర్తితో సౌతాఫ్రికా అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

విమాన ప్రమాదంపై
ఉన్నత స్థాయి కమిటీ

కూలిపోవడానికి కారణాలపై పరిశీలన.. భవిష్యత్తులో భద్రతా చర్యలపై రోడ్‌మ్యాప్

- మూడు నెలల్లో కమిటీ నివేదిక వస్తుంది
- కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు
- 274కు చేరిన మృతుల సంఖ్య


విమాన ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే

న్యూఢిల్లీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఎయిరిండియా విమానం కూలిపోవడానికి కారణాలను పరిశీలించేందుకు కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. ఈ కమిటీ సోమవారం సమావేశమై విమాన ప్రమాదంపై విచారణ చేపడుతుందని.. 3 నెలల్లో విచారణ పూర్తి చేసి సమగ్ర నివేదిక సమర్పిస్తుందన్నారు. విమాన ప్రమాదాలను నివారించడానికి ప్రస్తుతం అనుసరిస్తున్న కార్యాచరణ ప్రణాళికను పరిశీలిస్తుందని, భవిష్యత్తులో భద్రతా చర్యల కోసం చేపట్టాల్సిన సమగ్ర, విధాన ఆధారిత రోడ్‌మ్యాప్‌ను కూడా రూపొందిస్తుందని చెప్పారు. అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదం నేపథ్యంలో విమానయాన భద్రతపై శనివారం ఉన్నతాధికారులతో కేంద్ర మంత్రి సమీక్షించారు. అనంతరం ఉడాన్ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. విమాన ప్రమాద ఘటన యావత్ దేశ ప్రజల మనసులను కలచివేసిందని రామ్మోహన్‌నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. తన తండ్రి ఎర్రన్నాయుడు రోడ్డు ప్రమాదంలో మరణించారని, ప్రస్తుతం విమాన ప్రమాద బాధిత కుటుంబాలు అనుభవిస్తున్న బాధ, ఆవేదనను తాను అర్థం చేసుకోగలనని చెప్పారు. విమానయానానికి సంబంధించి కఠినమైన భద్రతా ప్రమాణాలను పాటిస్తున్నామని, అయినా ఈ దుర్ఘటన చోటుచేసుకుందన్నారు. దీనిపై వైమానిక ప్రమాదాల దర్యాప్తు సంస్థ (ఏఐఐబీ) వెంటనే అధికారిక దర్యాప్తు ప్రారంభించిదన్నారు. బ్లాక్ బాక్స్‌ను స్వాధీనం చేసుకున్నామని, దాని డీకోడింగ్‌తో ప్రమాదానికి ముందు చివరి క్షణాల్లో ఏం జరిగిందో స్పష్టత వస్తుందని తెలిపారు.

అన్ని రకాల డేటాను పరిశీలించి..

కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ ఆధ్వర్యంలోని ఉన్నత స్థాయి కమిటీలో.. పౌర విమానయాన శాఖ కార్యదర్శి, హోంశాఖ అదనపు కార్యదర్శితోపాటు గుజరాత్ హోంశాఖ, ఆ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ, అహ్మదాబాద్ పోలీస్ కమిషనర్, వైమానిక దళం భద్రత, తనిఖీల డైరెక్టర్ జనరల్, పౌర విమానయియాన భద్రతా సంస్థ (బీసీఏఎస్) డైరెక్టర్ జనరల్‌లు, డీజీసీఏ ప్రతినిధులు, ఇంటెలిజెన్స్ బ్యూరో స్పెషల్ డైరెక్టర్, ఫోరెన్సిక్ సైన్స్ సర్వీసెస్ డైరెక్టర్ సభ్యులుగా ఉంటారు. వీరితోపాటు వైమానిక రంగ నిపుణులు, ప్రమాద ఘటన దర్యాప్తు అధికారులు కూడా కమిటీలో ఉంటారు. విమాన ప్రమాదానికి సంబంధించి అన్ని రకాల వైమానిక రికార్డులు, సమాచారం, సాక్షుల వాంగ్మూలాలను ఈ కమిటీ పరిశీలిస్తుంది.

274కి చేరిన మృతుల సంఖ్య..

ఎయిరిండియా విమాన ప్రమాద మృతుల సంఖ్య 274కి చేరింది. "ప్రమాద స్థలం నుంచి ఇప్పటివరకు 274 మృతదేహాలను వెలికితీసి సిటీ సివిల్ ఆస్పత్రికి తరలించారు. చాలా మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయిన నేపథ్యంలో.. కుటుంబ సభ్యుల డీఎన్‌ఏతో సరిపోల్చి నిర్ధారించే ప్రక్రియ కొనసాగుతోంది. ఇది పూర్తవగానే మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తారు" అని బీజే వైద్య కళాశాల జూనియర్ వైద్యుల సంఘం అధ్యక్షుడు ధావల్ గమేటి తెలిపారు. ప్రమాదంలో 241 మంది ప్రయాణికులు మరణించినట్టు ఎయిరిండియా ఇప్పటికే ప్రకటించింది. మిగతా 33 మందిలో వైద్య కళాశాల విద్యార్థులు, వైద్యులు, వారి కుటుంబ సభ్యులు, హాస్టల్ మెస్‌లో పనిచేస్తున్నవారు ఉన్నారు. కాగా ఇప్పటివరకు 19మంది డీఎన్‌ఏ నమూనాలను సరిపోల్చిన వైద్యులు మృతదేహాలను అప్పగించే ప్రక్రియ చేపట్టినట్టు సమాచారం. ప్రమాద స్థలంలో సహాయక చర్యలు, శిథిలాల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. ప్రమాద స్థలాన్ని జాతీయ భద్రతాదళం (ఎన్‌ఎస్‌జీ), జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) బృందాలు కూడా క్షుణ్నంగా పరిశీలించినట్టు సమాచారం. కాగా, ఎయిరిండియా విమానం కూలిపోయి దెబ్బతిన్న బీజే వైద్య కళాశాల హాస్టల్ భవనాలను ఖాళీ చేయిస్తున్నట్టు కాలేజీ డీన్ మీనాక్షి పారిఖ్ తెలిపారు.

మృతుల కుటుంబాలకు రూ.25లక్షల తక్షణసాయం

అహ్మదాబాద్ ప్రమాదంలో మరణించినవారి కుటుంబాలకు, ప్రాణా లతో బయటపడిన వ్యక్తికి తక్షణసాయంగా రూ.25లక్షల చొప్పున అందిస్తున్నట్టు ఎయిరిండియా ప్రకటించింది. టాటా గ్రూపు ఇప్పటికే రూ.కోటి చొప్పున ప్రకటించిన పరిహారానికి ఇది అదనం. అయితే, ప్రమాదంలో గాయపడిన బీజే వైద్య కళాశాల మెడికోలు, వైద్యులు, వారి కుటుంబాలకు కూడా రూ.కోటి చొప్పున ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని టాటా గ్రూపు చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్‌కు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది.

ప్రమాదం వీడియో తీసిన బాలుడి సాక్ష్యం!

ఎయిరిండియా విమానం టేకాఫ్ అవుతూనే, మెల్లగా కిందికి జారిపోయిన వీడియో ప్రపంచవ్యాప్తంగా వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. ఆర్యన్ అనే 17 ఏళ్ల బాలుడు రోజూ లాగానే తాము ఉంటున్న ఇంటిపై నిలబడి విమానం టేకాఫ్‌ను చిత్రీకరిస్తున్న సమయంలో ఆ ప్రమాదం రికార్డయింది. అహ్మదాబాద్ పోలీసులు ఆ బాలుడి నుంచి సాక్షిగా వాంగ్మూలం నమోదు చేశారు.

తొమ్మిది 787 విమానాల్లో భద్రతా తనిఖీలు పూర్తి

అహ్మదాబాద్ ప్రమాదం నేపథ్యంలో బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానాల్లో భద్రతా తనిఖీలు సాగుతున్నాయని, ఇప్పటికే 9విమానాల తనిఖీ పూర్తయిందని ఎయిరిండియా పేర్కొంది. ఎయిరిండియా వద్ద 787-8 విమానాలు 26, 787-9 విమానాలు 7 కలిపి మొత్తం 33 డ్రీమ్‌లైనర్ విమానాలున్నాయని తెలిపింది. మిగతా 24 విమానాల్లో తనిఖీలు చేపట్టనున్నట్టు పేర్కొంది. ప్రస్తుతం ప్రమాదానికి గురైన బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానానికి 2023 జూన్‌లో పూర్తిస్థాయి నిర్వహణ తనిఖీలు జరిగాయని, వచ్చే డిసెంబరులో మళ్లీ జరగాల్సి ఉందని విమానయానశాఖ వర్గాలు తెలిపాయి. కుడి ఇంజన్‌ను ఈ ఏడాది మార్చిలో పూర్తిస్థాయిలో పునరుద్ధరణ పనులు చేసి బిగించారని, ఎడమ ఇంజన్‌కు ఏప్రిల్‌లో తనిఖీలు నిర్వహించారన్నాయి. జీఈ ఏరోస్పేస్ తయారుచేసిన ఈ ఇంజన్లలో ఏ సమస్యల్లేవని పేర్కొన్నాయి.

పవర్ పోయింది.. కిందికి పడిపోతున్నాం..



లండన్‌కు వెళ్లేందుకు టేకాఫ్ అయిన తర్వాత 36 సెకన్లకు.. మధ్యాహ్నం 1.39 గంటల సమయంలో పైలట్ సుమిత్ సభర్వాల్ నుంచి ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కి అత్యవసర సందేశం వచ్చింది. 'మేడే.. మేడే.. మేడే.. పవర్ పోయింది.. థ్రస్ట్ రావడం లేదు.. కిందికి పడిపోతున్నాం" అని పైలట్ అన్నారు. ఆ తర్వాత విమానం నుంచి ఏ సిగ్నల్ రాలేదు. ఐదు సెకన్లున్న ఈ ఆడియో వైరల్‌గా మారింది.

కల్తీ ఇంధనమే
కూల్చిందా?



తప్పెక్కడ జరిగిందని వైమానిక నిపుణుల విశ్లేషణలు

న్యూఢిల్లీ/చెన్నై, జూన్ 14: అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమాన ప్రమాదానికి కల్తీ ఇంధనమే కారణమా? దీనివల్లే తగినంత ఎత్తు ఎగిరేందుకు అవసరమైన శక్తి విమానానికి లభించలేదా? అంటే కొందరు విమానయాన రంగ నిపుణులు అవుననే సమాధానం ఇస్తున్నారు. నేషనల్ ఏరోస్పేస్ లేబొరేటరీస్(ఎన్‌ఏఎల్) మాజీ డిప్యూటీ డైరెక్టర్ సాలిగ్రామ్ జే మురళీధర్ తాజాగా ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. పక్షి ఢీకొంటే రెండు ఇంజన్లు ఒకేసారి విఫలంకావడానికి అవకాశం ఉందన్న వాదనను తోసిపుచ్చారు. 'పక్షి ఢీకొంటే విద్యుత్తు సరఫరాకు ఆటంకం కలిగి నిప్పురవ్వలు, పొగ వస్తాయి. రెండు ఇంజన్లను పక్షులు ఒకేసారి ఢీకొనే అవకాశం ఉండదు. విమాన ప్రమాదానికి ఇంధన కల్తీనే ప్రధాన కారణంకావచ్చు. ఇంధనం కల్తీ అయితే రెండు ఇంజన్లపైనా ఒకే ప్రభావం పడుతుంది. దీనివల్ల వేగం తగ్గిపోయి విమానం ఎగరడానికి అవసరమైన శక్తి లభించదు. 35టన్నుల కంటే అధికంగా ఇంధనం ఉన్నందున విమానం కూలిపోయిన క్షణాల్లోనే భారీ విస్ఫోటనంతో అగ్నిగోళం ఏర్పడింది' అని మురళీధర్ వివరించారు. ఈ ఘోరానికి గల కారణాలపై నిపుణుల నుంచి సీనియర్ పైలట్ల వరకూ విభిన్న ఊహాగానాలు చేస్తున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం విమాన ప్రమాదానికి కారణాలు ఇవీ..

ఒక ఇంజన్ వైఫల్యం, ల్యాండింగ్ గేర్ మూసుకోకపోవడం

విమానం టేకాఫ్ అయిన వెంటనే పక్షులు ఢీకొనడం లేదా అంతర్గత సమస్యలతో ఒక ఇంజన్ విఫలమై ఉంటుంది. బోయింగ్‌లోని అత్యాధునిక శ్రేణి విమానాల్లో రెండు శక్తిమంతమైన ఇంజన్లు ఉంటాయి. వీటిలో ఒకటి విఫలమైనా రెండోదాని సాయంతో విమానం పైకి ఎగురుతుంది. విమానం టేకాఫ్ అయ్యాక ల్యాండింగ్ గేర్ మూసుకుంటే విమానం పైకి ఎగరడానికి సాయపడే ఏరోడైనమిక్ ప్రవాహం ఏర్పడుతుంది. తీవ్ర ఒత్తిడితో కూడుకున్న సమయాల్లో పైలట్లు ల్యాండింగ్ గేర్‌ను పైకి ఎత్తడం మర్చిపోయే అవకాశమూ ఉంది. ఒక ఇంజన్ విఫలం కావడానికి తోడు గేర్‌ను కిందకు వదిలేయడం వల్ల విమానం ఎత్తుకు ఎగిరే సామర్థ్యం కోల్పోతుంది. భూమికి 300-400 అడుగుల ఎత్తున ఇలాంటి పరిస్థితి ఎదురైతే దాని నుంచి బయటపడటానికి పైలట్‌కు ఎక్కువ సమయం లభించదు.

రెండు ఇంజన్లు విఫలం కావడం

ఇలాంటి సందర్భాలు చాలా అరుదుగా సంభవిస్తాయి. పక్షులు ఢీకొనడం, ఇంధనం కల్తీతోపాటు సాధారణ తనిఖీల్లో గుర్తించని యాంత్రిక లోపాల కారణంగా ఈ పరిస్థితి తలెత్తడాన్ని తోసిపుచ్చలేం. ఈ సమయంలో ల్యాండింగ్ గేర్‌ను ఎత్తడానికి, గాలి వేగాన్ని నియంత్రించడానికి అవసరమైన థ్రస్ట్ (ఎగరడానికి అవసరమైన వేగం) ఉండదు. ఈ కారణంగా విమానం క్షణాల్లోనే వేగాన్ని కోల్పోవడంతోపాటు అది ఎగురుతున్న ఎత్తు నుంచి శరవేగంగా కిందకు పడిపోవడం ప్రారంభమవుతుంది.

ఫ్లాప్ కాన్ఫిగరేషన్‌లో సమస్య

సురక్షితమైన ఎత్తుకు చేరే వరకూ రెండు ఫ్లాప్‌లు (రెక్కల వెనుక భాగం) విచ్చుకొని ఉంటేనే విమానం ఎగరడానికి అవసరమైన శక్తి లభిస్తుంది. ఒకవేళ వీటిని ముందుగానే మూసేస్తే ఆ శక్తి కూడా గణనీయంగా తగ్గిపోతుంది. ప్రమాదం జరిగిన సమయంలో అహ్మదాబాద్‌లో గాలి సాంద్రత తక్కువగా ఉంది. విమానం గేర్ తెరుచుకొని ఉండగానే ఫ్లాప్‌లు మూసుకుపోయాయి. దీంతో పైకెగరడానికి కావాల్సిన శక్తి సమకూరక విమానం అదుపు తప్పుతుంది.

సెన్సార్లలో లోపాలు

ఆధునిక విమానాలన్నీ ఆటోమేటెడ్ వ్యవస్థలపై ఆధారపడినవే. గాలి వేగాన్ని, యాంగిల్ ఆఫ్ అటాక్‌ను గుర్తించే సెన్సార్లు విమాన కంప్యూటర్‌కు తప్పుడు డేటాను ఇస్తే ఆటో-థ్రోటిల్ వ్యవస్థ ఇంజన్ శక్తిని ముందుగానే తగ్గించే ప్రమాదం ఉంది. ఇటువంటి తప్పుడు హెచ్చరికల కారణంగా విమానం ఎగిరే ఎత్తు తగ్గిపోతుంది. అలాగే గాలివేగాన్ని కొలిచే పిటాట్ ట్యూబ్ మూసుకోపోవడం, విమాన నియంత్రణ వ్యవస్థ విఫలంకావడం వల్ల విమానం వేగం, ఎగురుతున్న కోణం విషయంలో పైలట్లు పొరబడే అవకాశం ఉంటుంది. కాగా బ్లాక్‌బాక్స్ డేటాను విశ్లేషించాక పూర్తి స్పష్టత వస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు.

'బోయింగ్' నివేదికను వెంటనే విడుదల చేయాలి

అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదం నేపథ్యంలో బోయింగ్ 787 విమానాలకు సంబంధించిన నిర్మాణ లోపాలపై నివేదికను వెంటనే విడుదల చేయాలని ప్రజావేగు సలేహ్‌పూర్ తరపు న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అమెరికాకు చెందిన ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌ఏఏ)కు లేఖ రాశారు. 'బోయింగ్ 787, 777 విమానాల్లో తీవ్రమైన నాణ్యతా లోపాలు ఉన్నాయని బోయింగ్ క్వాలిటీ ఇంజనీర్ అయిన సలేహ్‌పూర్ 2024 ప్రారంభంలో ఆరోపించారు. దీనిపై 2024 మార్చిలో దర్యాప్తు ప్రారంభించిన ఎఫ్‌ఏఏ ఉన్నతాధికారులు.. అదే ఏడాది డిసెంబరులో విచారణ పూర్తయిందని సమాచారం ఇచ్చారు. తమ దర్యాప్తునకు సంబంధించిన నివేదికను త్వరలోనే విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికీ ఆ నివేదిక వెలుగు చూడలేదు' అని ఆ లేఖలో పేర్కొన్నారు. తక్షణమే ఆ నివేదికను విడుదల చేయాలని కోరారు. దీనిపై ఎఫ్‌ఏఏ స్పందించాల్సి ఉంది.

నీట్‌లో నిరాశే!

(మొదటి పేజీ తరువాయి)

నిలవగా.. టాప్-100లో మాత్రం 11 మందికి ర్యాంకులు వచ్చాయి. జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) శనివారం నీట్ ఫలితాలను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 22.76 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, 22.09 లక్షల మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 12.36 లక్షల మంది (56 శాతం) ఉత్తీర్ణులయ్యారు. గత ఏడాదితో పోలిస్తే 79,322 మంది తక్కువ. ఈసారి నీట్ పరీక్ష కఠినంగా ఉండటం, ముఖ్యంగా ఫిజిక్స్ ప్రశ్నలు మరింత కఠినంగా రావడంతో.. విద్యార్థులకు మార్కులు, ఉత్తీర్ణులైన వారి సంఖ్య తగ్గాయని నిపుణులు చెబుతున్నారు. గతంలో నీట్‌లో టాపర్లకు గరిష్ఠంగా 720 వరకు కూడా మార్కులు రాగా.. ఈసారి టాపర్ మార్కులు 686కే పరిమితం కావడం గమనార్హం. నీట్‌లో రాజస్థాన్‌కు చెందిన మహేశ్‌కుమార్ మొదటి ర్యాంకు (99.9999547 పర్సంటైల్‌తో), మధ్యప్రదేశ్‌కు చెందిన ఉత్కర్ష్ రెండో ర్యాంకు (99.9999095 పర్సంటైల్), మహారాష్ట్రకు చెందిన క్రిషాంగ్ జోషి మూడో ర్యాంకు (99.9998189 పర్సంటైల్), ఢిల్లీకి చెందిన మృణాల్ కిశోర్ ఝా 4వ (99.9998189 పర్సంటైల్), ఢిల్లీకే చెందిన అవికా అగర్వాల్ 5వ ర్యాంకు (99.9996832 పర్సంటైల్) సాధించారు. ప్రస్తుతం దేశంలో ప్రభుత్వ రంగంలో 56,000 ఎంబీబీఎస్ సీట్లు, ప్రైవేటు రంగంలో 52,000 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. డెంటల్, ఆయుర్వేదం, యునాని, సిద్ధ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు కూడా నీట్ ర్యాంకులనే పరిగణనలోకి తీసుకుంటారు. ఈసారి జనరల్ అభ్యర్థులకు 144 మార్కులు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు 113 మార్కులు, ఈడబ్ల్యూఎస్ కేటగిరీకి 127 మార్కులను కటాఫ్‌గా నిర్ణయించారు.

టాప్-100లో తెలుగు విద్యార్థులు 11 మంది

నీట్‌లో తెలుగు రాష్ట్రాలకు చెందిన 11 మంది విద్యార్థులు టాప్-100లో నిలిచారు. ఇందులో తెలంగాణ వారు ఐదుగురు, ఆంధ్రప్రదేశ్ వారు ఆరుగురు ఉన్నారు. హైదరాబాద్ విద్యార్థి కాకర్ల జీవన్ సాయికుమార్ 18వ ర్యాంకుతో దక్షిణాది రాష్ట్రాల్లోనే టాపర్‌గా నిలిచాడు. తెలంగాణకు చెందిన షణ్ముఖ నిశాంత్ అక్షింతల 37వ ర్యాంకు, మంగరి వరుణ్ 46, యంద్రపాటి షణ్ముఖ్ 48, బిదిషా మాజీ 95వ ర్యాంకు సాధించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన డి.కార్తీక్‌రామ్ కిరీటి 19వ ర్యాంకు, కె.మోహిత్‌శ్రీరామ్ 56వ, డి.సూర్యచరణ్ 59వ, పి.అవినాష్ 64వ, వైస మీర్‌కుమార్ 70వ, టి.శివమణిదీప్ 92వ ర్యాంకు సాధించారు.

ప్రతిభ చూపిన విద్యార్థులు..

హైదరాబాద్‌కు చెందిన వైద్యుడు వంశీకృష్ణ కుమారుడు మంగరి వరుణ్ నీట్‌లో జాతీయస్థాయిలో 46వ ర్యాంకు సాధించారు. తండ్రి ప్రోత్సాహంతో మంచి స్థానంలో నిలిచానని, ఢిల్లీ ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ చేస్తానని తెలిపారు. ఇక జాతీయస్థాయిలో 48వ ర్యాంకు (ఓబీసీ కేటగిరీలో 11) సాధించిన యంద్రపాటి షణ్ముఖ్ హనుమకొండ జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీకి చెందిన యంద్రపాటి శ్యాంసుందర్- రజనీ దంపతుల కుమారుడు. జాతీయ స్థాయిలో మంచి ర్యాంకు సాధించడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఖమ్మం పట్టణానికి చెందిన వైద్యుడు తూము రామకృష్ణ, నవ్య దంపతుల కుమార్తె వెన్నెల 307వ ర్యాంకు సాధించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ర్యాంకు సాధించగలిగానని, ఎంబీబీఎస్ పూర్తి చేసి ప్రజలకు సేవ చేస్తానని వెన్నెల చెప్పారు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం బంజపల్లి తండాకు చెందిన అజ్మీరా అశుతోష్ నీట్ ఎస్టీ కోటాలో 32వ ర్యాంకు (జనరల్ 5,422) సాధించారు. అశుతోష్ తల్లిదండ్రులు శాంత-లింగం ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు లక్ష్మీకాంతరావు-విద్యారాణి దంపతుల కుమారుడు హరీశ్ గౌతమ్ జాతీయ స్థాయిలో 660వ ర్యాంకు సాధించారు.

టాప్ ర్యాంకుల్లో తక్కువ.. ఉత్తీర్ణతలో ఎక్కువ..

అమ్మాయిలు ఈసారి తక్కువ మందే టాప్ ర్యాంకులు సాధించారు. కానీ మొత్తంగా ఉతీర్ణుల సంఖ్యలో ఎక్కువగా నిలిచారు. టాప్-20లో ఇద్దరు, టాప్-50లో ఐదుగురు అమ్మాయిలు మాత్రమే ర్యాంకులు సాధించారు. అదే ఉత్తీర్ణుల సంఖ్యలో అమ్మాయిలు 7,22,462 మంది ఉండగా.. అబ్బాయిల సంఖ్య 5,14,063 మాత్రమే. మహిళా కేటగిరీలో హైదరాబాద్ అమ్మాయి బిదిషా మాజీ 13వ స్థానం (జనరల్ 95), బ్రాహ్మణి రెండ్ల 17వ స్థానం (జనరల్ 108) సాధించారు. ఢిల్లీకి చెందిన అవికా అగర్వాల్ జాతీయస్థాయిలో 5వ ర్యాంకుతో మహిళల్లో టాపర్‌గా నిలిచారు. ఢిల్లీకే చెందిన ఆషి సింగ్ 12వ ర్యాంకుతో రెండో స్థానంలో ఉన్నారు. మహిళల టాప్-20 ర్యాంకుల్లో ఢిల్లీ అమ్మాయిలు అత్యధికంగా 8 మంది, మహారాష్ట్ర నుంచి ముగ్గురు, తెలంగాణ నుంచి ఇద్దరు ఉన్నారు.

కేటగిరీల వారీగా తెలుగు రాష్ట్రాల ర్యాంకులు..

- ఓబీసీ క్యాటగిరీలో జాతీయ స్థాయిలో హైదరాబాద్‌కు చెందిన మంగరి వరుణ్ 10వ స్థానంలో (జనరల్ 46) నిలిచారు.
- ఎస్సీ క్యాటగిరీలో తెలంగాణకు చెందిన రెడ్డిమల్ల శ్రీకాంత్ 3వ స్థానం (జనరల్ 147), ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కరుమంచి విక్రాంత్ 9వ స్థానం(జనరల్ 262)లో నిలిచారు.
- ఎస్టీ విభాగంలో తెలంగాణకు చెందిన పూజారి హాసిని 3వ స్థానం (జనరల్-377), బానోత్ ధీరజ్ కుమార్ 8వ స్థానం (జనరల్-1178), అజ్మీరా అశుతోష్ 32వ స్థానంలో (జనరల్ 5,422) నిలిచారు.

నీట్‌లో ఆరు ర్యాంకులు మనకు

- ఏపీ నుంచి 57,934 మంది హాజరు
- 36,776 మంది విద్యార్థుల అర్హత
- 19వ ర్యాంక్ సాధించిన డి.కార్తీక్‌రామ్ కిరీటి
- కె.మోహిత్‌శ్రీరామ్ 56.. డి.సూర్యచరణ్‌కు 59వ ర్యాంక్


అమరావతి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నీట్ యూజీలో ఏపీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. టాప్ వంద ర్యాంకుల్లో ఏపీకి చెందిన ఆరుగురు ర్యాంకులు సాధించారు. గత నెల 4వ తేదీన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ దేశ వ్యాప్తంగా ఒకేసారి నీట్ ప్రవేశ పరీక్షను నిర్వహించి, ఫలితాలను శనివారం ఒకేసారి విడుదల చేసింది. జాతీయ స్థాయిలో ఏపీకి చెందిన డి.కార్తీక్‌రామ్ కిరీటి 19వ ర్యాంక్ సాధించారు. కె.మోహిత్‌శ్రీరామ్ 56వ ర్యాంక్, డి.సూర్యచరణ్ 59వ ర్యాంక్, పి.అవినాశ్ 64వ ర్యాంక్, వైసమీర్‌కుమార్ 76వ ర్యాంక్, టి.శివమణిదీప్ 92వ ర్యాంక్ సాధించారు. రాష్ట్రం నుంచి ఈ ఏడాది 59,219 మంది నీట్ రాసేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోగా, 57,934 మంది ప్రవేశ పరీక్షకు హాజరయ్యారు. శనివారం విడుదలైన ఫలితాల్లో 36,776 మంది ర్యాంకులు సాధించారు. గత ఏడాది ఏపీ నుంచి 66,522 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా, 64,929 మంది హాజరయ్యారు. అందులో 43,788 మంది అర్హత సాధించారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది రిజిస్ట్రేషన్ తక్కువ మంది చేసుకున్నారు. అర్హత కూడా తక్కువ మంది సాధించారు. నీట్ ర్యాంకుల ఆధారంగానే జాతీయ స్థాయిలో ఎయిమ్స్, ఇతర మెడికల్ సంస్థలు, రాష్ట్రంలోని మెడికల్, డెంటల్ కాలేజీల్లో ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సుల్లో సీట్లు కేటాయిస్తారు.


ర్యాంకులు సాధించిన విద్యార్థులతో శ్రీగోసలైట్స్ మెడికల్ అకాడమి చైర్మన్ నరేంద్రబాబు

శ్రీగోసలైట్స్ విద్యార్థుల సత్తా

కానూరు(విజయవాడ), జూన్ 14(ఆంధ్రజ్యోతి): నీట్-2025 ఫలితాల్లో తమ విద్యార్థులు సత్తాచాటారని విజయవాడలోని శ్రీగోసలైట్స్ మెడికల్ అకాడమి చైర్మన్ నరేంద్రబాబు తెలిపారు. శనివారం కానూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 11 మంది విద్యార్థులు 720 మార్కులకు 600కుపైగా సాధించారని తెలిపారు. 550పైన మార్కులు సాధించిన విద్యార్థులు 69 మంది, 500పైన మార్కులు సాధించిన 379 మంది, 470పైన మార్కులు సాధించిన 814 మంది, 450పైన మార్కులు సాధించిన 1,086 మంది విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. సుమారు 1500 మందికిపైగా తమ విద్యార్థులు దేశవ్యాప్తంగా ఫ్రీ మెడికల్ సీట్లు సాధించే అవకాశం ఉందన్నారు. ఎస్.ప్రజ్ఞేశ్వరరావు ఆలిండియా క్యాటగిరీలో 144వ ర్యాంక్, జి.సతీష్ చంద్రరాయల్ 181, యువరాజ్ డీజేజీ 207, టి.హర్షిత్ ఆలిండియా క్యాటగిరిలో 876వ ర్యాంక్, ఎస్సీ క్యాటగిరిలో 22వ ర్యాంక్, ఎం.కార్తీక్(391 ర్యాంక్), జి. వైష్ణవి(532), టి. మేఘన(580), ఐ.హరిచందన(696), ఆర్‌ఎం.సాయివర్ధన్(942), సి.షణ్ముక్‌కుమార్ రెడ్డి(1170) ర్యాంక్‌లు సాధించారని చెప్పారు. ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఆయన అభినందించారు.

'తిరుమల'కు స్టేట్ ఫస్ట్ ర్యాంక్


స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన డి.కార్తీక్ రామ్ కిరీటిని అభినందిస్తున్న తిరుమల విద్యాసంస్థల చైర్మన్ తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): నీట్-2025 ఫలితాల్లో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని తిరుమల విద్యాసంస్థల తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ విద్యార్థులు ఆలిండియా స్థాయిలో అత్యుత్తమ ర్యాంక్‌లు సాధించారని ఆ సంస్థ చైర్మన్ నున్న తిరుమలరావు చెప్పారు. తిరుమల విద్యాసంస్థలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దర్బా కార్తీక్ రామ్ కిరీటి ఆలిండియా స్థాయిలో ఓపెన్ కేటగిరిలో 19వ ర్యాంక్, ఆంధ్రప్రదేశ్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించినట్టు తెలిపారు. అలాగే కె.ఈప్సిత్ కశ్యప్ 12వ ర్యాంక్, టి.సాహితి 32, కేవీవీ నాగసాయి పవన్ 154, ఎం.సూర్య సంతోష్ రెడ్డి 880, ఎల్.అభిషేక్ 888వ ర్యాంక్‌లు కైవసం చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ ఏడాది తమ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచారని, 310 మందికిపైగా ఎంబీబీఎస్ సీట్లు సాధిస్తారని వివరించారు. కాగా, ఢిల్లీ ఎయిమ్స్‌లో స్కల్ లేదా కార్డియోలజీ చేస్తానని. సూపర్ స్పెషాలిటీ వైద్యుడిగా సేవలందిస్తానని దర్బా కార్తీక్ రామ్ కిరీటి తెలిపారు. 8వ తరగతి నుంచి తిరుమలలోనే చదువుతున్నానని, చాలా హార్డ్‌వర్క్ చేశానని, ఉత్తమ బోధన వల్లే ఈ ర్యాంక్ సాధ్యమైందని చెప్పారు. తన తండ్రి అంజనా వైద్యాలయం డాక్టర్ డీఎస్ అరుణ్‌కుమార్, తల్లి శ్రీలత ప్రోత్సాహం మరువలేనిదన్నారు.

ఆదిత్య విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు

కాకినాడ రూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): నీట్ ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబరచి అఖిల భారతస్థాయిలో 109, 227, 890 ర్యాంకులు కైవసం చేసుకున్నారని కాకినాడ జిల్లాలోని ఆదిత్య విద్యాసంస్థల కార్యదర్శి ఎన్.కృష్ణదీపక్‌రెడ్డి తెలిపారు. వీరంరెడ్డి సాయిభవ్యహర్షిణి 227వ ర్యాంకు, దగ్గుమటి నవన్ కార్తికేయ 109వ ర్యాంకు, డి.శ్రీనివాస రిషిత్ 890వ ర్యాంకు సాధించారని వివరించారు. 12 మంది విద్యార్థులు 720 మార్కులకుగాను 550 మార్కులకుపైగా సాధించినట్టు తెలిపారు. ఉత్తమర్యాంకులు సాధించిన విద్యార్థులను, వారికి శిక్షణనిచ్చిన అధ్యాపకులను ఈసందర్భంగా సంస్థ చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి కృష్ణదీపక్‌రెడ్డి తదితరులు అభినందించారు.


నీట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులతో నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు పి.సింధూర నారాయణ, పి. శరణి నారాయణ

నారాయణ విజయ పరంపర


హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నీట్-2025 ఆలిండియా క్యాటగిరీలలో నారాయణ విద్యార్థులు విజయం సాధించారని ఆ సంస్థ డైరెక్టర్లు పి.సింధూర నారాయణ, పి. శరణి నారాయణ పేర్కొన్నారు. ఆలిండియా ఓపెన్ క్యాటగిరిలో మృణాల్ కిషోర్ ఝా 4వ ర్యాంకు, కేశవ్ మిట్టల్ 7వ ర్యాంకు , సౌమ్యశర్మ 14వ ర్యాంక్, కె.జీవన్ సాయికుమార్ 18వ ర్యాంకు, రూపయన్ పాల్ 20వ ర్యాంకు సాధించినట్లు వారు తెలిపారు. వీటితో పాటు 100 లోపు 22 ర్యాంకులు, 1000 లోపు 85 ర్యాంకులు నారాయణ విద్యార్థులు కైవసం చేసుకున్నారని వెల్లడించారు. ఆలిండియా అన్ని క్యాటగిరీల్లో 10 లోపు 8 ర్యాంకులు, 100 లోపు 65 ర్యాంకులు, 1000 లోపు 216 ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా సింధూర నారాయణ మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లో ఓపెన్ క్యాటగిరిలో మొదటి ర్యాంకు సాధించటం తెలుగు వారికి గర్వకారణమన్నారు. ఇంతటి విజయం సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పునీత్ కొత్తప అభినందనలు తెలిపారు.

శ్రీచైతన్య అగ్రస్థానం


ర్యాంకులు సాధించిన విద్యార్థులతో చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్లు సుష్మ, సీమ

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నీట్-2025 ఫలితాల్లో ఆలిండియా ఫస్ట్ ర్యాంకుతో పాటు టాప్ ర్యాంకులు సాధించడంలో శ్రీచైతన్య విద్యాసంస్థలు అగ్రస్థానంలో నిలిచాయని ఆ విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ తెలిపారు. శనివారం ఆమె డైరెక్టర్ సీమతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆలిండియా మొదటి ర్యాంక్ కవిష్ సాధించగా.. దివ్య (5వ ర్యాంకు), మహ్మద్ సమీర్ (6వ, ఓబీసీ), ధీరజ్‌కుమార్ (8వ, ఎస్టీ), ఎం.వరుణ్ (10వ, ఓబీసీ) ర్యాంకులు సాధించింది శ్రీచైతన్య క్లాస్ రూమ్ ప్రోగ్రామ్ విద్యార్థులేనని ఆమె పేర్కొన్నారు. నాణ్యమైన శిక్షణ అందించడం వల్లనే మంచి ఫలితాలు సాధించినట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఓపెన్ క్యాటగిరిలో 100లోపు అత్యధిక ర్యాంకులు సాధించింది కూడా తమ విద్యాసంస్థలకు చెందినవారేనని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులను ఆమె అభినందించారు. జేఈఈ ఫలితాల్లో సాధించిన విజయాలు నీట్‌లోనూ పునరావృతం అయ్యాయని ఆమె పేర్కొన్నారు.

భాష్యం మెడెక్స్ విజయ భేరి


విద్యార్థులను అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ

గుంటూరు విద్య, జూన్ 14(ఆంధ్రజ్యోతి): నీట్ ఫలితాల్లో భాష్యం మెడెక్స్ విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించారని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. గుంటూరులో శనివారం ఆయన విద్యార్థులను అభినందించారు. తమ విద్యార్థులు కె.విక్రాంత్ ఆలిండియా 9వ ర్యాంకు, ఎన్.మనస్విని 49వ ర్యాంకు, ఆర్.తరుణ్ కుమార్ నాయక్ 51, షేక్ వసీమా 80, సోలే ప్రేమ్ జడ్సన్ ప్రసన్న 108, పి.సంజన 182వ ర్యాంకులతో సత్తాచాటారని తెలిపారు. ఒక్క బ్రాంచి నుంచే 145 మంది విద్యార్థులు ఫ్రీ మెడికల్ సీట్లు సాధించనున్నట్టు చెప్పారు. విద్యార్థులను ఆయనతోపాటు వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ అభినందించారు.

ఇరాన్‌లో భారీ విధ్వంసం

(మొదటి పేజీ తరువాయి)

ఎగిసిపడుతున్నాయని ఇరాన్ అధికారిక వార్తాసంస్థ తస్నీమ్ న్యూస్ పేర్కొంది. ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీ ఇంటికి సమీపంలోనూ క్షిపణులు పడ్డాయని వెల్లడించింది. ఐక్య రాజ్య సమితి(ఐరాస) అణు విభాగం చీఫ్ రాఫెల్ గ్రోసీ కూడా ఓ ప్రకటన ద్వారా ఇరాన్‌లోని నటాంజ్(షాహిద్ అహ్మదీ రోషన్) అణు కేంద్రం ధ్వంసమైనట్లు నిర్ధారించారు. ఇరాన్ మొత్తం తమ టార్గెట్‌లో ఉందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటించగా.. ఇప్పటి వరకు జరిగిన దాడుల్లో 9 మంది కీలక సైంటిస్టులు, 16 మంది మిలటరీ జనరళ్లను హతమార్చినట్లు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) వెల్లడించింది. వీరిలో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ ముఖ్య సలహాదారు షంఖానీ, చీఫ్ ఆఫ్ స్టాఫ్ ఆఫ్ ఇరానియన్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మహమ్మద్ బఘేరీ, ఎమర్జెన్సీ రెస్పాన్స్ చీఫ్ గులామ్ అలీ రషీద్, ఇంటెలిజెన్స్ చీఫ్ గులామ్-అల్-మర్బాబ్, ఇస్లామిక్ రివొల్యూషనరీ గార్డ్ కార్ప్స్(ఐఆర్‌జీసీ) కమాండర్ హుస్సేన్ సలామీ, ఐఆర్‌జీసీ ఎయిర్ కమాండర్ ఆమిర్ అలీ హాజీజాదే, డ్రోన్ల విభాగం కమాండర్ తాహెర్‌పుర్, ఎయిర్ డిఫెన్స్ కమాండర్ దావూద్ షిహ్యాన్, క్షిపణి విభాగం కమాండర్ మహమ్మద్ బఘేరీ ఉన్నారు. దీంతో ఇరాన్ త్రివిధ దళాలు పెద్దదిక్కులను కోల్పోయినట్లయింది. ఆర్మీ కమాండర్ ఆమిర్ మౌసావీ, ఐఆర్‌జీసీ గ్రౌండ్ ఫోర్సెస్ కమాండర్ మహమ్మద్ పాక్‌పోర్, ఖుద్స్ ఫోర్స్ కమాండర్ ఇస్మాయిల్ ఖ్వానీ, ఐఆర్‌జీసీ నేవీ కమాండర్ అలీరెజా తంగ్సిరి మాత్రమే ఇరాన్ సెక్యూరిటీ చైన్‌లో సజీవ కమాండర్లుగా ఉన్నట్లు తెలిపింది. శనివారం సాయంత్రం నెతన్యాహు మాట్లాడుతూ.. మరో 90 నిమిషాల్లో ఇరాన్‌కు పెద్ద దెబ్బ తగులుతుందని ప్రకటించారు. ఆయన ప్రకటన వెలువడిన 90వ నిమిషం నుంచి ఇజ్రాయెల్ వైమానిక దళం క్షిపణులతో ఇరాన్‌పై విరుచుకుపడడం గమనార్హం..! 150 టార్గెట్లను ఛేదించామని పేర్కొంటూ.. అందుకు సంబంధించిన ఫుటేజీని ఐడీఎఫ్ తన అధికారిక టెలిగ్రామ్ చానల్‌లో విడుదల చేసింది. శుక్ర, శనివారాల్లో జరిపిన దాడుల్లో చనిపోయిన ఇరాన్ శాస్త్రవేత్తల వివరాలను ప్రకటించింది. ఆ జాబితాలో న్యూక్లియర్ ఇంజనీరింగ్ నిపుణులు ఫ్రెదోన్ అబ్బాసీ, అహ్మద్ రజా దరియానీ, ఫిజిక్స్ నిపుణులు మహమ్మద్ మెహ్దీ తెహ్రాన్చీ, ఆమిర్ హసన్ ఫఖీ, అబ్దుల్లామిద్ మినుష్హర్, మన్సూర్ అస్గరీ, మెకానిక్స్ నిపుణుడు అలీ బౌఖాయ్ ఖత్రిమీ, కెమికల్ ఇంజనీరింగ్ నిపుణుడు అక్బర్ మతాలిజాదా, మెటీరియల్స్ ఇంజనీరింగ్ నిపుణుడు సయీద్ బార్జీ ఉన్నట్లు తెలిపింది. ఇరాన్ మీడియా కూడా ఇజ్రాయెల్ దాడుల్లో 78 మంది మరణించారని, 320 మంది గాయపడ్డారని పేర్కొంది.

ప్రముఖుల పలాయనం?

ఇజ్రాయెల్ ముప్పేట దాడులతో ఇరాన్‌లోని ప్రముఖులు రష్యాకు పారిపోతున్నట్లు ఫ్లైట్ ట్రాకింగ్ డేటా స్పష్టం చేస్తోంది. సుప్రీం లీడర్ ఖమేనీ ఇంటి సమీపంలోనూ క్షిపణి దాడులు జరగడం.. ఆయన ముఖ్య సలహాదారు సహా, ఆర్మీ అధికారులు చనిపోవడంతో వారు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్తున్నట్లు తెలుస్తోంది.



రిషోన్‌యెజిలోన్‌లో శిథిలాల నుంచి వెలికితీసిన పసిపాపను ఆసుపత్రికి తరలిస్తున్న మహిళా అధికారి



టెల్ అవీవ్‌లో ఇరాన్ దాడి

ప్రైవేట్ జెట్లు పెద్ద సంఖ్యలో రష్యాకు చేరుకుంటున్నట్లు ఇజ్రాయెల్ వార్తాసంస్థ 'వైనెట్' ఓ కథనాన్ని ప్రచురించింది. ఇందులో ఓ విమానం ట్రాకింగ్ మధ్యలో కనుమరుగైందని, అందులో ఖమేనీలాంటి ప్రముఖ వ్యక్తి ఉండి ఉంటాడని పేర్కొంది. రష్యా-ఇరాన్ ద్వంద్వ పౌరసత్వం ఉన్న ప్రముఖులు కూడా ప్రైవేట్ జెట్లలో దేశాన్ని వీడుతున్నట్లు స్పష్టం చేసింది. మరోవైపు, ఇజ్రాయెల్ దాడుల పట్ల ఇరాన్‌లోనే పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. "ప్రతీ 47 ఏళ్లకు ఇరాన్‌కు స్వాతంత్ర్యం వస్తుందనుకుంటా. ఇప్పుడు కూడా సుప్రీంలీడర్ పాలన నుంచి విముక్తి దొరుకుతుందని భావిస్తున్నా" అంటూ ఓ యువతి పేర్కొంది.

ఎస్‌సీవో ప్రకటనకు భారత్ దూరం

ఇరాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడులను షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీవో) తీవ్రంగా ఖండించింది. అయితే.. ఎస్‌సీవో ప్రకటనకు భారత్ దూరంగా ఉన్నట్లు విదేశీ వ్యవహారాల శాఖ(ఎంఈఏ) స్పష్టం చేసింది. ఈ అంశంపై ఎస్‌ఈఏ ఏర్పాటు చేసిన సమావేశంలోనూ భారత్ పాల్గొనలేదని వివరించింది. చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని తాము ఇరు దేశాలను కోరుతున్నట్లు తెలిపింది. కాగా.. పాలస్తీనాలో నివసించే భారతీయులు అప్రమత్తంగా ఉండాలని ఆ దేశంలోని భారత రాయబార కార్యాలయం హెచ్చరించింది. వీలైనంత వరకు ఇళ్లలోనే ఉండాలని, బయట తిరగొద్దని సూచించింది.

ఇక అమెరికాతో చర్చలు అర్థరహితం: ఇరాన్

ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో అమెరికాతో అణుచర్చలు జరపడం అర్థరహితమని ఇరాన్ విదేశాంగ శాఖ అధికారి అబ్బాస్ అరగ్చి అంతర్జాతీయ మీడియాతో వ్యాఖ్యానించారు. అమెరికా-ఇరాన్ మధ్య ఆదివారం ఒమన్‌లో అణు చర్చలు జరగాల్సి ఉన్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఇదే విషయాన్ని ఆయన ఐరోపా సమాఖ్య రాయబారి ఖాజా కల్లాస్‌కు తెలిపానని వెల్లడించారు. ఇజ్రాయెల్‌కు అమెరికా ప్రత్యక్ష మద్దతు ఉన్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

నెతన్యాహు కుమారుడి పెళ్లి వాయిదా

ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కుమారుడు అవ్నర్ నెతన్యాహు వివాహం వాయిదా పడింది. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు నెతన్యాహు కుటుంబం ప్రకటించింది. అవ్నర్ పెళ్లి సోమవారం అమిత్ యార్డెనీతో జరగాల్సి ఉంది. వాయిదా పడ్డ పెళ్లి తేదీని త్వరలో ప్రకటిస్తారని సమాచారం.

ఇజ్రాయెల్‌లో ముగ్గురి మృతి

శుక్రవారం రాత్రి ఇరాన్ జరిపిన బాలిస్టిక్ క్షిపణి దాడుల్లో టెల్‌అవీవ్ శివార్లలోని రామత్‌గన్‌లో కోహెన్ ఏంజెల్(87), రిషోన్‌యెజిలోన్‌లో ఇజ్రాయెల్ అలోనీ(67), ఎట్టీ అనే మహిళలు చనిపోయారని, ఏడుగురు సైనికులు సహా.. 80 మందికి గాయాలైనట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. క్షతగాత్రుల్లో 34 మంది పారామెడికల్ బృందాలకు చెందిన వారని తెలిపింది. టెల్‌అవీవ్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయం బెన్ గురియన్ వద్ద పేలుడు సంభవించినట్లు ఇరాన్ వార్తాసంస్థలు చెబుతుండగా.. యుద్ధం ప్రారంభానికి ముందు నుంచి ముందుజాగ్రత్త చర్యగా విమానాల రాకపోకలను నిషేధించామని ఐడీఎఫ్ పేర్కొంది. ఇరాన్ దాడుల్లో రామత్‌గన్, రిషోన్‌యెజిలోన్ నగరాల్లో నివాస గృహాలు, వాహనాలు భారీగా ధ్వంసమయ్యాయి. అయితే.. పౌరులను ముందుగానే బంకర్లకు తరలించడం వల్ల ప్రాణనష్టం తప్పిందని ఐడీఎఫ్ చెబుతోంది.



ఖమేనీ ముఖ్య సలహాదారు షంఖానీ



ఇరాన్ దాడులతో ఇజ్రాయెల్‌లో విధ్వంసం

లోకం తీరు



ఏకకాలంలో మూడు యుద్ధాలు!

ఇరాన్‌తోపాటు.. గాజా, లెబనాన్‌పై ఏకకాలంలో మూడు యుద్ధాలు చేస్తున్నట్లు ఐడీఎఫ్ వివరించింది. గాజాలో జరిపిన తాజా దాడుల్లో 16 మంది చనిపోయారని పేర్కొంది. ఇక ఇరాన్ ప్రతీకార దాడులకు దిగబోదని తాము భావిస్తున్నట్లు రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కెట్జ్, ఐడీఎఫ్ బ్రిగేడియర్ జనరల్ ఎఫీ డ్ఫెరిన్ వ్యాఖ్యానించారు. ఇప్పటి వరకు ఇరాన్‌లోని 150 లక్ష్యాలపై దాడులు చేశామని చెప్పారు. తమ వైమానిక దళాల వ్యూహాలను ఇరాన్ తట్టుకోలేదని స్పష్టం చేశారు. ప్రధాని నెతన్యాహు కూడా అణు కేంద్రాలపై దాడులు కేవలం ఆరంభం మాత్రమేనని, మున్ముందు ఇంకా భారీగా దాడులు ఉంటాయని వ్యాఖ్యానించారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు జరపనున్న విషయం తమకు ముందుగానే తెలుసునని ట్రంప్ పేర్కొన్నారు.

వెయ్యి క్షిపణులతో ప్రణాళిక

ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీ ఇజ్రాయెల్‌పై దాడికి వెయ్యి బాలిస్టిక్ క్షిపణులను సిద్ధం చేయాలని జాతీయ భద్రత మండలి(ఎన్‌ఎస్‌సీ) సమావేశంలో ఆదేశించారంటూ 'న్యూయార్క్ టైమ్స్' ఓ సంచలన కథనాన్ని ప్రచురించింది. అయితే.. ముందుగానే ఉప్పందుకున్న ఇజ్రాయెల్.. శుక్రవారం ఉదయం నుంచే టెహ్రాన్‌కు చెందిన క్షిపణి కేంద్రాలపై విరుచుకుపడింది. దీంతో.. ప్రతీకార దాడుల్లో ఇరాన్ 200 వరకు క్షిపణులను మాత్రమే వాడగలిగిందని ఆ కథనం వెల్లడించింది. కాగా.. ఇరాన్ వద్ద 2 వేల బాలిస్టిక్ క్షిపణులున్నట్లు ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ సీనియర్ అధికారిని ఉటంకిస్తూ ఫాక్స్‌న్యూస్ ఓ కథనాన్ని ప్రసారం చేసింది. వచ్చే రెండేళ్లలో ఇరాన్ తన బాలిస్టిక్ క్షిపణుల సామర్థ్యాన్ని 8 వేలకు పెంచేదిశలో అడుగులు వేస్తున్న సమయంలో.. ఇజ్రాయెల్ దాడులు జరిపినట్లు ఆ కథనం వివరిస్తోంది. ఇరాన్‌పై దాడులకు బాలిస్టిక్ క్షిపణుల పెంపు ప్రయత్నమే కారణమని ఆ అధికారి వివరించినట్లు వెల్లడించింది. కాగా.. శనివారం పశ్చిమ ఇరాన్‌లోని క్షిపణి నిల్వల స్థావరాలపై దాడులు జరిపినట్లు ఐడీఎఫ్ వివరించింది.

'కుశ'తో ఇక కాస్కో!

» స్వదేశీ గగనతల రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్న డీఆర్డీవో

న్యూఢిల్లీ, జూన్ 14: ఇటీవల పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల సమయంలో మన గగనతల రక్షణ వ్యవస్థ అద్భుతంగా పనిచేసింది. శత్రు దేశం ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులను ఆకాశంలోనే విజయవంతంగా కూల్చివేసింది. ఈ క్రమంలో దేశ గగనతల రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా డీఆర్‌డీవో దేశీయంగా 'ప్రాజెక్టు కుశ'లో భాగంగా మూడు రకాలను అభివృద్ధి చేస్తోంది. వాటిని దశలవారీగా 2030 నాటికి సాయుధ దళాల్లో ప్రవేశపెట్టే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. గగనతలంలో బహుళ అంచెల రక్షణను ఏర్పాటు చేసేలా ఈ కుశ వ్యవస్థను రూపొందించారు. విమానాలు, క్షిపణుల నుంచి వచ్చే ముప్పును అడ్డుకోవడానికి 'కుశ ఎం1'లో స్వల్ప శ్రేణి క్షిపణి వ్యవస్థలను అమర్చనున్నారు. మధ్యస్థ శ్రేణి కంటే ఎక్కువ సామర్థ్యంతో కూడిన ఉపరితలం నుంచి వాయు క్షిపణులతో 'కుశ ఎం2', అదేవిధంగా 400 కిలోమీటర్ల కంటే ఎక్కువ పరిధిలోని లక్ష్యాలను, ముప్పును ఛేదించేలా 'కుశ ఎం3'ను రూపొందించనున్నట్లు డీఆర్‌డీవో వర్గాలు తెలిపాయి. దేశీయంగా అభివృద్ధి చేస్తున్న ఈ విస్తృత శ్రేణి వాయు రక్షణ వ్యవస్థ 'కుశ'ను రష్యాకు చెందిన ఎస్-500కు పోటీగా చూస్తున్నారు.

19న శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర: ఇస్రో

న్యూఢిల్లీ, జూన్ 14: పలు కారణాలతో వాయిదా పడుతూ వస్తోన్న యాక్సియం-4 మిషన్‌ను ఈ నెల 19వ తేదీన ప్రయోగించనున్నట్లు ఇస్రో శనివారం వెల్లడించింది. ఈ వాణిజ్య మిషన్ ద్వారా భారత వ్యోమగామి శుభాంశు శుక్లాతో పాటు మరో ముగ్గురు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్లనున్నారు. యాక్సియం రోదసీ యాత్రను నాసాకు చెందిన ఫ్లోరిడాలోని కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి ఈనెల 11న ప్రయోగించాల్సి ఉంది. అయితే స్పేస్ ఎక్స్ ఫాల్కన్-9 రాకెట్‌లో ఇంధనం లీకేజీ కారణంగా వాయిదా పడింది. ఇస్రో, యాక్సియం స్పేస్, స్పేస్ ఎక్స్ సమన్వయంతో ఈ ద్రవ ఆక్సిజన్ లీకేజీ సమస్యను పరిష్కరించారు.

సిందూర్‌కు వ్యతిరేకంగా వాట్సాప్ గ్రూప్

» ఎన్‌ఐఏ అదుపులో 30 మంది

చెన్నై, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్‌ను వ్యతిరేకిస్తూ వాట్సాప్ గ్రూప్ ద్వారా దుష్ప్రచారం చేసిన 30 మందిని ఎన్‌ఐఏ అధికారులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. పాకిస్థాన్‌కు మద్దతు ప్రచారం సాగిస్తూ, ఆపరేషన్ సింధూర్ దాడులను తీవ్రంగా ఖండిస్తూ వేల సంఖ్యలో ఇతర గ్రూపులకు సందేశాలు పంపినట్టు ఎన్‌ఐఏ దర్యాప్తులో వెల్లడైంది. దీంతో రెండువారాలుగా ఎన్‌ఐఏ అధికారులు చెన్నై అంతటా నిఘా వేసి వాట్సాప్ గ్రూపు ద్వారా ఎవరెవరికి సందేశాలు వెళ్లాయన్నదానిపై ఆరా తీశారు. వాటి ఆధారంగా 30 మందిని అదుపులోకి తీసుకున్నారు.



దుబాయ్ మరీనా ప్రాంతంలోని 67 అంతస్తుల భవనంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. భవనమంతా దట్టంగా పొగ అలుముకుంది. అగ్నిమాపక సిబ్బంది 6 గంటల పాటు తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. భవనంలోని 764 అపార్ట్‌మెంట్ల నుంచి సుమారు 4 వేల మందిని అధికారులు వేగంగా ఖాళీ చేయించడంతో ప్రాణాపాయం తప్పింది.

మహాత్మా గాంధీ మునిమనుమరాలికి జైలు

» రూ. 3.2 కోట్ల మోసం...

ఏడేళ్లు శిక్ష ఖరారు చేసిన డర్బన్ కోర్టు



డర్బన్(సౌత్ ఆఫ్రికా), జూన్ 14: మహాత్మా గాంధీ మునిమనుమరాలు ఆశిష్ లత రామ్‌గోబిన్(56)కు ఏడు సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. ప్రముఖ హక్కుల కార్యకర్త ఇలా గాంధీ, దివంగత మెవా రామ్‌గోబిన్‌ల కుమార్తె లత.. వ్యాపారవేత్త ఎస్ఆర్ మహరాజ్‌ను 3.22 కోట్లకు మోసం చేశారు. నేరం రుజువుకావడంతో దక్షిణ ఆఫ్రికాలోని డర్బన్ కోర్టు శిక్ష ఖరారు చేస్తూ, అప్పీలు చేసుకునే అవకాశాన్నీ నిరాకరించింది. తనకు తాను అహింసావాదిగా, హక్కుల కార్యకర్తగా చెప్పుకునే లత రామ్‌గోబిన్‌ను, వ్యాపారవేత్త ఎస్ఆర్ మహరాజ్ 2015లో కలిశారు. ఆయన వస్త్ర, పాదరక్షల వ్యాపారి. ఇతర వ్యాపారవేత్తలకు అవసరమైన నిధులు సమకూరుస్తూ లాభంలో వాటా తీసుకుంటారు. 'దక్షిణాఫ్రికాలోని ఓ ప్రముఖ ఆసుపత్రి గ్రూప్‌నకు అవసరమైన 'లైనిన్' ఇండియా నుంచి దిగుమతి చేసుకున్నా. కస్టమ్స్, దిగుమతి సుంకం చెల్లించాలి. ప్రస్తుతం నా దగ్గర అంత పెట్టుబడి లేదు. మీరు సమకూరిస్తే లాభంలో వాటా ఇస్తాను' అంటూ లత.. మహరాజ్‌తో నమ్మబలికారు. మహరాజ్ పెట్టుబడి సమకూర్చారు. కొద్ది కాలానికే ఆమె మోసం చేసిందని తెలుసుకున్న ఆయన పోలీస్ కేసు పెట్టారు. అసలు ఆమె భారతదేశం నుంచి ఎలాంటి వస్తువులను దిగుమతి చేసుకోలేదని నిర్ధారణ అయింది.

దివ్యాంగుల కోసం 'ప్రత్యేకం'

రవాణా వ్యవస్థలో విస్తృత మార్పులు.. బస్సులు, మెట్రోల్లో వీల్‌చైర్‌కు స్థలం

» రైళ్లు, విమానాల్లోనూ సదుపాయాలు

» ప్రతిపాదనలతో ముసాయిదా సిద్ధం

న్యూఢిల్లీ, జూన్ 14: రవాణా వ్యవస్థలో దివ్యాంగులకు మరిన్ని సదుపాయాలు కల్పించడానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. దీనికి సంబంధించి ముసాయిదా మార్గదర్శకాలు రూపొందించారు. 'ట్రాన్స్‌పోర్టు యాక్సెసిబిలిటీ ఫ్రేమ్‌వర్క్' పేరుతో స్ట్రాటజిక్ యాక్సెసిబిలిటీ సెల్-రైట్స్ ఆఫ్ రైడర్స్ (ఎస్ఏసీ-ఆర్ఆర్) తయారు చేసిన ఆ ముసాయిదాపై అభిప్రాయాలను సామాజిక న్యాయం, సాధికారత శాఖ పరిధిలోని దివ్యాంగుల సాధికారత విభాగం (డీఈపీడబ్ల్యూడీ) సేకరిస్తోంది. వాటాదారులు, సాధారణ ప్రజల నుంచి సలహాలు, సూచనలు ఆహ్వానించింది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత తుది మార్గదర్శకాలు విడుదల కానున్నాయి. ఇక ముసాయిదాలో టికెట్ బుకింగ్ నుంచి బోర్డింగ్ వరకు దివ్యాంగుల కోసం బస్సులు, రైళ్లు తదితర రవాణా వ్యవస్థలో విస్తృత మార్పులు చేయాలని సూచించారు. బస్సులు, మెట్రో రైళ్లలో వీల్ చైర్ కోసం కచ్చితంగా స్థలం కేటాయించాలని, స్టేషన్లలో మెట్లులేని టాయిలెట్లు ఏర్పాటు చేయాలని, అలాగే ర్యాంపులు నిర్మించాలని, విమాన, రైలు, రోడ్డు ట్రాన్స్‌పోర్టు వ్యవస్థలో శిక్షణ పొందిన సిబ్బందిని నియమించాలని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు.



ఆ ముసాయిదాలో ఏమున్నాయి..

- చాలా అంశాలు మార్చకూడనివిగా పేర్కొన్నారు. అంటే ఒక్కసారి మార్గదర్శకాలు అమల్లోకి వచ్చిన తర్వాత వాటిలో మార్పులు చేర్పులు చేయడానికి అవకాశం ఉండదు.
- దివ్యాంగుల హక్కుల చట్టం-2016ను అనుసరించి పలు మార్పులు సూచించారు.
- సెంట్రల్ స్కీం కింద తీసుకునే కొత్త బస్సుల్లో కచ్చితంగా లోఫ్లోర్ ప్రవేశద్వారం ఉండాలి. అలాగే ర్యాంపులు, సేఫ్టీ బెల్టులు, వీల్ చైర్ స్థానం తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి.
- ఇప్పటికే ఉన్న పీఎం ఈబస్ సేవ, టైప్ 3 ఇంటర్‌సిటీ వంటి బస్సుల్లో చిన్న లిఫ్టులు లేదా బ్రిడ్జి ర్యాంపులు ఏర్పాటు చేయాలి. ప్రతి బస్సులో దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా నాలుగు సీట్లు కేటాయించాలి. వాటికి సీటు బెల్టులు ఉండాలి.
- మెట్రో, సాధారణ రైళ్ల ప్లాట్‌ఫారాల్లో రబ్బర్ గ్యాప్ ఫిల్లర్స్ ఏర్పాటు చేయాలి. అలాగే వీల్ చైర్లు పట్టేలా డోర్లు వెడల్పు చేయాలి.
- దూరప్రయాణ రైళ్లలో కనీసం ఒక కోచ్‌లో దివ్యాంగులు వీల్‌చైర్ ఉంచేందుకు ఏర్పాట్లు చేయాలి. అలాగే టైప్-ఏ టాయిలెట్ కూడా అందుబాటులో ఉండాలి.
- ఎయిర్‌పోర్టుల్లో కూడా పార్కింగ్ నుంచి చెకిన్ వరకు స్టెప్-ఫ్రీ యాక్సెసిబిలిటీ ఉండాలి. దివ్యాంగులు కూర్చునేందుకు వీలుగా ప్రత్యేక సీట్లను ఏర్పాటు చేయాలి. అలాగే దివ్యాంగుల పరికరాలు పెట్టుకునేందుకు తగిన స్థలం కేటాయించాలి.
- ట్యాక్సీలు, ఈ రిక్షాలు నడిపే సంస్థలు కూడా కొన్నింటిని దివ్యాంగులకు అనుకూలంగా మార్చాలి. రోప్ వేలను, ఫెర్రీలను కూడా ఈ పరిధిలోకి తీసుకొచ్చారు.
- ఫిర్యాదుల కోసం యాప్స్, ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలను అందుబాటులో ఉండేలా తీర్చిదిద్దాలి. మార్పులు చేర్పులకు అనుగుణంగా వాహన చట్టం, అర్బన్ బస్ నిర్మాణం తదితర నిబంధనలు వెంటనే మార్చాలి.

భారతీయులకు ఇజ్రాయెల్ క్షమాపణలు

» కశ్మీర్‌ను పాక్‌లో అంతర్భాగంగా చూపుతూ 'ఎక్స్'లో చేసిన పోస్టు

న్యూఢిల్లీ, జూన్ 14: ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతల వేళ.. ఇజ్రాయెల్ రక్షణ దళాలు సోషల్ మీడియాలో పంచుకున్న ఓ పోస్టు భారతీయులకు ఆగ్రహం తెప్పించింది. కశ్మీర్‌ను పాకిస్థాన్‌లో అంతర్భాగంగా చూపుతూ పెట్టిన ఫొటోనే ఇందుకు కారణం.. ఈ నేపథ్యంలోనే భారత పౌరులకు ఐడీఎఫ్ క్షమాపణలు చెప్పింది. టెహ్రాన్‌పై వైమానిక దాడులకు దిగిన ఐడీఎఫ్.. 'ఇరాన్ ప్రపంచానికే ముప్పు. ఇజ్రాయెల్ మాత్రమే దాని అంతిమ లక్ష్యం కాదు. ఇది ప్రారంభం మాత్రమే. ఇప్పుడు మాకు మరో మార్గం లేదు' అంటూ 'ఎక్స్'లో పేర్కొంది. ప్రపంచ పటానికి సంబంధించిన ఓ ఫొటోను దానికి జత చేసింది. అయితే అందులో కశ్మీర్‌ను పాక్‌లో అంతర్భాగంగా చూపడం వివాదాస్పదమైంది. దీనిపై ఐడీఎఫ్ స్పందిస్తూ.. 'ఇరాన్ ముప్పు పొంచి ఉన్న ప్రాంతాలను ఉదహరించే ఉద్దేశంతోనే ఆ మ్యాప్ పోస్టు చేశాం. అయితే ఆ మ్యాప్ దేశాల సరిహద్దులను కచ్చితంగా చూపలేకపోయింది. తప్పిదానికి మేం క్షమాపణలు కోరుతున్నాం' అంటూ పేర్కొంది.

ప్రజా ప్రతిఘటన జోరు..

అమెరికాలో నిరసనల జోరు

» ట్రంప్ పుట్టిన రోజున


నో కింగ్స్ డే పేరిట ప్రదర్శనలు



వాషింగ్టన్ డీసీ, జూన్ 14: అమెరికా లాస్ ఏంజెల్స్‌లో అక్రమ వలసదారులపై ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ అధికారుల దాడులు, అరెస్టులకు నిరసనగా చేపట్టిన ఆందోళనలు అగ్రరాజ్యాన్ని కుదిపేస్తున్నాయి. లాస్ ఏంజెల్స్‌తో మొదలైన నిరసనలు అమెరికా అంతటా విస్తరించాయి. అధ్యక్షుడు ట్రంప్ విధానాలను వ్యతిరేకిస్తూ ఆందోళనకారులు శనివారం నో కింగ్స్ (రాజులు లేరు) డే పేరిట దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. ఫిలడెల్ఫియా, చికాగో, న్యూయార్క్, అట్లాంటా, అలాస్కా, ఫ్లోరిడా, టెక్సాస్‌తో పాటు రెండు వేల నగరాలు, పట్టణాల్లో శాంతియుతంగా నిరసనలు చేపట్టారు. కాలిఫోర్నియా లాస్ ఏంజెల్స్‌లో ఆందోళనకారులు పెద్ద ఎత్తున వీధుల్లోకి వచ్చారు. ట్రంప్‌నకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాజులు లేరు, సింహాసనాలు లేవు, కిరీటాల్లేవని రాసి ఉన్న ఫ్లెక్సీలు ప్రదర్శించారు. శనివారం ట్రంప్ 79వ పుట్టిన రోజుతో పాటు అమెరికా మిలిటరీ 250వ వార్షికోత్సవం సందర్భంగా పరేడ్ కూడా నిర్వహిస్తుండటంతో ఆందోళనకారులు వాషింగ్టన్ డీసీ మినహా అన్ని చోట్లా నిరసనలు చేపట్టారు. అక్రమ వలసదారుల నిరసనలు పతాక స్థాయికి చేరుకోవడంతో అధ్యక్షుడు ట్రంప్ కాస్త వెనక్కి తగ్గినట్లు సమాచారం. లాస్ ఏంజెల్స్‌లో 4 వేల మంది నేషనల్ గార్డులను, 700 మంది మెరైన్‌లను మోహరించడం చెల్లదని, అధ్యక్షుడికి ఆ అధికారం లేదని ఫెడరల్ కోర్టు జడ్జి ఆదేశించడంతో ట్రంప్ దూకుడు తగ్గించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అక్రమ వలసదారులు పెద్ద సంఖ్యలో పనిచేసే పరిశ్రమలు, హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు, సోదాలు నిలిపివేయాలని ట్రంప్ ఆదేశించినట్లుగా అమెరికా మీడియా కథనాలు ప్రసారం చేస్తున్నాయి.

మిలిటరీ పరేడ్‌కు మునీర్‌ను పిలవలేదు

» అమెరికా స్పష్టీకరణ



వాషింగ్టన్, జూన్ 14 : అమెరికా మిలిటరీ పరేడ్‌కు పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌ను ఆహ్వానించినట్టు వచ్చిన వార్తలను వైట్‌హౌస్ అధికార వర్గాలు ఖండించాయి. మునీర్ సహా ఏ విదేశీ నేతనూ పరేడ్ కోసం ఆహ్వానించలేదని వివరణ ఇచ్చాయి. అమెరికా మిలిటరీ పరేడ్ 250వ వార్షిక వేడుకను వాషింగ్టన్‌లో జూన్ 14న (అమెరికా కాలమానం ప్రకారం) నిర్వహించనున్నారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 79వ జన్మదిన సందర్భం కూడా దీనికి కలిసివచ్చింది. దీంతో ఈసారి పరేడ్‌ను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు అమెరికా ప్రభుత్వం సిద్ధమైంది. ఈ పరేడ్‌కు ముఖ్య అతిథిగా పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌ను ఆహ్వానించినట్టు దక్షిణాసియాకు చెందిన మీడియాలో ప్రచారం జరిగింది. దీనిపై భారత్ తీవ్రంగా స్పందించింది. ఈ నేపథ్యంలో వైట్‌హౌస్ స్పందించింది. మునీర్‌కు ఆహ్వానంపై వచ్చిన వార్తలన్నీ ఊహాగానాలేనని తేల్చేసింది. భారత్‌కు తమ మద్దతు ఉంటుందని తెలిపింది.

నేటితో బదిలీల ప్రక్రియ పూర్తి

» ఇప్పటివరకూ 25,397 ఎస్జీటీల బదిలీ

అమరావతి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీల ప్రక్రియ దాదాపుగా పూర్తయ్యింది. ఇప్పటివరకూ 11 జిల్లాల్లో బదిలీలు పూర్తికాగా మరో రెండు జిల్లాల్లో ఆదివారం పూర్తవుతాయని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు తెలిపారు. పశ్చిమగోదావరి, కృష్ణా, కర్నూలు, కడప, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో శనివారం రాత్రితో బదిలీలు పూర్తయ్యాయి. అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో నేడు పూర్తయ్యే అవకాశం ఉంది. మొత్తం 31,072 మంది బదిలీల్లో ఉండగా శనివారం సాయంత్రానికి 25,397 మంది బదిలీ అయ్యారు. కాగా, బదిలీలు పూర్తయినవారు సోమవారం కొత్త పాఠశాలల్లో చేరేవిధంగా వెంటనే బదిలీల ఆర్డర్లు సిద్ధంచేయాలని అధికారులు ఆదేశించారు. ప్రభుత్వం వెబ్ కౌన్సెలింగ్ ఆధారంగా బదిలీలు చేపట్టాలని నిర్ణయించినా, ఉపాధ్యాయులు పట్టుబట్టడంతో మాన్యువల్‌గా కౌన్సెలింగ్ చేపట్టారు. అయినా వేగవంతంగా బదిలీలు పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ఉపాధ్యాయ సంఘాల హర్షం

అమరావతి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): తక్కువ సమయంలో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు సమర్థవంతంగా నిర్వహించడం పట్ల ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం(ఆప్టా) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏజీఎస్ గణపతిరావు, కె.ప్రకాశ్‌రావు హర్షం వ్యక్తంచేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు, ఉన్నతాధికారులకు ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులకు తల్లికి వందనం, స్కూళ్లు, సంక్షేమ హాస్టళ్లలో సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయడంపై తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్, మోడల్ స్కూల్స్ సంఘం అధ్యక్షుడు కె.శివశంకర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు జోన్ల వారీగా మధ్యాహ్న భోజనం మెనూ అమలు ఏపీలోనే జరుగుతోందన్నారు.

ఫీజు బకాయిలు చెల్లించకపోతే పోరాటం

» ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల సంఘం

అమరావతి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక భారంతో కాలేజీలు నడపలేని పరిస్థితి ఏర్పడిందని ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల సంఘం తెలిపింది. 2023-24లో మూడు క్వార్టర్లు, 2024-25లో రెండున్నర క్వార్టర్ల ఫీజులు ప్రభుత్వం నుంచి విడుదల కావాల్సి ఉందని పేర్కొంది. సంఘం సర్వసభ్య సమావేశం శనివారం విజయవాడలో జరిగింది. సమావేశం అనంతరం సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి మధుసూదన్‌రావు, కోశాధికారి గ్రంధి సత్యనారాయణ విలేకరులతో మాట్లాడారు. సుమారు రూ.3వేల కోట్ల ఫీజుల బకాయిలు ఉన్నాయని చెప్పారు. ఎక్కువ శాతం ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా చేరిన విద్యార్థులే ఉన్నారని తెలిపారు. సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నామని, ఈ విషయాన్ని ఇప్పటికే మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగా, జూలైలో ఫీజులు ఇస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ప్రభుత్వ హామీ ప్రకారం జూలైలో బకాయిలు విడుదల చేయాలని, లేనిపక్షంలో తప్పనిసరి పరిస్థితుల్లో పోరాటానికి దిగక తప్పదని పేర్కొన్నారు.

ఆపరేషన్ సిందూర్ ఎయిర్ ఫోర్స్ శక్తికి నిదర్శనం

» భారత వైమానిక దళాధిపతి అమర్‌ప్రీత్ సింగ్

అల్వాల్, జూన్14(ఆంధ్రజ్యోతి): భారత వైమానిక దళ సామర్థ్యం, పోరాట పటిమ, కార్యాచరణకు ఆపరేషన్ సిందూర్ నిదర్శనంగా నిలిచిందని ఎయిర్ ఫోర్స్ చీఫ్ అమర్‌ప్రీత్ సింగ్ అన్నారు. శనివారం దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో నిర్వహించిన కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 254మంది ఫ్లైట్ కేడెట్లు నిర్వహించిన కవాతును తిలకించారు. వారికి ప్రెసిడెంట్ కమిషన్‌తో పాటు వింగ్స్‌ను ప్రదానం చేశారు. పరేడ్ అనంతరం ఎయిర్ ఫోర్స్ అకాడమీలో ప్రదర్శించిన స్కై డైవింగ్, సుఖోయ్-30, ఆకాశ్, సూర్య కిరణ్, పిలాటస్ పీసీ-7 ఎయిర్ క్రాఫ్టల విన్యాసాలు అబ్బురపరిచాయి. వాయుసేనకు చెందిన ఎయిర్ వారియర్ డ్రిల్ టీమ్ చేసిన విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.



సర్వదర్శన క్యూలైన్లో భక్తులు

తిరుమల కిటకిట

» సర్వదర్శనానికి 18 గంటలు.. రెండు కిలోమీటర్ల మేర క్యూ

తిరుమల, జూన్ 14(ఆంధ్రజ్యోతి): స్కూళ్లు ప్రారంభమైనా తిరుమలలో రద్దీ తగ్గలేదు. వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన శనివారం భక్తులతో నిండిపోయాయి. కృష్ణతేజ విశ్రాంతి భవనం మీదుగా రింగురోడ్డులో శ్రీవారిసేవా సదన్ వరకు దాదాపు రెండు కిలోమీటర్ల మేర క్యూలైన్ ఉంది. దీంతో దర్శనానికి 18 గంటల సమయం పడుతోంది. కల్యాణకట్టలు, లడ్డూ కేంద్రం, అఖిలాండం, అన్నప్రసాద భవనాలూ రద్దీగా మారాయి. నడకమార్గాలు కూడా కిటకిటలాడుతున్నాయి. అలిపిరి పాదాల మండపం కూడా భక్తులతో రద్దీగా కనిపించింది. ఆదివారానికి సంబంధించిన స్లాటెడ్ సర్వదర్శన టోకెన్లు శనివారం సాయంత్రం 5 గంటల తర్వాత జారీ చేస్తారని తెలిసినా.. ఉదయం నుంచే భక్తులు క్యూలైన్లకు చేరుకున్నారు.

అసైన్డ్ భూములకు రెక్కలు

(మొదటి పేజీ తరువాయి)

కీలకమైన ఓ పెద్దమనిషిని ముందుపెట్టి విశాఖ కేంద్రంగా అసైన్డ్ భూములను చేజిక్కించుకునే ప్రయత్నాలు మళ్లీ ప్రారంభించారు. ఇందులో రూ.75 కోట్ల విలువైన ఓ ఐదు ఎకరాల భూమిని అడ్డదారిలో చేజిక్కించుకున్నారు. ఫలితంగా రెవెన్యూ పెద్దమనిషికి మూడు ఎకరాలు, ఈయనకు రెండు ఎకరాల చొప్పున వాటాల పంపిణీ జరిగింది. మనోరమ హిల్స్ సమీపంలోని అత్యంత ఖరీదైన 5 ఎకరాల డీ పట్టా భూమిని ఓ మాజీ మంత్రికి సెటిల్ చేసేందుకు ఇప్పుడు పావులు కదుపుతున్నారు. ఇలా రెండో మూడో కాదు..ఏకంగా 46 ఎకరాల డీ పట్టా భూమిని సెటిల్ చేసేందుకు విజయవాడ కేంద్రంగా విశాఖ రెవెన్యూ అధికారులతో కీలక సమావేశాలు జరుగుతున్నాయి. నాటి టీడీపీ ప్రభుత్వం 2016లో జీవో 279 జారీ చేసింది. దీని ప్రకారం, మాజీ సైనికులు, స్వాతంత్ర్య సమరయోధులు, రాజకీయ బాధితులకు అసైన్డ్ చేసిన భూములకు పదేళ్ల కాలపరిమితి తీరితే ఇక వాటికి ప్రభుత్వం నుంచి ఎలాంటి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) తీసుకోనక్కరలేదు. ఈ జీవో ప్రకారం 10 ఏళ్ల కాలపరిమితి దాటిన మాజీ సైనికులు, రాజకీయ బాధితులు, స్వాతంత్ర్య సమర యోధుల భూముల రిజిస్ట్రేషన్, క్రయవిక్రయాలకు ఎన్‌వోసీలు అక్కరలేదని, వాటికి ఏపీ అసైన్‌మెంట్ చట్టం-1977లోని భూ బదలాయింపు నిషేధం వర్తించదని రెవెన్యూశాఖ గడిచిన 8 ఏళ్లలో 15 ఆదేశాలు ఇచ్చింది. అయినా, మళ్లీ ఎన్‌వోసీ డ్రామాను తెరపైకి తీసుకొచ్చి ఈ నేత మాజీ సైనికుల కుటుంబాలను బురిడీ కొట్టించి మరీ భూములు హస్తగతం చేసుకుంటున్నారు. ఇందుకు రెవెన్యూశాఖలోని ఓ పెద్దమనిషి, విశాఖలోని ఓ మాజీ మంత్రి, మరి కొందరు తోడవ్వడం సదరు భూమి యజమానులను తీవ్ర కలవరానికి గురిచేస్తోంది. కూటమి వచ్చాక అసైన్డ్ భూముల దందా నిలిచిపోయిందని ఒకవైపు ప్రభుత్వం చెబుతోంటే, తెరవెనుక ఈ నేత ఆ భూములను చెరపట్టి చీకటి ఒప్పందాలు చేసుకునే పనిలో ఉండటం ప్రభుత్వానికి పెనుసవాల్ విసరడమే.

జీవో అలా.. ఎన్‌వోసీ గొడవ ఇలా..

జీవో 279ని అనుసరించి.. మూడు కేటగిరీల డీ పట్టా భూములకు పదేళ్ల కాలపరిమితి దాటాక రిజిస్ట్రేషన్ చట్టం-1908లోని నిషేధ జాబితా 22(ఏ) నుంచి తొలగించాలి. దీంతో లబ్ధిదారులకు ఆ భూమిపై పూర్తి హక్కులు వస్తాయి. ఆ భూములను తాకట్టుపెట్టుకోవచ్చు. ఇంకా ఆర్థిక అవసరాలకు అమ్ముకోవచ్చు. ఇందుకోసం జిల్లా కలెక్టర్ నుంచి ఎన్‌వోసీ తీసుకోవాల్సిన అవసరం లేదని ఆ ఉత్తర్వులో ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, ఈ కేటగిరీ భూముల రిజిస్ట్రేషన్ సమయంలో జీవో 279 ప్రకారం ఎన్‌వోసీలు అడగరాదని రిజిస్ట్రేషన్ శాఖను ప్రభుత్వం ఆదేశించింది. దీని అమలుకోసం అనేకానేక మార్గదర్శకాలు, సర్క్యులర్ ఉత్తర్వులు విడుదల చేసింది. అయితే, ఈ విషయం చాలా మందికి తెలియదు. ప్రభుత్వం నుంచి డీ పట్టా భూములు పొందిన మాజీ సైనికుల కుటుంబాలకు అసలు అవగాహనే లేదు. కలెక్టర్ దగ్గర ఎన్‌వోసీ తీసుకుంటేనే భూమి ఫ్రీ హోల్డ్ అవుతుందని, ఆ తర్వాతే రిజిస్ట్రేషన్ చేస్తారని రియల్ ఎస్టేట్ బ్రోకర్లు, కొందరు అధికారులు వారిని తప్పుదోవ పట్టిస్తున్నారు. దీంతో అవసరమే లేని ఎన్‌వోసీ ఇప్పించడం పెద్ద వ్యాపారంగా మారింది. కొందరు ఎన్‌వోసీలు ఇప్పిస్తాం అంటూ కోట్లు దండుకుంటుంటే, మరి కొందరు కోట్ల విలువచేసే ఆ భూములనే కొట్టేస్తున్నారు. ఇందులో విశాఖకు చెందిన ఓ నేత సిద్ధహస్తుడు. గతంలో వైసీపీలో ఉన్న ఆయన ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. జగన్ ప్రభుత్వంలో వైసీపీ నేతగా ఆయన ఎన్‌వోసీలు ఇప్పించే వ్యాపారమే చేశారు. కూటమి వచ్చాక అదే పని మళ్లీ ప్రారంభించారు.

మనోరమ హిల్స్‌పై కన్ను...

ఎవ్వరికీ ఎలాంటి ఎన్‌వోసీలు ఇవ్వకూడదని రెవెన్యూశాఖలోని ఓ కీలక పెద్ద మనిషి విశాఖ అధికారులకు అనధికారిక హుకుం జారీ చేయించారు. ఒక వేళ ఏ భూమికైనా ఎన్‌వోసీ కావాలనుకుంటే రెవెన్యూశాఖలో అత్యున్నత స్థాయి నుంచి అన్ని రకాల అనుమతులు తీసుకోవాలని, అంతిమంగా కలెక్టర్ ఆదేశాలు ఇవ్వాలని మౌఖిక ఆదేశాలు ఇప్పించారు. ఇది జీవో 279కి పూర్తి విరుద్ధం. అయితే, ఇది అమలయితేనే తమ వద్దకు భూముల పంచాయతీలు వస్తాయని భావించిన రెవెన్యూ పెద్ద నిబంధనలకు విరుద్ధమైన పనులు చేసేలా అధికారులపై ఒత్తిడిచేశారు. ఇదే పనిగా, విశాఖకు చెందిన ఓ నేతతో ఎండాడలోని ఐదు ఎకరాల భూమి ఫైలును తెప్పించుకున్నారు. నాటి రెవెన్యూ అధికారితో కలిసి గుట్టుగా ఫైల్‌ను సెటిల్ చేయించారు. ఫలితంగా రెవెన్యూ పెద్దకు మూడు ఎకరాలు, విశాఖ నేతకు రెండు ఎకరాల భూమి దక్కింది. ఇప్పుడు ఈ భూమిని 700 గజాల చొప్పున విడగొట్టి అమ్మేస్తున్నారు. భూమికి అసలు యజమాని అయిన మాజీ సైనికుడి కుటుంబానికి ఈ నేత ఇచ్చిన సొమ్ము కేవలం రూ.25 లక్షల మాత్రమే. ఈ విషయం తెలిసి విశాఖకు చెందిన ఓ మాజీ మంత్రి భూమిని సెటిల్ చేయించిన నేతను పిలిపించారు. తనకు తెలియకుండా ఆ భూమికి ఎలా ఎన్‌వోసీ ఇప్పించారని నిలదీశారు. ఫలితంగా రెండున్నర కోట్ల ప్యాకేజీ మాట్లాడుకొని ఇంటికి తీసుకెళ్లి సమర్పించినట్లు తెలిసింది. అయితే, ఇది సరిపోదని, మొత్తం రెండు ఎకరాలు తనకే కావాలని పేచీపెట్టడంతో, ప్రత్యామ్నాయంగా మనోరమ హిల్స్ పక్కనే ఉన్న మరో ఐదు ఎకరాల భూమిని సెటిల్ చేయిస్తానని మాటిచ్చినట్లు తెలిసింది. ఈ భూమి నెల్లూరు జిల్లాకు చెందిన ఓ మాజీ మంత్రి కుటుంబం నియంత్రణలో ఉంది. అది కూడా ఓ మాజీ సైనికుడి కుటుంబం నుంచి లాక్కున్నదే. అయితే, ఎండాడలోని ఐదు ఎకరాల కేసు విజయవంతంగా సెటిల్ కావడంతో ఆ నేత పెందుర్తి, ఎండాడ, భీమిలి ప్రాంతాల్లోని 60 ఎకరాల డీపట్టాలపై కన్నేశారు. ఇప్పుడు పెద్ద దుకాణమే తెరిచారు. విశాఖ కేంద్రంగా జరుగుతున్న కార్యక్రమాల్లో ఆయనకు పెద్దపీట వేయిస్తున్నారు. ఇటీవల ప్రధాని వచ్చినప్పుడు ఆయనకు ఎయిర్‌పోర్టులోనే స్వాగతం పలికేందుకే తన వెంట తీసుకెళ్లారు. అప్పట్లోనే ఈ వ్యవహారం రచ్చకెక్కింది.



మురళీనాయక్ తల్లిదండ్రులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యేలు

వీర జవాన్ కుటుంబానికి రూ.25 లక్షల సాయం

» మాట నిలుపుకొన్న ఉప ముఖ్యమంత్రి పవన్

» చెక్కు అందజేసిన జనసేన ఎమ్మెల్యేలు

హిందూపురం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందిన అగ్నివీర్ సైనికుడు మురళీనాయక్ కుటుంబానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లి తండాకు చెందిన మురళీనాయక్ కశ్మీర్‌లో మే 9న వీరమరణం పొందారు. 11న అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పవన్... ఆ కుటుంబానికి రూ.25 లక్షల సాయం ప్రకటించారు. ఇందుకు సంబంధించిన చెక్కును జనసేన తిరుపతి, పాలకొండ ఎమ్మెల్యేలు అరణి శ్రీనివాసులు, జయకృష్ణ శనివారం వీర జవాన్ కుటుంబానికి అందజేశారు.

20, 21 తేదీల డీఎస్సీ పరీక్షలు మార్పు

అమరావతి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈనెల 20, 21 తేదీల్లో జరగాల్సిన మెగా డీఎస్సీ పరీక్షల తేదీలను మార్చినట్లు కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రెండు రోజుల్లో పరీక్షలు జరగాల్సిన అభ్యర్థులకు జూలై 1, 2 తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తామని, ఈమేరకు హాల్‌టికెట్లను ఈనెల 25న ఏపీడీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. యోగా దినోత్సవం వల్ల పరీక్షలకు హాజరయ్యే వారుఇబ్బందులకు పడకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

సమస్యలపై గొంతెత్తితే...

దృష్టి మళ్లించే ప్రయత్నం దుర్మార్గం: జగన్

అమరావతి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): 'రైతుల సమస్యలపై గొంతెత్తితే దాన్ని డైవర్ట్ చేయడానికి చంద్రబాబు ప్రయత్నం చేయడం దుర్మార్గం. పొదిలి కార్యక్రమానికి వచ్చిన రైతులను, ప్రజలను రౌడీలుగా అభివర్ణించడం దిగజారుడుతనం' అని వైసీపీ అధినేత జగన్ అన్నారు. శనివారం ఆయన ఎక్స్ వేదికగా పొదిలి ఘటనలో పోలీసులు పెట్టిన కేసులపై స్పందించారు. 'పొగాకు రైతులకు భరోసా ఇవ్వడానికి నేను పొదిలి వెళ్తే కార్యక్రమానికి సంఘీభావంగా సుమారు 40 వేల మంది ప్రజలు, రైతులు వచ్చారు. మేం వెళ్తున్న మార్గంలో చంద్రబాబు 40 మంది టీడీపీ కార్యకర్తలను పెట్టి, వారిని ఉసిగొల్పి, రాళ్లు విసిరి గలాటా చేయించారు. ప్రజలు, రైతులు ఆ పన్నాగాన్ని అర్థం చేసుకుని అత్యంత సంయమనంతో వ్యవహరించారు. అలాకాకుండా 40 వేల మంది ప్రతిస్పందించి ఉంటే ఏం జరిగి ఉండేది చంద్రబాబు గారూ? పైగా ఉల్టా రైతులపై, ప్రజలపై కేసులు పెడతారా? రోమ్ చక్రవర్తి ఫిడేలు వాయించినట్లు... ఆ రైతుల సమస్యలను పట్టించుకోకుండా తిరిగి వారిపైనే ఎదురు కేసులు పెట్టడం మీకు మాత్రమే చెల్లుతుంది' అని జగన్ విమర్శించారు.

మా నేతలపై కేసులు కామన్

» జైళ్లను మంచి కండిషన్‌లో పెట్టండి

» ప్రభుత్వం మారిన తరువాత టీడీపీ నేతలకు పనికొస్తాయి: మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి

» జైలులో కాకాణితో పెద్దిరెడ్డి సహా నేతల ములాఖత్



జైలులో కాకాణిని కలసి వస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఇతర వైసీపీ నాయకులు

నెల్లూరు(క్రైం), జూన్ 14(ఆంధ్రజ్యోతి): 'కూటమి ప్రభుత్వంలో రానున్న నాలుగేళ్లు వైసీపీ నాయకులపై కేసులు పెట్టడం కామన్‌గా మారుతుంది' అని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరమణారెడ్డి అన్నారు. నెల్లూరు జిల్లా కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో శనివారం పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీ అనంత వెంకటరామిరెడ్డిలతో కలసి కేతిరెడ్డి ములాఖత్ అయ్యారు. అనంతరం మీడియాతో కేతిరెడ్డి మాట్లాడుతూ... 'కూటమి ప్రభుత్వంలో విద్యాసంస్థల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించలేరు. కనీసం జైల్లో అయినా మంచి సౌకర్యాలు కల్పిస్తే ప్రభుత్వం మారిన తర్వాత టీడీపీ నేతలు జైలుకు వచ్చినప్పుడు పనికొస్తాయి' అని అన్నారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ... 'గతంలో ఎప్పుడు లేనివిధంగా దొంగలకు పోలీసులు పీటీ వారెంట్లు వేసినట్లు ఈ ప్రభుత్వంలో రాజకీయ నాయకులపై పోలీసులు పిటీ వారెంట్లు వేస్తున్నారు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రేపటి వరకు జైల్లోనే కొమ్మినేని

» వరుస సెలవులతో బెయిల్ జాప్యం



గుంటూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రాజధాని ప్రాంత మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన కేసులో జైల్లో ఉన్న నిందితుడు(ఏ2), సాక్షి యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావు బెయిల్‌పై బయటకు వచ్చేందుకు వరుస సెలవులు అడ్డంకిగా మారాయి. దీంతో సోమవారం వరకు ఆయన జైల్లోనే ఉండాల్సి ఉంటుందని ఆయన తరఫు న్యాయవాదులు తెలిపారు. ఈ నెల 6న సాక్షి చానల్ డిబేట్‌లో రాజధాని ప్రాంత మహిళలపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన ఎనలిస్టు కృష్ణంరాజును ప్రధాన నిందితుడిగా, ఆయన చేసిన వ్యాఖ్యలను ఖండించకుండా ప్రోత్సహించినట్లుగా మాట్లాడిన కొమ్మినేనిని ఏ2గా, సాక్షి యాజమాన్యాన్ని ఏ3గా పేర్కొంటూ తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితుడైన కొమ్మినేనిని ఈ నెల 9న పోలీసులు అరెస్టు చేసి 10న మంగళగిరి కోర్టులో హాజరు పరచగా ఆయనకు మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో ఆయనను గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. అయితే, ఆయన దీనిపై హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా అది విచారణలో ఉన్న సమయంలోనే.. సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు.. ట్రయల్ కోర్టు విధించే షరతులకు లోబడి బెయిల్ ఇస్తున్నట్లు శుక్రవారం ప్రకటించింది. అయితే, సుప్రీంకోర్టు ఉత్తర్వులు శుక్రవారం సాయంత్రం వరకు రాకపోవడంతో కొమ్మినేని విడుదల జాప్యమైంది. మరుసటి రోజు రెండవ శనివారం సెలవు అయినప్పటికీ మెజిస్ట్రేట్‌ను ఇంటి వద్ద కలసి బెయిల్ ఆదేశాలు తీసుకోవాలని ఆయన న్యాయవాదులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో సోమవారం న్యాయవాదులు ట్రయల్ కోర్టులో కొమ్మినేని బెయిల్ ఉత్తర్వులు పొందనున్నారు. దీంతో సోమవారం సాయంత్రానికి గాని కొమ్మినేని బయటకు వచ్చే అవకాశం ఉండదని న్యాయవాదులు తెలిపారు. ఇదిలావుంటే, ఈ కేసులో ప్రధాన నిందితుడైన(ఏ1) కృష్ణంరాజు ప్రస్తుతం గుంటూరు జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. కొమ్మినేనికి వైసీపీకి చెందిన లీగల్ సెల్ న్యాయవాదులు బెయిల్ కోసం ప్రయత్నాలు చేశారు. అయితే, కృష్ణంరాజు మాత్రం సొంతంగా న్యాయవాదిని పెట్టుకున్నట్లు తెలిసింది.

తుంగభద్ర నీటి నిల్వ 80 టీఎంసీలే!

» ఖరీఫ్ పంటకు, తాగునీటికి మాత్రమే అవకాశం

» క్రస్ట్‌గేట్లు దెబ్బతిన్న నేపథ్యంలో బోర్డు నిర్ణయం

» రబీ పంటకు సాగు నీరు ఉండకపోవచ్చు!

» గేట్లను వచ్చే జూన్ నాటికి మార్చాలని లక్ష్యం

» రూ.58 కోట్లతో ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి



తుంగభద్ర జలాశయం

కర్నూలు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): దెబ్బతిన్న తుంగభద్ర ప్రాజెక్టు 32 క్రస్ట్‌గేట్లను మార్చాల్సి ఉన్న నేపథ్యంలో 2025-26 నీటి సంవత్సరంలో డ్యాంలో నీటి నిల్వను 80 టీఎంసీలకు పరిమితం చేయాలని బోర్డు అధికారులు నిర్ణయించారు. డ్యాం గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం(105.85 టీఎంసీలు)లో 25 టీఎంసీలు తగ్గనుండడం, డిసెంబరు నాటికి స్పిల్‌లెవల్ 1,613 అడుగుల దిగువకు నీటి నిల్వ పడిపోయే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ ఏడాది ఖరీఫ్ పంట సాగుకు, తాగునీటి అవసరాలకు మాత్రమే నీరు ఇవ్వాలని ఇటీవల జరిగిన టీబీపీ బోర్డు అత్యవసర సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. రబీకి నీరు ఉండకపోవచ్చని, ఆయకట్టు రైతులు సహకరించాలని అధికారులు కోరుతున్నారు. ఈ ఏడాది డ్యాంలో 80 టీఎంసీలు నిల్వ చేసి.. ఆపై వచ్చే వరదను కాలువలకు, దిగువ నదికి విడుదల చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఇందుకు ఏపీ, కర్ణాటక ప్రభుత్వాలు కూడా సమ్మతించాయి. రబీకి సాగునీరు ఉండకపోవచ్చని, ప్రత్యామ్నాయం చూసుకోవాల్సి ఉంటుందని అధికారులు సూచించినట్లు తెలుస్తుంది.

అన్ని గేట్లు మార్చాల్సిందే..

తుంగభద్ర క్రస్ట్‌గేట్లు అన్నింటినీ మార్చాల్సిందేనని డ్యాంను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసిన కేఎస్ఎన్‌డీటీ సర్వీసెస్ సంస్థ టీబీపీ బోర్డుకు నివేదిక ఇచ్చిన విషయం తెలిసిందే. ఏపీ జలవనరుల శాఖ సలహాదారుడు కన్నయ్యనాయుడు ఏప్రిల్ 8, 9వ తేదీల్లో డ్యాంను సందర్శించి.. ప్రతి గేటును తనిఖీ చేశారు. ఏకే బజాజ్ కమిటీ, కేఎస్ఎన్‌డీటీ నివేదికలు పరిశీలించారు. ప్రాజెక్టు భద్రత దృష్ట్యా ఈ నీటి సంవత్సరంలో 80 టీఎంసీలు మాత్రమే నిల్వ చేయాలని ఆయన సూచించారు. నిపుణుల కమిటీ, అధ్యయన సంస్థ నివేదిక, కన్నయ్యనాయుడు సూచనల నేపథ్యంలో తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు పై మేరకు నిర్ణయం తీసుకుంది. క్రస్ట్ గేట్ల మార్పునకు అధికారులు రూ.58 కోట్లతో ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తిచేశారు. అహ్మదాబాద్‌కు చెందిన హార్డ్‌వేర్ టూల్స్ సంస్థ పనులను దక్కించుకుంది. వచ్చే ఏడాది జూన్ ఆఖరులోగా గేట్లు అమర్చే పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కాగా, గేట్ల మార్పు పనులు దృష్ట్యా డ్యాం నీటి నిల్వ సామర్థ్యాన్ని 105.85 టీఎంసీల నుంచి 80 టీఎంసీలకు తగ్గించారు. దీంతో 2025-26 నీటి సంవత్సరంలో 120 టీఎంసీల వరద డ్యాంలో చేరే అవకాశం ఉందని టీబీపీ బోర్డు వాటర్ రివ్యూ కమిటీ అంచనా వేసింది. కేడబ్ల్యూడీటీ-1 అవార్డు ప్రకారం కర్ణాటక వాటా జలాలు 138.990 టీఎంసీలకు గానూ 78.674, ఏపీ వాటా 66.500 టీఎంసీలకు గానూ 37.642, తెలంగాణ వాటా 6.510 టీఎంసీలకు గాను 3.685 కేటాయించారు. ఏపీ కోటాలో కర్నూలు జిల్లా టీబీపీ ఎల్ఎల్‌సీ కాలువకు 24 టీఎంసీలకు గానూ 13.585, కేసీ కాలువకు 10 టీఎంసీలకు గానూ 5.660 టీఎంసీలు కేటాయించారు.

పొదిలి సీఐపై చెవిరెడ్డి దౌర్జన్యం

» దాడి కేసులో నిందితులను కలిసేందుకు స్టేషన్‌లోకి చొచ్చుకెళ్లే ప్రయత్నం

» అడ్డుకున్న పోలీసులు.. సీఐతో వాగ్వాదం

» ఎల్లకాలం మీ ఆటలు సాగవంటూ హెచ్చరిక



సీఐ వెంకటేశ్వర్లుతో వాగ్వాదం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి

పొదిలి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రకాశం జిల్లా పొదిలి పోలీస్ స్టేషన్‌లో శనివారం వీరంగం సృష్టించారు. ఈనెల 11న పొదిలిలో మహిళలు, పోలీసులపై దాడి చేసిన నిందితులను స్టేషన్‌లో కలిసేందుకు ఆయన తీవ్రంగా ప్రయత్నించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించిన చెవిరెడ్డిని సీఐ టి.వెంకటేశ్వర్లు అడ్డుకున్నారు. అసహనంతో ఊగిపోయిన చెవిరెడ్డి స్టేషన్ ముందు ధర్నా చేస్తామంటూ హెచ్చరించారు. ఈసందర్భంలో సీఐపై దౌర్జన్యానికి దిగి.. దురుసుగా మాట్లాడారు. వైసీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని, ఎల్లకాలం మీ ఆటలు సాగవన్నారు. ఒక దశలో సీఐ, చెవిరెడ్డి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. అక్రమ కేసులు పెట్టే ఉద్దేశమే తమకు లేదని సీఐ స్పష్టం చేశారు. అనంతరం తొమ్మిది మంది నిందితులను పొదిలి జూనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టులో హాజరుపరిచారు. కోర్టుకు చెవిరెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, ఉడుముల శ్రీనివాసరెడ్డి వచ్చారు. లోపలికి రాకూడని హెచ్చరించడంతో బయట వేచి ఉన్నారు.

రాళ్లదాడి కేసులో మరో 15 మంది అరెస్ట్

ఈనెల 11న పొదిలిలో మాజీ సీఎం జగన్ పర్యటన సందర్భంగా వైసీపీ అల్లరి మూకలు మహిళలు, పోలీసులపై దాడి చేసిన ఘటన కేసు దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. 12న తొమ్మిది మంది నిందితులను అరెస్ట్ చేయగా, శనివారం మరో 15 మందిని కూడా అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వేమన తెలిపారు. ముందస్తు వ్యూహంలో భాగంగానే దాడులకు పాల్పడినట్లు గుర్తించామన్నారు. వాట్సాప్ చాటింగ్‌లను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఈ దాడులకు పాల్పడినట్లు వెల్లడించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలనే ఉద్దేశంతోనే ఇది జరిగినట్లు భావిస్తున్నామన్నారు. అన్ని ఫుటేజీలను పరిశీలిస్తున్నామని దాడికి పాల్పడిన వారిని అందరినీ గుర్తించి అరెస్టు చేస్తామన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.